

'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 268

మంగళవారం 19-12-2023



31% కాదు.. 60%!
వాతావరణంలో కలిసే వ్యవసాయ ఉద్గారాలపై పాలేకర్ అంచనా -11లో




ఎవరికి అందలం!
దుబాయ్‌లో నేడు ఐపీఎల్ మినీ వేలం. 77 ఖాళీల కోసం 333 ఆటగాళ్లు -12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు
మెక్సికోలో క్రిస్మస్ సీజన్ వేడుకలు రక్తసిక్తం అయ్యాయి. గ్వానజువాటో రాష్ట్రంలో జరిగిన కాల్పుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸



కోర్టుకు 'జ్ఞానవాపి' నివేదిక
వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో చేపట్టిన శాస్త్రీయ సర్వే నివేదికను ఏఎస్ఐ సీల్డు కవర్‌లో వారణాసి జిల్లా కోర్టుకు సమర్పించింది.
వివరాలు 6లో ▸



ఉగ్ర కుట్ర భగ్నం
పేలుళ్లకు పథక రచన చేసిన అనుమానిత ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్ట్‌చేసింది. 19 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది.
వివరాలు 6లో ▸



రికార్డు ర్యాలీకి బ్రేక్
స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 169 పాయింట్లు నష్టపోయి 71,315 వద్ద స్థిరపడింది.
వివరాలు 13లో ▸

● సస్పెన్షన్ల పర్వం...

78 మందిపై వేటు

భద్రతా వైఫల్యంపై పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

- లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు, నిరసనల హోరు
- హోం మంత్రి అమిత్ షా వివరణకు, రాజీనామాకు డిమాండ్
- లోక్‌సభ నుంచి 33, రాజ్యసభ నుంచి 45 మంది సస్పెన్షన్
- వారిలో 14 మందిపై సభా హక్కుల కమిటీ విచారణకు ఆదేశాలు
- అప్పటిదాకా పార్లమెంటు నుంచి బహిష్కరణ
- మిగతా వారిపై సెషన్ ముగిసేదాకా వేటు.. ఈ సెషన్లో మొత్తం 92 మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్



సస్పెండైన పార్లమెంట్ సభ్యులు ఆందోళన చేస్తున్న దృశ్యం

పార్లమెంట్‌లో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్లమెంటు భద్రతా వైఫల్యంపై నినాదాలు, నిరసనలతో హోరెత్తించిన క్రమంలో ఏకంగా 78 మంది విపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది! వీరిలో 33 మంది లోక్‌సభ సభ్యులు కాగా 45 మంది రాజ్యసభ సభ్యులున్నారు. ఒకే రోజు ఇంతమందిని బహిష్కరించడం పార్లమెంటు చరిత్రలోనే ఇదే తొలిసారి. గత వారమే 13 మంది లోక్‌సభ, ఒక రాజ్యసభ సభ్యునిపై సస్పెన్షన్ వేటు పడటం తెలిసిందే. దీంతో ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సస్పెండైన విపక్ష సభ్యుల సంఖ్య 92కు చేరింది. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరణ, రాజీనామాకు డిమాండ్ చేయడమే వీరి సస్పెన్షన్‌కు కారణం. సస్పెన్షన్లపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన బిల్లులపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా మోదీ సర్కారు కుట్ర పన్నిందని, అందుకే తమను సస్పెండ్ చేసిందని మండిపడ్డారు.
6లో

ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో..



కొత్త పారిశ్రామిక వాడల ఏర్పాటు

- 500 నుంచి 1,000 ఎకరాల భూములను గుర్తించండి: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ, బంజరు భూముల్లోనే కొత్త పరిశ్రమల ఏర్పాటు
- పారిశ్రామిక అవసరాలకు సౌర విద్యుత్ వినియోగించాలి
- కంపెనీలకు కేటాయించిన భూముల స్థితిగతులపై నివేదిక ఇవ్వండి
- పారిశ్రామికాభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిశ్రమల కోసం ఇప్పటి వరకు కేటాయించిన భూములకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కేటాయించిన భూముల్లో వినియోగంలో లేని వాటి వివరాలతోపాటు ఏర్పాటైన పరిశ్రమల స్థితిగతులపైనా నివేదిక సమర్పించాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలసి సోమవారం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త పారిశ్రామికవాడలను ఏర్పాటు చేసేందుకు వీలుగా హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)కు వెలుపల.. కొత్తగా నిర్మితమయ్యే రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు లోపల ఉండేలా భూములు గుర్తించాలన్నారు. విమానాశ్రయాలు, జాతీయ, రాష్ట్ర రహదారులకు 50 నుంచి 100 కిలోమీటర్ల దూరంలోపు 500 నుంచి 1,000 ఎకరాల విస్తీర్ణంలో ఈ భూములు ఉండాలని రేవంత్ సూచించారు.

సాగుకు యోగ్యం కాని భూముల్లో...

సాగుకు యోగ్యం కాని భూములనే పరిశ్రమల ఏర్పాటుకు సేకరించడం ద్వారా రైతులకు నష్టం జరగదని రేవంత్ పేర్కొన్నారు. తద్వారా కాలుష్య సమస్య తగ్గడంతోపాటు అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందన్నారు. హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో నివాస ప్రాంతాలకు దూరంగా ఉండే ప్రభుత్వ, బంజరు భూములను గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తద్వారా తక్కువ ధరలో భూములు
మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

డ్రగ్ పెడ్లర్‌గా మారిన భగ్న ప్రేమికుడు!



ప్రేమలో విఫలమై డ్రగ్స్‌కు అలవాటుపడ్డ ఓ యువకుడు డ్రగ్ పెడ్లర్‌గా మారి హైదరాబాద్‌తో పాటు నెల్లూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీర్లకు సరఫరా చేస్తున్నాడు. ఇతనితో సహా 14 మందిని టీఎస్ న్యాబ్ అరెస్టు చేసింది.
- వివరాలు 14లో▶

కమలం 'లోక్‌సభ' కసరత్తు



లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ కసరత్తు మొదలు పెట్టింది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణను వేగవంతం చేసింది. 17 నియోజకవర్గాలకు విస్తారక్‌లను నియమించేందుకు చర్యలు చేపడుతోంది.
- వివరాలు 2లో▶

కొలిక్కిరాని మేడిగడ్డ పునరుద్ధరణ!



'కాళేశ్వరం'లో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ వ్యవహారం కొలిక్కి రాలేదు. మంత్రి ఉత్తమ్ సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు, ఎల్అండ్‌టీ బృందంతో సమావేశమై దీనిపై చర్చించారు.
- వివరాలు 5లో▶

కోవిడ్ కేసులు పైపైకి



దేశంలో కోవిడ్ కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. కరోనా కొత్త సబ్‌వేరియంట్ జేఎన్1 (బీఏ 2.86.1.1) వెలుగుచూసిన నేపథ్యంలో కేంద్రం సోమవారం ముందస్తు చర్యలకు దిగింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.
- వివరాలు 6లో▶





బేగంపేట విమానాశ్రయంలో సోమవారం రాత్రి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో గవర్నర్ తమిళిసై

నగరంలో రాష్ట్రపతి

- బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ద్రౌపదీ ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- ఈనెల 23 వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న ముర్ము.. నేడు హెచ్‌పీఎస్ శతాబ్ది వేడుకల్లో పాల్గొననున్న రాష్ట్రపతి

3లో

బానిస మనస్తత్వం నుంచి

విముక్తి...

- ఎర్రకోట పైనుంచి భారత్ విముక్తిని ప్రకటించుకుంది.. శరవేగంగా రామ్ సర్క్యూట్ అభివృద్ధి పనులు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- వారణాసిలో స్వర్‌వేద్ మహామందిర్ ప్రారంభం

6లో



ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం స్వర్‌వేద్ మహామందిర్‌ను సోమవారం వారణాసిలో ప్రారంభించిన అనంతరం యూపీ సీఎం యోగి తదితరులతో ప్రధాని మోదీ

ఆరుగురి దారుణ హత్య

ఇంటి కోసం ఇంటిల్లిపాదినీ..

స్నేహం ముసుగులో మట్టుబెట్టిన యువకుడు

- మిత్రుడిని, అతడి భార్యను, ఏడేళ్ల కవలలు సహా, ఇద్దరు చెల్లెళ్లను హతమార్చిన వైనం
- పదిహేను రోజుల వ్యవధిలో వరుస హత్యాకాండ
- భూంపల్లి వద్ద యువతి మృతదేహం లభ్యం కేసులో క్లూ..
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- కామారెడ్డిలో కలకలం రేపిన దారుణ హత్యలు



నిందితుడు ప్రశాంత్

సాక్షి కామారెడ్డి/ఖలీల్‌వాడి/కామారెడ్డి క్రైం: ఇంటి కోసం దోస్తునే కాదు.. మొత్తం కుటుంబాన్నే మట్టుబెట్టాడో కిరాతకుడు. స్నేహితుడిని, గర్భవతైన అతని భార్యను, ఏడేళ్ల ఇద్దరు చిన్నారులను, ఇద్దరు చెల్లెళ్లను(అందులో ఒకరు దివ్యాంగురాలు) కిరాతకంగా చంపేశాడు. 15 రోజుల వ్యవధిలో పథకం ప్రకారం ఒక్కొక్కరిని చంపేసి, మృతదేహాలు కనపడకుండా కొన్ని పూడ్చేసి, మరికొన్ని తగలబెట్టేసి, ఇంకొన్నింటిని నీళ్లలో పడేసి.. ఏమీ తెలియనట్టే వ్యవహరించిన ఆ కరడుగట్టిన నేరస్తుడి రాక్షసత్వం భూంపల్లి వద్ద
మిగతా 5వ పేజీలో ▶

ఎక్కడా తగ్గొద్దు...



- బీఆర్ఎస్ పాలనలో సాధించిన ప్రగతిని చెప్పండి.. పూర్తి సమాచారంతో చర్చకు సిద్ధంగా ఉండండి
- 'అసెంబ్లీ' ముగిసిన వెంటనే లోక్‌సభ ఎన్నికలపై దృష్టిపెట్టండి
- కేటీఆర్, హరీశ్‌తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- వివరాలు 3లో▶

తెలంగాణ నుంచి సోనియా పోటీ

పీఏసీ భేటీలో రాష్ట్ర కాంగ్రెస్ నేతల తీర్మానం

- అధిష్టానానికి, సోనియాకు లేఖలు
- కాంగ్రెస్ అగ్రనేతలు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు.. 3 తీర్మానాలకు ఆమోదం
- ఠాక్రే అధ్యక్షతన భేటీ..సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్, జూపల్లి తదితరులు హాజరు.. పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధత, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చ

2లో



ఆస్పత్రిలో దావూద్!

- కరాచీలో 3 రోజులుగా చికిత్స
- విషప్రయోగం జరిగి ఆస్పత్రిలో మరణించినట్టు వార్తలు
- రెండూ అవాస్తవాలేనని తేల్చిన నిఘా వర్గాలు

6లో

స్టాఫ్ నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదల

10లో

క్లుప్తంగా...

బుర్రా వెంకటేశం బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిగా బుర్రా వెంకటేశం సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల్లోని సమస్యలపై దృష్టి పెడతానన్నారు. ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి వచ్చిన తాను విద్యాశాఖలో పనిచేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉన్నత ప్రమాణాలు గల ప్రభుత్వ విద్య అవసరముందని, అందుకోసం సమాజం మేల్కొనాలని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలోని స్టేక్ హోల్డర్లందరినీ భాగస్వాములను చేసి ఉన్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తానని, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి బయటకు వచ్చే విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉద్యోగాలు పొందేందుకు కృషి చేస్తానని వెంకటేశం భరోసా ఇచ్చారు.

తెలంగాణకోసం కొట్లాడేది బీఆర్ఎస్ ఒక్కటే

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీయేనని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, రాజ్యాధికారం ఎవరికీ శాశ్వతం కాదని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణకు చెందిన ఏడు మండలాలతో పాటు దిగువ సీలేరు ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించిన సమయంలో బీఆర్ఎస్ మౌనంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వినోద్ కుమార్ మండిపడ్డారు. ఏడు మండలాలను విడదీయడంపై 2014 జూన్‌లో రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు ఖమ్మం జిల్లాలో తీవ్ర నిరసన తెలిపామన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై పోరాడటం గురించి బీఆర్ఎస్‌కు ఎవరూ చెప్పాల్సిన పనిలేదన్నారు. తెలుగుదేశం పార్టీకి అప్పట్లో బీజేపీతో పొత్తు ఉండటం వల్లే చంద్రబాబు ఒత్తిడితో ఏడు మండలాలను ఏపీలో విలీనం చేశారని వినోద్‌కుమార్ అన్నారు. ఈ అంశంపై పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్, బీజేపీతో కుమ్మక్కై తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. ఏడు మండలాల విలీనంపై నాడు టీడీపీలో ఉన్న రేవంత్ స్పందన ఏంటో కాంగ్రెస్ నేతలే చెప్పాలన్నారు.

తెలంగాణ, ఏపీల్లో ఒక్కో ఎంపీ సీటుకు పోటీ



సాక్షి, హైదరాబాద్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఒక్కో స్థానంలో సీపీఐ పోటీ చేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. ఎన్నికల అవగాహనలో భాగంగా మధ్యప్రదేశ్‌లో ఒక ఎంపీ స్థానంలో సీపీఐకి అఖిలేశ్ యాదవ్ మద్దతునిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహన కుదిరితే సరేనని, లేదంటే కలిసొచ్చే వామపక్ష, లౌకిక శక్తులతో కలసి పోటీ చేస్తామని నారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీపీఐతోపాటు ఇతర వర్గాలను కలుపుకొని పోవడంతోనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్ ఒక గుణపాఠంగా తీసుకుని, రాబోయే లోక్ సభ ఎన్నికల్లో కూడా అందరినీ కలుపుకెళ్లాలని సూచించారు. నిపుణులు.. మంచి అనుభవం ఉందనే పేరుతో రిటైర్డ్ అధికారు లను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నారాయణ సూచించారు. పార్లమెంట్ దాడి ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిపై 'ఉపా'చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆసిఫాబాద్ 'జెడ్పీ'కి ఎన్నికలు నిర్వహించాలి



సాక్షి, హైదరాబాద్: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి తక్షణమే ఎన్నికలు నిర్వహించి ఎస్టీ మహిళను ఎన్నుకునేలా చర్యలు చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి.పార్థసారథికి ఫిర్యాదు చేశారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 ప్రకారం ఎస్టీ (మహిళ)కి రిజర్వ్ అయిన ఆ స్థానంలో జనరల్ కేటగిరీకి చెందిన వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావును తాత్కాలికంగా ఎంపిక చేశారని తెలిపారు. ఇలా చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళల హక్కులను ఆధిపత్య వర్గాలు తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో మొత్తం 15 జెడ్పీటీసీలకుగాను నలుగురు ఆదివాసీ, గిరిజన మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నా రన్నారు.

తెలంగాణ నుంచి సోనియా పోటీ

పీఏసీ భేటీలో రాష్ట్ర కాంగ్రెస్ నేతల తీర్మానం

- అధిష్టానానికి, సోనియాగాంధీకి లేఖలు
- కాంగ్రెస్ అతిరథ మహారథులు, నేతలు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు
- 3 తీర్మానాలకు ఆమోదం
- ఠాక్రే అధ్యక్షతన భేటీ..
- సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్, జూపల్లి తదితరుల హాజరు
- పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధత, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చ



పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సోనియాగాంధీని తెలంగాణలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ తీర్మానంతో కూడిన లేఖలను వ్యక్తిగతంగా సోనియగాంధీకి, అలాగే పార్టీ అధిష్టానానికి పంపింది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన దాదాపు రెండు గంటలకు పైగా పీఏసీ సమావేశం జరిగింది. సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు. పార్టీ అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొన్న తీరు, పార్లమెంటు ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహాలు, ఆరు గ్యారంటీల అమలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై చర్చించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరిగిన ఈ సమావేశంలో సోనియా రాష్ట్రం నుంచి పోటీ చేయడంతో పాటు ప్రచారానికి వచ్చిన ఏఐసీసీ నేతలు, ఎన్నికల్లో పనిచేసిన పార్టీ కేడర్, నాయకత్వం, అలాగే ఓట్లేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ మొత్తం 3 తీర్మానాలను ఆమోదించారు.

రేపట్నుంచి శ్వేతపత్రాలు

కాంగ్రెస్ 10 రోజుల పాలనపై సమావేశంలో చర్చ జరిగింది. రేవంత్ ప్రభుత్వ పనితీరును పలువురు సభ్యులు అభినందించారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పారు. ఇటీవల జరిగిన అధికారుల నియామకాలు, బదిలీల్లో కూడా ఈ విషయం వెల్లడైందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖల్లో వాస్తవిక పరిస్థితులను ప్రజల ముందు పెట్టేందుకు బుధవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో శ్వేత పత్రాలు విడుదల చేస్తామని తెలిపారు.

లోక్‌సభ టార్గెట్ 15

వచ్చే ఏప్రిల్‌లో జరుగుతాయని భావిస్తున్న పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధతపైనా సమావేశంలో చర్చించారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో 15 లోక్‌సభ స్థానాలు గెలవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పీఏసీ సభ్యులు కోరారు. కాగా లోక్‌సభ టికెట్లు, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక వ్యవహారాలను అధిష్టానం చూసుకుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు.

సంక్రాంతి లోపే పదవులు

పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున నామినేటెడ్ పదవులు ఇస్తే పార్టీ నాయకులు మరింత ఉత్సాహంతో పనిచేస్తారని పీఏసీ సభ్యులు సూచించారు. వీలున్నంత త్వరగా భర్తీ చేయడం ద్వారా రెండేళ్ల కాలపరిమితికి అనుగుణంగా మరో రెండుసార్లు ఈ పోస్టులకు పార్టీ నేతలను ఎంపిక చేయవచ్చని, దాదాపుగా 1,000 మందికి అవకాశం కల్పించవచ్చని చెప్పారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు పూర్తి కాగానే, సంక్రాంతి పండుగ లోపే నామినేటెడ్ పదవులపై పూర్తిస్థాయిలో కసరత్తు జరుగుతుందని, అధిష్టానం పెద్దలతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పోస్టుల భర్తీ చేపడతానని సీఎం హామీ ఇచ్చినట్టు సమాచారం.

ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీల అమలు

ఆరు గ్యారంటీల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని, ఈ పథకాల అమలు పార్టీ కేడర్ ద్వారా సక్రమంగా జరిగేలా చూడాలని రేవంత్ కోరారు. పథకాల అమలుతో పాటు లబ్ధిదారుల ఎంపికలో పార్టీ నేతలు, కేడర్ చురుకుగా ఉండి అర్హులందరికీ లబ్ధి కలిగేలా చూడాలని, వారి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు.

బూత్ స్థాయి నుంచి జాగ్రత్తగా ఉండాలి

ఓటర్ల జాబితా సవరణలపై చర్చ జరగ్గా.. ఈ సందర్భంగా పార్టీ పక్షాన తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ వివరించారు. ఫిబ్రవరి 8న ప్రకటించే తుది జాబితా ప్రాతిపదికనే లోక్‌సభకు ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఈ జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం బూత్ స్థాయిలో కార్యకర్తలను అలర్ట్ చేయాలని, ప్రతి ఇంటి నుంచి ఓటర్లను చేర్పించే చర్యలు తీసుకోవాలని చెప్పారు. మాజీ మంత్రులు జానారెడ్డి, టి.జీవన్‌రెడ్డి, చిన్నారెడ్డి, షబ్బీర్ అలీ, గీతారెడ్డి, వి.హనుమంతరావు, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విష్ణునాథ్, పీఏసీ సభ్యులు జగ్గారెడ్డి, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, మధుయాష్కీ గౌడ్, బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జులు ఖరారు

పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్ నియోజకవర్గాల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు రెండేసి చొప్పున నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించగా, మంత్రి పదవుల్లో లేని సీనియర్ నేతలు జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డిలకు కూడా ఇన్‌చార్జి బాధ్యతలిచ్చారు. మిగిలిన 9 మంది మంత్రులకు 9 నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించారు. వీరంతా మంగళవారం నుంచే లోక్‌సభ ఎన్నికల పనిలో ఉంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. టికెట్ల కేటాయింపు ప్రక్రియ మొదలు ఎన్నికలు పూర్తయ్యేంతవరకు కేటాయించిన నియోజకవర్గాల్లో మంత్రులదే బాధ్యతని తెలిపాయి.

ఇన్‌చార్జులు వీరే:

చేవెళ్ల, మహబూబ్‌నగర్	– రేవంత్‌రెడ్డి
సికింద్రాబాద్, హైదరాబాద్	– భట్టి విక్రమార్క
మెదక్	– దామోదర రాజనర్సింహ
ఆదిలాబాద్	– సీతక్క
నల్లగొండ	– ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
భువనగిరి	– కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
వరంగల్	– కొండా సురేఖ
ఖమ్మం, మహబూబాబాద్	– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
పెద్దపల్లి	– శ్రీధర్‌బాబు
కరీంనగర్	– పొన్నం ప్రభాకర్
నిజామాబాద్	– టి.జీవన్‌రెడ్డి
జహీరాబాద్	– పి.సుదర్శన్‌రెడ్డి
మల్కాజిగిరి	– తుమ్మల నాగేశ్వరరావు
నాగర్‌కర్నూల్	– జూపల్లి కృష్ణారావు

ఆరు గ్యారంటీలకు 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 28న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నుంచి ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈ ప్రక్రియకు సంబంధించిన అన్ని మార్గదర్శకాలను ప్రభుత్వం వెల్లడిస్తుందని పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ వెల్లడించారు. గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశం అనంతరం ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్ లాంటి పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని చెప్పారు. గ్రామసభల్లోనే లబ్దిదారులను ఎంపిక చేసే సాంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రారంభిస్తుందని తెలిపారు. 28 నుంచి 15 రోజుల పాటు నిర్దేశిత ఫార్మాట్‌లో దరఖాస్తులు ప్రభుత్వం స్వీకరిస్తుందని చెప్పారు. ఎలాంటి వివక్ష లేకుండా సంతృప్త స్థాయిలో పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందన్నారు. 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లో జరిగే సభకు తెలంగాణ నుంచి 50 వేల మందిని తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో..

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులోకి రావడంతోపాటు భూసేకరణకు రైతులు కూడా సహకరిస్తారన్నారు. కాలుష్యరహిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలని, హైదరాబాద్‌లోని నాచారం, జీడిమెట్ల, కాటేదాన్ తదితర పారిశ్రామిక వాడల తరలింపునకు ప్రత్యామ్నాయం సూచించాలని చెప్పారు. బల్క్‌డ్రగ్ ఉత్పత్తుల కంపెనీల ఏర్పాటుకు సంబంధించి మధ్యప్రాచ్య, యూరోపియన్ దేశాలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

థర్మల్ విద్యుత్ బదులు సోలార్ పవర్

పారిశ్రామిక అవసరాల కోసం థర్మల్ విద్యుత్‌కు బదులుగా సౌర విద్యుత్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదర్శ గ్రామాలను తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని, బాలానగర్ ఐడీపీఎల్ భూముల పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- కేబినెట్ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అధిష్టానంతో చర్చించనున్న సీఎం


సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీ వెళ్తున్న ఆయన కాంగ్రెస్ అధిష్టానం పెద్దలను కలిసి పలు అంశాలపై చర్చిస్తారని సీఎంవో వర్గాలు చెప్పాయి. పీసీసీ అధ్యక్షుడిగా కొత్త నాయకుడి ఎంపిక, కేబినెట్ విస్తరణ, నామినే టెడ్ పోస్టుల భర్తీ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు లో అనుసరించాల్సిన అంశాలపై ఆయన వారితో చర్చించనున్నట్లు సమాచారం. ఇక, లోక్‌సభలో తనతో కలిసి పనిచేసిన ఎంపీలను కూడా కలవనున్న రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రికల్లా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

14 మంది ఐఏఎస్‌లకు పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 2015 బ్యాచ్‌కు చెందిన 14 మంది ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్‌తో వీరికి పదోన్నతి ఇచ్చింది. ఈ పదోన్నతి వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన 14 మంది ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లోనే రిటైన్ అవుతూ అదే స్థానంలో కొనసాగనున్నారు. ఈ జాబితాలో పమేలా సత్పతి, అనురాగ్ జయంతి, గౌతమ్ పొట్రు, రాహుల్‌రాజ్, భవేశ్ మిశ్రా, ఎం.సత్యశారదాదేవి, నారాయణరెడ్డి, ఎస్.హరీశ్, జి.రవి, కె.నిఖిల, ఆయేశా మస్రత్ ఖానమ్, ఎస్.సంగీత సత్యనారాయణ, యాస్మిన్ బాష, వెంకటరావు ఉన్నారు.

అర్హత లేకున్నా మిడ్ మానేరు పరిహారం

- ఎంపీ సంతోష్, మాజీ సీఎం బంధువులపై చర్యలు తీసుకోండి
- సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ బండి సంజయ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: మిడ్ మానేరు ప్రాజెక్టు ముంపు పరిహారం చెల్లింపు విషయంలో అర్హత లేకపోయినా రాజ్యసభ సభ్యుడు జె. సంతోష్ రావు, ఆయన కుటుంబ సభ్యులతోపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బంధువులకు సైతం ప్యాకేజీ కింద పరిహారం చెల్లించారని కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆ మేరకు ఆయన సోమవారం లేఖ రాశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మిడ్‌మానేరు బాధితుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అసలు మిడ్ మానేరు సమస్య ఏమిటంటే..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు రేవంత్‌కు అభినందనలు తెలియజేసిన సంజయ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎన్నో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న మిడ్ మానేరు ముంపు బాధితుల సమస్యలను, ప్రభుత్వం ఇచ్చిన హామీలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 17 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టు మిడ్ మానేరు. లక్షలాది ఎకరాలకు సాగు నీటితోపాటు తాగునీటి అవసరాలను తీరుస్తుందనే భావనతో ప్రాజెక్టు ముంపు పరిధిలోని 12 గ్రామాల ప్రజలు ఇళ్లు, భూములు త్యాగం చేశారు. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం 12,500 మంది బాధితులున్నారు. వీరికి సహాయ పునరావాస ప్యాకేజీ కింద 2005–06లో నాటి ప్రభుత్వం జీవో నెం.69 ప్రకారం ఐఏవై కింద ఇళ్లు మంజూరు చేసింది. ముంపు పరిహారం చెల్లిస్తామని పేర్కొంది. వీటి అమలులో తీవ్రమైన జాప్యం జరిగింది. 2018 జూన్ 15న నాటి సీఎం కేసీఆర్ ఈ ప్రాంతానికి వచ్చి మిడ్ మానేరు బాధితులకు ఐఏవై ఇళ్లకు బదులుగా డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని, అందులో భాగంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల 4 వేలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. పన్నెండు గ్రామాల రైతులంతా సాగు భూమిని కోల్పోయిన నేపథ్యంలో నీలోజిపల్లి నుండి నందిగామ, అగ్రహారం వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను, స్కిల్ డెవలెప్‌మెంట్ కాలేజీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా వారిలో నైపుణ్యత పెంచి స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. అలాగే 2009 కొత్త గెజిట్ ప్రకారం తేది 01-01-2015 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ముంపు పరిహారం, పట్టా ఇస్తామన్నారు. కానీ నేటికి ఒక్క అడుగు ముందుకు పడలేదు' అని సంజయ్ ఆ లేఖలో వివరించారు. వెంటనే సంబంధిత మంత్రి, స్థానిక శాసనసభ్యుడు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేవంత్ హామీ ఇచ్చారని గుర్తు చేసిన సంజయ్

'రెండేళ్ల క్రితం మిడ్ మానేరు ముంపు బాధితుల కోసం కొదురుపాకలో నిర్వహించిన అఖిలపక్ష 'మహాధర్నా'లో మీరు, నేను హాజరై ముంపు బాధితులకు సంఘీభావం తెలిపాం. నాటి ధర్నాలో మిడ్‌మానేరు బాధితుల సమస్యలను పరిష్కరించేదాకా వారి పక్షాన పోరాటం చేస్తామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని మీరు హామీ ఇచ్చారు' అని సంజయ్ గుర్తుచేశారు.

కరోనాపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: కరోనా కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సూచన మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కేరళ రాష్ట్రంలో ఈ నెల 8న కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్1 వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలని, మాస్కులను ధరించాలని సూచించారు. శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. కాగా, ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనడానికి రాష్ట్ర యంత్రాంగం సిద్ధంగా ఉందని, వ్యాధినిర్ధారణ పరీక్షలకు కావాల్సిన కిట్స్, చికిత్సకు అవసరమైన మందులు, ఆక్సిజన్ అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, చలికాలం నేపథ్యంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే విషయాన్ని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రమాదకారి కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చింది

కరోనా గురించి దిగులు చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం వార్తల్లో ఉన్న కరోనా వేరియంట్ జేఎన్1 ఒమిక్రాన్‌కు చెందినదే. ఇది ఇప్పటికే భారత్ సహా పలు దేశాల్లో రెండు నెలలుగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇది ప్రమాదకారి కాదని ఇప్పటికే నివేదిక విడుదల చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శ్వాసకోశ సంబంధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో వృద్ధులు, దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

– డాక్టర్ కిరణ్‌మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

కమలం 'లోక్‌సభ' కసరత్తు

- ఎక్కువ సీట్లలో గెలుపు లక్ష్యంగా కార్యాచరణ
- 17 మంది విస్తారక్‌ల నియామకానికి చర్యలు
- అసెంబ్లీ ఎన్నికల్లో నేతల పనితీరుపై బన్సల్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ కసరత్తు మొదలుపెట్టింది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో అత్యధిక స్థానాల్లో గెలుపు లక్ష్యంగా కార్యాచరణను వేగవంతం చేసింది. 17 నియోజకవర్గాలకు విస్తారక్ (ఫుల్ టైమర్ (పూర్తి సమయం వెచ్చించే నేత)లను నియమించేందుకు చర్యలు చేపడుతోంది. పార్టీకి పట్టు ఉన్న, గెలిచే అవకాశాలున్న సీట్లపై మరింతగా దృష్టి కేంద్రీకరించనుంది. ఇలాంటి సీట్లలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను ఒకటి రెండు లేదా మూడు నాలుగింటికి ఒకరు చొప్పున మరికొంత మంది విస్తారక్‌లను నియమించాలని నిర్ణయించింది. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయా అంశాలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సమీక్ష నిర్వహించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో పనిచేసిన వివిధ స్థాయి నాయకులు, కమిటీల పనితీరును ఈ సందర్భంగా పరిశీలించినట్టు సమాచారం. అలాగే గతంలో 17 లోక్‌సభ స్థానాలకు నియమితులైన ఫుల్ టైమర్స్‌లో ఎవరెవరు చురుకుగా పని చేస్తున్నారో ఆరా తీసినట్లు తెలిసింది. కాగా గత కొంతకాలంగా వారు నిర్వహించిన బాధ్యతలు, పూర్తిచేసిన కర్తవ్యాలను పరిగణనలోకి తీసుకుని వారి పునర్ నియామకంపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఇన్‌చార్జులు

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఇన్‌చార్జులను నియమించే చర్యలు కూడా చేపడుతున్నారు. అసెంబ్లీ స్థానాల్లో బాగా పనిచేశారని పేరు తెచ్చుకున్న వారిని లోక్‌సభ ఎన్నికలకు ఫుల్‌టైమర్లుగా, పార్లమెంట్ ఇన్‌చార్జులుగా నియమించే అవకాశాలున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా నేతల పనితీరుపై నివేదికలు సమర్పించాలని రాష్ట్ర నాయకత్వాన్ని బన్సల్ ఆదేశించినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో..కేంద్రం చేపట్టిన వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి ఉద్దేశించిన వికసిత్ భారత్, విశ్వకర్మ యోజనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై, పోలింగ్ బూత్ కమిటీలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరులోగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేస్తారని, ఆ తర్వాత పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో ఎన్నికల సన్నాహాల్లో నిమగ్నం అవుతుందని సమాచారం.

పదేళ్లు ఒక లెక్క.. ఇప్పుడొక లెక్క

- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం: మంత్రి కోమటిరెడ్డి
- నల్లగొండ జిల్లాను సుభిక్షంగా మారుస్తాం



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై హెలికాప్టర్‌తో పూలవర్షం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'గత పదేళ్లు ఒక లెక్క.. ఇప్పుడో లెక్క. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం ..' అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంత్రి అయ్యాక మొదటిసారి ఆయన సోమవారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికాయి. జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అంతకుముందు ఆయన ఆంథోల్ మైసమ్మగుడి వద్ద, నల్లగొండలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. మూడేళ్లలోనే ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తామని, ఆరు నెలల్లో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. నల్లగొండ జిల్లాను సుభిక్షంగా మారుస్తామని పేర్కొన్నారు. అక్రమ ఇసుక దందా, బెల్టు షాపుల ఆట కట్టిస్తామన్నారు. గత పాలకుల్లాగా అధికారులను తాము ఇబ్బంది పెట్టబోమని, అంతా కలిసి పనిచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కర్ణన్ అధ్యక్షతన మిషన్ భగీరథ, నీటిపారుదల, రోడ్డు భవనాలు, ఇతర శాఖల ఈఎన్‌సీలతో సమీక్షించారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మిషన్ భగీరథ చేపట్టినా ఇంకా చాలా గ్రామాలకు నీరందడం లేదని, సంబంధిత ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన సబ్‌స్టేషన్లు, ఇతర విస్తరణ పనులు చేయించాలని, దీనిపై నివేదికలు ఇస్తే ప్రభుత్వంతో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో విద్యుత్ ప్రమాదాల్లో 32 మంది చనిపోయినా వారికి గత ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరమని చెప్పారు. వెంటనే వారికి న్యాయం చేయాలన్నారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు అనిల్‌రెడ్డి, బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, జైవీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న మరో రెండు గ్యారంటీల అమలు

సంక్రాంతిలోగా మిగిలిన రెండు కూడా...

- గత ప్రభుత్వ ఆర్థిక విధానంపై 20న అసెంబ్లీలో శ్వేతపత్రం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి. చిత్రంలో కలెక్టర్ గౌతమ్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలవుతున్నాయని, ఈనెల 28న మరో రెండు, వచ్చే సంక్రాంతిలోగా మిగిలిన రెండు గ్యారంటీలు అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం పాలేరు నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు వారియర్ సహా అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలగకుండా, నష్టం లేకుండా ధరణిని ప్రక్షాళన చేయడంతోపాటు గత ప్రభుత్వం సామాన్యుల నుంచి లాక్కున్న ఆస్తులు తిరిగి ఇస్తామని చెప్పారు. వీఆర్‌ఓల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. త్వరలో రెవెన్యూలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని.. ఇందులో అధికారులపై కక్ష సాధింపు చర్యలు ఉండవని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులు దోచుకున్న, ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టిన విషయంపై సమీక్షిస్తామని, ఖమ్మం, వరంగల్, హైదరాబాదే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూముల ఆక్రమణ జరిగినా వదలబోమని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా కొల్లగొట్టిందని, ఈనెల 20న అసెంబ్లీ సాక్షిగా శ్వేతపత్రాన్ని ప్రజల ముందు పెడతామని వెల్లడించారు.

విడతల వారీగా ఇళ్లు..

గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టానని, రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో ఎవరికీ ఇల్లు లేదని అనకుండా విడతల వారీగా నిర్మాణం చేస్తామని పొంగులేటి తెలిపారు. నీటి పారుదల శాఖలో జరిగిన అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టుపై సిట్టింగ్ జడ్జితో ప్రభుత్వం విచారణ చేయించేందుకు పూనుకుందన్నారు. డ్రగ్స్, గంజాయిపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపేలా ఇప్పటికే సీఎం కఠిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

ఎక్కడా తగ్గొద్దు



- బీఆర్ఎస్ పాలనలో సాధించిన ప్రగతిని చెప్పండి... పూర్తి సమాచారంతో చర్చకు సిద్ధంగా ఉండండి
- కేటీఆర్, హరీశ్‌తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, విద్యుత్, నీటిపారుదల తదితర రంగాలపై అసెంబ్లీ వేదికగా శ్వేతపత్రాలు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతుందనే వార్తల నేపథ్యంలో భారత్ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ పార్టీ కీలక నేతలకు దిశా నిర్దేశం చేశారు. తుంటి ఎముక శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్‌తో బంజారాహిల్స్ నందినగర్ నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలు కొందరు సోమవారం సాయంత్రం భేటీ అయ్యారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఉభయ సభల్లో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు, నేతల ప్రసంగాలు, ప్రభుత్వ స్పందన తదితరాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ నెల 20 నుంచి రెండు రోజులపాటు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అవకాశమున్న అంశాలపై లోతుగా చర్చ జరిగినట్లు సమాచారం. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రజెంటేషన్లు, చేపట్టే చర్చలపై ఎక్కడా వెనక్కి తగ్గొద్దంటూ కేసీఆర్ స్పష్టం చేశారు.

అధికార పక్షాన్ని ఇరుకున పెట్టాలి

'అర్ధసత్యాలు, అసత్యాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు, రాబోయే రోజుల్లో ఎదురయ్యే వైఫల్యాలకు బీఆర్ఎస్‌ను బాధ్యులను చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సీఎం ఇచ్చిన సమాధానం అదే తరహాలో ఉంది. కాబట్టి సభ వేదికగానే అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు అన్ని రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో వెళ్లండి. ఎన్ని గంటలైనా చర్చకు సిద్ధంగా ఉంటూ సమన్వయంతో ముందుకు వెళ్లండి. రంగాల వారీగా మనం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి..'అని కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

అసెంబ్లీ భేటీ తర్వాత లోక్‌సభపై దృష్టి

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేసీఆర్ సూచించారు. ఇప్పటికే లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు సాధించిన ఓట్లు, ఇతర పార్టీల పరిస్థితిపై నివేదికలు రూపొందించిన నేపథ్యంలో.. నియోజకవర్గాల వారీగా సమీక్ష, సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. గెలుపోటములతో సంబంధం లేకుండా తాజా, మాజీ ఎమ్మెల్యేలు అందరూ క్షేత్ర స్థాయిలో కేడర్‌తో సమావేశమయ్యేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. త్వరలోనే తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యవర్గం, ప్రజా ప్రతినిధులతో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనుంది.

బీఆర్ఎస్ ఎల్పీ ఆఫీసుకు హరీశ్

అధినేత ఆదేశాల నేపథ్యంలో హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీ ఆవరణలోని బీఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయానికి వచ్చి పలు రంగాలకు సంబంధించిన నివేదికలను సేకరించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో జరిగిన కార్యకలాపాలు, బడ్జెట్ లెక్కలకు సంబంధించిన వివరాలను తీసుకున్నారు. ఆర్థిక, వైద్యా రోగ్య, నీటిపారుదల, మార్కెటింగ్ వంటి కీలక శాఖల మంత్రిగా పనిచేసిన హరీశ్ బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వం లేవనెత్తే అంశాలపై బీఆర్ఎస్ పక్షాన చర్చలో పాల్గొనే అవకాశం ఉంది.



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పొన్నం ప్రభాకర్

బాధ్యతలు స్వీకరించిన మంత్రి పొన్నం

వివిధ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ఫైళ్లకు క్లియరెన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల మంత్రిగా పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రవాణా శాఖకు సంబంధించిన వివిధ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి క్లియరెన్స్ ఇచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంబంధించి బస్‌పాస్ రాయితీల నిధుల రీయింబర్స్‌మెంట్ కింద రూ.212.50 కోట్లను విడుదల చేస్తూ ఒక ఫైలుపై సంతకం చేశారు. అదేవిధంగా 2023–24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంబంధించి రూ.162.50 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ మరొక ఫైలుపై మంత్రి సంతకం చేశారు. ఆ తర్వాత రవాణా శాఖలో హెడ్ ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఎల్.పాండు భార్య రాజ్యలక్ష్మికి మెడిక్లెయిమ్ నిధి కింద రూ.లక్ష విడుదల చేస్తూ మూడో సంతకం చేశారు. మంత్రి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వివేక్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, వాణీప్రసాద్, టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

డీఈఈసెట్-2023 ప్రవేశాల షెడ్యూల్ విడుదల

20 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: డీఈఈసెట్–2023 ప్రవేశాల షెడ్యూల్ సోమవారం విడుదలైంది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ రెండేళ్ల కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 20వ తేదీ నుంచి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ధ్రువపత్రాల పరిశీలన(ఇదివరకు పరిశీలనకు హాజరుకానివారు మాత్రమే) జరగనుంది. ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు కళాశాలల వారీగా అభ్యర్థులు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈనెల 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. 2024 జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు తుది ప్రవేశాల ప్రతుల డౌన్‌లోడింగ్, ఫీజు చెల్లింపుల ప్రక్రియ జరుగుతుందని, 5వ తేదీన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని, 8వ తేదీన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని కన్వీనర్ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు డీఈఈసెట్–2023 వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

హాస్టల్ వసతులపై 3 వారాల్లో నివేదికివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో ప్రస్తుతం ఉన్న వసతులపై 3 వారాల్లో నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్–2018 ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో వసతులు కల్పించడం లేదని.. బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు, వార్డెన్లు తదితర వసతులు ఉండాల్సిన నిష్పత్తిలో లేవని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. వసతుల ఏర్పాటుపై నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

వ్యవసాయ వర్సిటీలో డ్రోన్ అకాడమీకి అనుమతి

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి డ్రోన్ పైలట్ శిక్షణకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి ఇచ్చింది. రైతులు, డిప్లొమా హోల్డర్లు, అగ్రి గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగ గ్రామీణ యువతకు అగ్రి–డ్రోన్ పైలట్ శిక్షణను అందించేందుకు డ్రోన్ అకాడమీని స్థాపిస్తున్నారు. అందులో పదేళ్ల శిక్షణ ఇవ్వడానికి ఈమేరకు అనుమతి లభించింది. తెలంగాణలో ప్రధాన పంటలైన వరి, పత్తి, వేరుశనగ, సోయాబీన్, నువ్వులు, కుసుమ వంటి పంటల్లో డ్రోన్ ఆధారిత పురుగుమందులను పిచికారీ చేయడానికి ఇది దోహదపడుతుంది. ఈ అకాడమీ త్వరలో రాజేంద్రనగర్‌లో ప్రారంభం కానుంది. అగ్రిడ్రోన్ పైలట్ శిక్షణా కోర్సును 6 రోజుల పాటు అందిస్తారు.

నగరంలో రాష్ట్రపతి

- బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో రాష్ట్రపతికి స్వాగతం పలికిన గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- ఈనెల 23 వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న రాష్ట్రపతి ముర్ము
- నేడు హెచ్‌పీఎస్ శతాబ్ది వేడుకల్లో పాల్గొననున్న రాష్ట్రపతి

సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. శాలువాలతో రాష్ట్రపతిని సత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి ముర్ముకు సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులు భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్‌బాబును పరిచయం చేశారు. రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, త్రివిధ దళాల అధికారులు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. స్వాగత కార్యక్రమం అనంతరం ప్రత్యేక వాహనంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ద్రౌపదీ ముర్ము వెళ్లారు. ఈనెల 23న రాష్ట్రపతి ముర్ము తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రపతి శీతాకాల విడిది నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఐదు రోజులపాటు వివిధ కార్యక్రమాల్లో ..
- రాష్ట్రపతి ముర్ము మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీ శతాబ్ది వేడుకల్లో పాల్గొంటారు.
- పోచంపల్లిలో టెక్స్‌టైల్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండ్లూమ్, స్పిన్నింగ్ యూనిట్లను ఈనెల 20న సందర్శిస్తారు. నేతకార్మికులతో మాట్లాడతారు. అదే రోజు సాయంత్రం సికింద్రాబాద్‌లో ఎంఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొంటారు.
- డిసెంబర్ 21న బొల్లారం రాష్ట్రపతి నిలయంలో పలు పనులను ఆమె ప్రారంభిస్తారు.
- డిసెంబర్ 22న బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రంలోని ప్రముఖులు, విద్యావేత్తలు, ఇతర ముఖ్యులకు ఎట్‌హోం విందు ఇస్తారు.
- డిసెంబర్ 23న రాజస్థాన్‌లోని పోక్రాన్‌లో నిర్వహిస్తున్న ఫైరింగ్ కార్యక్రమాలను లైవ్ ద్వారా వీక్షిస్తారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

ఎన్జీటీ సూచనలకు అనుగుణంగా టీపీసీబీ అప్‌గ్రేడేషన్

సమీక్షలో అటవీ, పర్యావరణ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సూచనలకు అనుగుణంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ)లో రిక్రూట్‌మెంట్, పోస్టుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ చేపడతామని అటవీ, పర్యావరణ శాఖమంత్రి కొండా సురేఖ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్లు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లదేనని స్పష్టంచేశారు. అలాగే అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో నాలాల క్లీనింగ్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయాల ప్రోత్సాహంలో ఎస్‌హెచ్‌జీ మహిళల భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు. సోమవారం తెలంగాణ పీసీబీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో కొండా సురేఖ పాల్గొన్నారు. వ్యర్థాల నిర్వహణ, మురుగు శుద్ధి కేంద్రాలకు తగిన విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు. ఈ సమీక్షలో టీపీసీబీ సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుల వృత్తులను ప్రోత్సహించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కల్లుగీత సంఘాల వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల వృత్తులను ప్రోత్సహించి వారికి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్‌లు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కోరారు. సోమవారం సెక్రటేరియట్‌లో బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిన హామీలను అమలు చేయాలని, బీసీ జనాభా లెక్కలు తీసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బడ్జెట్‌లో బీసీలకు 20 వేల కోట్లు కేటాయించాలని మంత్రిని కోరారు. తమ విజ్ఞప్తులకు మంత్రి సానుకూలంగా స్పందించారని, బీసీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారని గౌడ సంఘం నేతలు వెల్లడించారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు కేశం నాగరాజ్‌గౌడ్, గౌడ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బండి సాయన్న తదితరులున్నారు.

కూలీలపై అటవీ అధికారుల దాడి



అటవీ శాఖాధికారుల దాడిలో కాలికి గాయమైన వెంకటస్వామి

ఎస్ఎస్ తాడ్వాయి: కూలీలపై అటవీ శాఖ అధికారులు దాడికి పాల్పడ్డారు. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సోమవారం జరిగిన ఈ సంఘటనపై బాధితుల కథనం ప్రకారం.. నార్లాపూర్ గ్రామానికి చెందిన పల్లపు వెంకటస్వామి, కంది దుర్గయ్య, కంది బాబు.. మేడారం పరిధిలోని గుట్టకు బెండడిరాయి కోసం వెళ్లారు. విషయం తెలుసుకున్న బీట్ ఆఫీసర్లు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కూలీల్లో ఒకరికి సంబంధిత బీట్ ఆఫీసర్‌తో పరిచయం ఉండటంతో.. 'నమస్కారం సార్'అంటూ ముందుకు వెళ్లగానే కర్రలతో చితకబాదారు. దీంతో పల్లపు వెంకటస్వామి కాలికి తీవ్రంగా గాయాలు కాగా కంది దుర్గయ్య సైతం గాయపడ్డాడు. కూలీలపై దాడి విషయం తెలుసుకున్న గ్రామస్తులు అటవీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్చరించి వదిలేయాల్సి ఉండగా.. ఇలా భౌతిక దాడులు చేయడమేమిటని ప్రశ్నించారు. ఈ సంఘటనపై సంబంధిత బీట్ ఆఫీసర్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా తీయలేదు.

యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

ప్రభుత్వాన్ని కోరిన యాదవ సంఘం నేతలు



భట్టిని సన్మానిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికశాతం జనాభా ఉన్న తమకు మంత్రి పదవి ఇవ్వాలని యాదవులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యాదవులకు రాజ్యసభ, లోక్‌సభ, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్లు, జిల్లా పరిషత్తు, డీసీసీబీ చైర్మన్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ సోమవారం ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యాదవ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే, ఎమ్మెల్యే వివేక్, సీనియర్ నేత జానారెడ్డి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు రోహిత్ చౌదరి, వీసీ విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్, మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ గౌడ్, ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధులు లోకేశ్‌యాదవ్, గౌరీ సతీశ్, కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ మంత్రి షబీర్ అలీ పాల్గొన్నారు.

ఐటీ రిటర్న్స్‌లో 24.75% వృద్ధి

కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఆదాయపు పన్ను రిటర్న్స్ (ఐటీఆర్)లో గణనీయమైన వృద్ధి నమోదైందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2019–20లో 21.58 లక్షల మంది రిటర్న్స్ దాఖలు చేయగా, 2022–23 నాటికి వీరి సంఖ్య 24.75% వృద్ధితో 26.92 లక్షలకు పెరిగిందని వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జాతీయ స్థాయిలో ఐటీఆర్‌లు 6.78 కోట్ల నుంచి 14.75 శాతం వృద్ధితో 7.78 కోట్లకు పెరిగాయని వివరించారు. ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలు, సాంకేతిక పరిణామాలులాంటి అంశాలు తెలంగాణలో ఐటీ రిటర్న్స్ దాఖలు పెరుగుదలకు కారణంగా ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్రాలు తమ మూలధన వ్యయాన్ని పెంచేందుకు, దేశ ఆర్థిక వృద్ధికి మరింత దోహదపడేలా ప్రోత్సహించేందుకు కేంద్రం గత మూడేళ్లుగా వడ్డీ రహిత రుణాలను అందిస్తోందని తెలిపారు. ఇందు కోసం 2023–24లో రూ.1.3 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు.

జూడాల సమ్మె వాయిదా

సాక్షి, హైదరాబాద్: స్టైపెండ్ పంపిణీలో జాప్యాన్ని నిరసిస్తూ తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (జూడా) ఇచ్చిన సమ్మె పిలుపు ఒక రోజు వాయిదా పడింది. ఈ మేరకు జూడా ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. జూడా సమ్మె మంగళవారం నుంచి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూడా ప్రతినిధులతో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చర్చలు జరిపారు. మరోవైపు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ కూడా వారితో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారం చర్చలకు రావాలని మంత్రి కోరడంతో సమ్మెను వాయిదా వేసినట్లు జూడా నేతలు తెలిపారు. చర్చల అనంతరం తదుపరి సమ్మె విషయంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఆటంకాలు లేకుండా చేనేత పథకాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: ఎలాంటి ఆటంకాలు లేకుండా చేనేత పథకాలు కొనసాగేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని, కొత్త పథకాలు కూడా రూపొందిస్తామని వ్యవసాయ, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన అఖిలభారత, తెలంగాణ పద్మశాలి సంఘాల ప్రతినిధులతో కలసి చేనేతరంగ సమస్యలపై సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. పద్మశాలి సంఘం నాయకులు, చేనేత సహకార సంఘం నాయకులు ఇచ్చే వినతిపత్రాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ అలుగు వర్షిణి, డైరెక్టర్ శ్రీనివాసరావులను మంత్రి ఆదేశించారు. అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కమ్మర్ల మురళి ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాలకు త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలని మంత్రిని కోరారు. చేనేత మిత్ర పథకాన్ని కొనసాగిస్తూ.. జియో టాగ్ కలిగిన ప్రతి నేత కార్మికుని ఖాతాలో రూ.3 వేలు, అనుబంధ కార్మికుని ఖాతాలో రూ. 2 వేలు చొప్పున వేయాలని కోరారు. నేతన్న బీమా పథకాన్ని 80 ఏళ్ల పైబడిన నేత కార్మికులకు కూడా వర్తింప చేయాలన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలసిన వారిలో అఖిలభారత పద్మశాలి ఇంజనీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షుడు పుట్ట పాండురంగయ్య, తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు పెద్ద జగదీశ్ తదితరులున్నారు.

తెలంగాణలో తలసరి ఆదాయం రూ.3.12 లక్షలు

కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తలసరి నికర రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (ఎన్ఎస్‌డీపీ) విషయంలో తాజా గణాంకాల ప్రకారం తెలంగాణలో తలసరి ఆదాయం రూ.3,12,398, ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,19,518 గా ఉన్నట్లు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2022–23 లెక్కల ప్రకారం 33 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల తలసరి ఆదాయాన్ని పరిశీలిస్తే తెలంగాణ మూడో స్థానంలో, ఏపీ తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. రూ.5,19,964 తలసరి ఆదాయంతో సిక్కిం తొలిస్థానంలో, రూ.4,44,768తో ఢిల్లీ రెండో స్థానంలో ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. కాగా రూ.3,01,673తో కర్ణాటక నాలుగో స్థానంలో, రూ.2,96,685తో హరియాణా ఐదో స్థానంలో ఉన్నాయి.

11 మంది రైల్వే సిబ్బందికి 'మ్యాన్ ఆఫ్ ది మంత్'

సాక్షి, హైదరాబాద్: విధినిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ మెరుగైన పనితీరు కనబరిచిన 11 మంది రైల్వే సిబ్బందికి 'మ్యాన్ ఆఫ్ ది మంత్' పురస్కారాలను అందజేశారు. రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన డిప్యూటీ ఎస్ఎస్‌లు లక్ష్మీనారాయణ, మనీశ్‌కుమార్, విజయవాడ డివిజన్‌కు చెందిన సీనియర్ జీటీఎం భీమయ్య, ట్రాలీ మేన్ సనత్ కుమార్, క్రాంతికుమార్ ట్రాక్ మెయింటెనర్, గుంతకల్ డివిజన్‌కు చెందిన సీనియర్ క్లర్క్ సోమశేఖర్, లోకో పైలట్ శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, హైదరాబాద్ డివిజన్‌కు చెందిన టెక్ గ్రేడ్–1మోసిన్‌ఖాన్, నాందేడ్ డివిజన్‌కు చెందిన ఎల్‌పీపీ గణేశ్‌విశ్వకర్మ, ఎల్‌పీజీ రాంబరన్ కుమార్‌లు పురస్కారం అందుకున్నారు.



నువ్వు చనిపోయావని భావించు. నీ జీవితం నువ్వు జీవించావు.
ఇప్పుడు, మిగిలివున్నదేమిటో తీసుకుని సరిగ్గా జీవించు.
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 19 డిసెంబర్ 2023

ఈ జనహననం ఇంకెన్నాళ్లు?

ఇంటి దీపమని ముద్దాడితే మూతి కాలినట్టు గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న జనహననాన్ని సమర్థిస్తున్న అమెరికాకూ, దాని పాశ్చాత్య మిత్రులకూ ఇప్పుడిప్పుడే తత్వం బోధపడుతున్నట్టుంది. కాల్పుల విరమణకు సిద్ధపడి సాధారణ పరిస్థితులు ఏర్పడటానికి తోడ్పడాలని, పౌరులకు ఎలాంటి హానీ కలగకుండా చూడాలని ఆ దేశాలు తాజాగా ఇజ్రాయెల్‌ను కోరుతున్నాయి. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోకి చొరబడి హమాస్ విచక్షణారహితంగా 1,200 మందిని కాల్చిచంపి 240 మందిని అపహరించుకుపోయినప్పుడు ఆ దేశాలన్నీ ఇజ్రాయెల్ ప్రతీకార చర్యలను ముక్తకంఠంతో సమర్థించాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హుటాహుటీన ఇజ్రాయెల్ వెళ్లి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు సంఘీభావం ప్రకటించారు. ఆయనకు అండదండలందిస్తామని హామీ ఇచ్చారు. హమాస్‌పై యుద్ధం పేరుతో గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పౌరుల ప్రాణాలు తీస్తున్నప్పుడూ... జనావాసాలను బాంబులతో నేలమట్టం చేస్తున్నప్పుడూ అమెరికా, బ్రిటన్, జర్మనీ తదితర దేశాలు నోరు మెదపలేదు. ఉత్తర గాజాపై బాంబుల మోత మోగించబోతున్నామని, దాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హుకుం జారీచేసినప్పుడు 20 లక్షలమంది పౌరులు ప్రాణభయంతో అప్పటికే కిక్కిరిసి వున్న దక్షిణ ప్రాంతానికి వలసపోయారు. సహాయ శిబిరాలన్నీ కిక్కిరిసిపోగా ఎండకు ఎండి వానకు తడిసి అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారు. అంత దారుణ పరిస్థితుల్లోనూ పాశ్చాత్య ప్రపంచం మౌనాన్నే ఆశ్రయించింది. పైగా ఈ దశలో పోరు విరమిస్తే అది హమాస్‌ను మరింత బలోపేతం చేస్తుందని అమెరికా వ్యాఖ్యానించింది. రెండు నెలలు గడిచి, 20,000 మందికి పైగా పౌరులు హతమయ్యాక ఇప్పుడు ఆ దేశం నోట 'కాల్పుల విరమణ' ప్రతిపాదన వినిపిస్తోంది. కారణమేమిటో తెలుస్తూనే వుంది. హమాస్ స్థావరాలను గుర్తించి కేవలం వాటిపైన మాత్రమే దాడులు చేయాలన్న సలహానూ, సాధ్యమైనంత త్వరగా పాలస్తీనా ఆవిర్భావానికి సహకరించాలన్న సూచననూ నెతన్యాహూ బుట్టదాఖలా చేశారు. దాంతోపాటు శనివారం హమాస్ చెరనుంచి తప్పించుకునో, వాళ్ల అనుమతితోనో బయటకు వచ్చిన ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులను సైన్యం వెనకా ముందూ చూడకుండా కాల్చిచంపిన ఉదంతం ఈ దాడుల ఉద్దేశాన్ని ప్రశ్నార్థకం చేసింది. ఇజ్రాయెల్ సైన్యం సైతం అది ఘోరతప్పిదమని అంగీకరించింది. ఆ తర్వాతే యుద్ధం 'గతి తప్పిందని' అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ నిర్ధారణకొచ్చారు. బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ ఆయనతో స్వరం కలిపాయి.

ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధంవల్ల అమాయక పౌరుల ప్రాణాలు పోతున్నాయని అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలూ ఏడాదిన్నరగా అంతర్జాతీయ వేదికలపైనా, బయటా ఆరోపిస్తున్నాయి. కానీ గాజా విషయంలో మాత్రం వేరే ప్రమాణాలు పాటించాయి. కాల్పుల విరమణ ప్రకటించాలని ఇజ్రాయెల్‌ను కోరే తీర్మానాన్ని భద్రతామండలిలో అమెరికా మూడుసార్లు వీటో చేసింది. బైడెన్ తన 'అత్యవసర అధికారాలను' వినియోగించి ఆ దేశానికి ఆయుధాలు కూడా సరఫరా చేశారు. చేసేవన్నీ చేశాక ఇప్పుడు సాధారణ పౌరుల ప్రాణాలకు హాని కలగకూడదని, కేవలం హమాస్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకోవాలని సుద్దులు చెప్పటంలోని ఆంతర్యమేమిటి? ఇజ్రాయెల్ చర్యల పర్యవసానంగా చోటుచేసుకుంటున్న ఉత్పాతాల గురించి 'న్యూయార్క్ టైమ్స్' వంటి పత్రికల్లో వస్తున్న కథనాలు దిగ్భ్రాంతికరంగా వుంటున్నాయి. నసర్ అల్ అస్తాద్ అనే వ్యక్తి మినహా ఆ కుటుంబం, వారి బంధువర్గం మొత్తం 100 మంది ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారని, మొత్తం ఆ వంశమే తుడిచిపెట్టుకుపోయిందని ఆ కథనం సారాంశం. ఈ రెండున్నర నెలల్లో ఐక్యరాజ్యసమితి సహాయ బృందాలకు సంబంధించిన కార్యకర్తలు 135 మంది దాడుల్లో చనిపోయారు. సమితి 78 యేళ్ల చరిత్రలో ఏ ఘర్షణలోనూ ఇంతమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు లేవు. ఈనెల 10న జరిగిన వైమానిక దాడిలో తమ కార్యకర్త, అతని భార్య, నలుగురు పిల్లలు, అతని బంధువర్గంలోని అనేకులు మరణించారని అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ ప్రకటించింది. అయిదేళ్ల క్రితం సూడాన్, అల్జీరియా, యూఏఈ తదితర దేశాల్లోని వివిధ నిర్మాణ సంస్థల్లో హమాస్ 50 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టిందనటానికి స్పష్టమైన ఆధారాలు లభించినా నెతన్యాహూ ప్రభుత్వం మౌనంగా వుండిపోయింది. ఆయుధాల కొనుగోలుకూ, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఈ డబ్బంతా వినియోగిస్తుంటే కళ్లుమూసుకున్న ప్రభుత్వం హమాస్ అక్టోబర్ దాడి తర్వాత హమాస్‌తో ఏమాత్రం సంబంధంలేని ప్రజానీకంపై విరుచుకుపడుతున్న తీరు తీవ్ర అభ్యంతరకరం.

నెతన్యాహూ ధోరణికి ఆయన కేబినెట్‌లో వున్న తీవ్ర మితవాద పక్ష నేతలే కారణమని అమెరికా చేస్తున్న వాదన పాక్షిక సత్యమే. న్యాయస్థానాలు తన జోలికి రాకుండా అడ్డుకోవటానికి చట్టం తీసుకొచ్చి ఇజ్రాయెల్ పౌర సమాజం అసంతృప్తిని మూటగట్టుకున్న నెతన్యాహూ, హమాస్ దాడి తర్వాత మరింత అప్రదిష్టపాలయ్యారు. ఈ దాడులు ఆగాక నెతన్యాహూ నిర్వాకంపై ఎటూ ఆరా వుంటుంది, ఆయన రాజీనామా కోసం జనం ఉద్యమిస్తారు. కాస్త ముందో, వెనకో పార్లమెంటు ఎన్నికలు కూడా తప్పకపోవచ్చు. ఇది తెలిసే నెతన్యాహూ దాడుల విరమణకు ససేమిరా అంటున్నారు. పాలస్తీనా ఏర్పాటుకు నిరాకరిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు హమాస్ చేసిన నష్టం కంటే తానే గాజాకు ఎక్కువ నష్టం చేశానని చెప్పటమే ఆయన ఉద్దేశం. ఈ జనహననాన్ని సాగనీయొద్దు. మొదట్లో ఇజ్రాయెల్‌కు మద్దతు పలికిన పాశ్చాత్య ప్రపంచమే ఈ బాధ్యత తీసుకుని పాపప్రక్షాళన చేసుకోవాలి. లేనట్టయితే మానవాళి క్షమించదు.

ఉత్తర దక్షిణాదుల ఓటింగ్ వైఖరి

అభిప్రాయం



అశుతోష్ వార్ష్‌ణాయ్

భారతదేశంలో రెండు భిన్నమైన దేశాలున్నాయని చాలాకాలంగా ఒక ఆలోచన ఉంది. ఉత్తర, దక్షిణ భారతదేశాలన్నమాట! అందుకే వాటి ఓటింగ్ ధోరణి కూడా భిన్నంగా ఉంటోంది. ముఖ్యంగా బీజేపీ తలకెత్తుకున్న హిందూ జాతీయవాదం విషయంలో. ఇది, ముస్లిం వ్యతిరేక భావజాలం నుంచి విడదీయలేనిది. అయితే, కొంతమంది చరిత్రకారుల అంచనాల ప్రకారం ఔరంగజేబు, టిప్పూ సుల్తాన్ ఇద్దరినీ ఒక గాటన కట్టలేము. అలాగే హైదరాబాద్ ఏడవ నిజాం వారసత్వ పాలనకే మొగ్గు చూపాడు కానీ ముస్లింల పాలనకు కాదు. ఇక, ఉత్తర భారతదేశంతో పోలిస్తే సంక్షేమ రాజకీయాలు దక్షిణాదిలో చాలాకాలంగా నడుస్తున్నాయి. దీనివల్ల ఉత్తరాదిలోలా 'రహదారులు, వంటగ్యాస్' కథనాలు కూడా చెల్లవు. అందుకే భిన్న రాజకీయాలు అవసరం.

ఎన్నికలైన ప్రతిసారీ ఫలితాలను సులువుగా విశ్లేషించడం ఎలా అన్న ప్రశ్న ఉదయిస్తూంటుంది. కొన్నిసార్లు తేలికగా ఫలితాలను విశ్లేషించవచ్చు కూడా. ఉదాహరణకు 2019లో భారతీయ జనతా పార్టీ జాతీయ స్థాయి విజయం! కానీ పలు అంశాలు మిళితమైన ఎన్నికలను పరిశీలించే సందర్భంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. హిందీ బెల్ట్‌లో మోదీ ప్రాచుర్యాన్ని కాసేపు పక్కన బెడితే తెలుసుకోవాల్సిన అంశం ఏదైనా ఉందా? విజేతలు, పరాజితుల మధ్య ఓట్ల అంతరాలను పరిశీలిస్తే ఒక్క విషయం స్పష్టమవుతుంది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓట్లలో ఎనిమిది శాతం భారీ అంతరమున్న మధ్యప్రదేశ్‌ను మినహాయిస్తే మిగిలిన రాష్ట్రాల్లో పోలైన ఓట్లకూ, సాధించిన సీట్లకూ మధ్య సారూప్యత దగ్గరగానే ఉంది. ఓట్లకూ, సాధించే సీట్లకూ మధ్య సంబంధం ఉండదన్నది భారతదేశంలో అమల్లో ఉన్న ఎన్నికల వ్యవస్థ ప్రత్యేకత. అయితే ఈ తేడా ఎన్నికలపై చూపే ప్రభావం మాత్రం కచ్చితంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం తగ్గలేదన్నది స్పష్టంగా తెలుస్తుంది. మరీ ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల విషయంలో. కానీ బీజేపీ సాధించిన ఓట్లు మాత్రం కచ్చితంగా పెరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇరు పార్టీల మధ్య అంతరం నాలుగు శాతం వరకూ ఉంటే, రాజస్థాన్‌లో ఇది కేవలం రెండు శాతమే. కాంగ్రెస్ తన వ్యూహంలో కొన్ని మార్పులు చేసుకుని ఉండగలిగితే పరాజయం ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చి ఉండేది కాదు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ కేవలం రెండు శాతం అదనపు ఓట్లతో అధికారం దక్కించుకున్న విషయం ఇక్కడ చెప్పుకోవాలి.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మోదీ చరిష్మాను మరింత పెంచుతాయని ఒప్పుకొన్నా... బీజేపీ తరచూ చేసే నినాదం 'మోదీ హై తో ముమ్‌కిన్ హై'కు అందుబాటులో ఉన్న డేటా మాత్రం మద్దతివ్వడం లేదు. తెలంగాణలో మోదీ మాయ పనిచేయలేదు. ప్రధాన పార్టీలకు బాగా వెనుకబడి మూడో స్థానంలో నిలిచింది. అయితే వచ్చే సాధారణ ఎన్నికల్లో ఉత్తర భారతంపై ఎక్కువ దృష్టి పెట్టి తెలంగాణను తక్కువ అంచనా వేస్తే బీజేపీకి ఇబ్బందులు తప్పవు. దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం లేదు. దేశ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఈ ఐదు రాష్ట్రాల్లో ఉంది. ఉత్తర భారతంలో పరిస్థితి భిన్నం. 43 శాతం జనాభా ఉండగా చాలా రాష్ట్రాలు బీజేపీ పాలనలో ఉన్నాయి. గుజరాత్‌ను కూడా ఉత్తర భారతానికి జోడిస్తే బీజేపీ బలంగా ఉన్న ప్రాంతమేదో స్పష్టమవుతుంది.

ఈ ఏడాది మొదట్లోనూ బీజేపీ ప్రభావ అంశం ఒకసారి వెలుగులోకి వచ్చింది. బీజేపీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవి చూసినప్పుడు వచ్చిందీ చర్చ. బీజేపీ భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్న అంచనాలు వేసే ముందు... బీజేపీని ఉత్తర భారతం నెత్తిన



పెట్టుకునేందుకు, దక్షిణాన తిరస్కారం ఎదురవుతున్నందుకు ఉన్న కారణాలేమిటన్నది చూద్దాం.

దక్షిణాది పూర్తిగా బీజేపీ ముక్తం కాలేదు. రెండో అతిపెద్ద రాష్ట్రమైన కర్ణాటకలో ఓడిపోయింది. కానీ అక్కడ బీజేపీకి 36 శాతం ఓట్లున్నాయి. తెలంగాణలో ఎన్నికల్లోనూ తన మునుపటి ఓట్లను రెట్టింపు చేసుకుని 14 శాతానికి చేరింది. అయితే ఈ అంకెలు దక్షిణాదిలో బీజేపీ ఉనికిని సూచించేవి మాత్రమే. రాజకీయ రంగంలో ఉనికిలో ఉండటాన్ని మాత్రమే బీజేపీ కోరుకోవడం లేదు. మరిన్ని ఎక్కువ రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టాలని అనుకుంటోంది.

భారతదేశంలో రెండు భిన్నమైన దేశాలున్నాయని చాలాకాలంగా ఒక ఆలోచన ఉంది. ఉత్తర, దక్షిణ భారతదేశాలన్నమాట! ద్రావిడ ఉద్యమంలో మొదటిసారి ఈ భావన ఏర్పడిందని చెప్పవచ్చు. అయితే దశాబ్దాల కాంగ్రెస్ ఆధిపత్యం సాగిన సమయంలో ఈ తేడా అంత స్పష్టంగా ఉండేది కాదు. కనీసం రాజకీయాలు, ఎన్నికల విషయంలో ఇది వాస్తవం. 1970ల మధ్యలో వచ్చిన అత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) తరువాత పరిస్థితి మారిపోయింది. 1977 ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఇరు ప్రాంతాల మధ్య వైరుధ్యాన్ని మరింత స్పష్టం చేశాయి. ఇందిరాగాంధీ ఉత్తరాన ఓటమి పాలైతే దక్షిణాన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లోనే కాంగ్రెస్ జాతీయ స్థాయి ఎన్నికల్లో ఓటమి చవిచూసిన విషయం కూడా తెలిసిందే.

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల్లో పెద్దగా రాణించకపోయేందుకు కారణాలేమిటి? కొన్ని చారిత్రాత్మకమైనవి, మరికొన్ని సైద్ధాంతికమైనవి. బీజేపీ తలకెత్తుకున్న హిందూ జాతీయవాదం... ముస్లిం వ్యతిరేక భావజాలం నుంచి విడదీయలేనిది. అభివృద్ధి, పరిపాలన మాత్రమే రాజకీయ లాభాలు తెచ్చిపెట్టవు. ముస్లిం పాలకుల 'చారిత్రక తప్పిదాల' పేరిట ముస్లిం వర్గాల పట్ల వ్యతిరేకత లేకపోతే బీజేపీ ఇప్పుడున్న పరిస్థితిలో ఉండేది కాదు.

అయితే ఈ రకమైన హిందూ జాతీయవాదానికి దక్షిణాదిలో ముస్లింలు రాజ్యాలేలిన ప్రాంతాల్లోనే కొద్దిపాటి మన్నన లభిస్తుంది. వారి పాలనలో అన్యాయం జరిగిందని చూపించడం లేదా ప్రచారం చేయడం ద్వారా ఈ పార్టీ లాభపడే అవకాశం ఉంటుంది. మైసూరు రాజు టిప్పూ సుల్తాన్‌పై కర్ణాటకలో తరచూ వివాదాలు నెలకొనడం ఇందుకే. టిప్పూ సుల్తాన్ 18వ శతాబ్దానికి చెందిన వారైతే, హైదరాబాద్‌లో 1911–48 మధ్య రాజ్యమేలిన నిజాములున్నారు. కొంతమంది చరిత్రకారుల అంచనాల ప్రకారం ఔరంగజేబు, టిప్పూ సుల్తాన్ ఇద్దరినీ ఒక గాటన కట్టలేము. అలాగే హైదరాబాద్ ఏడవ నిజాం వారసత్వ పాలనకే మొగ్గు చూపాడు కానీ ముస్లింల పాలనకు కాదు. అయితే రజాకార్లనే హిందూ వ్యతిరేక వర్గం నిజాం పాలన చివరి దశాబ్దంలో (1938– 48) నిజాం తరఫున పనిచేసింది.

హిందూ జాతీయవాదాన్ని చర్చలో ఉంచేందుకు బీజేపీకి తెలంగాణ, కర్ణాటకల్లో కొన్ని చారిత్రక ఆధారాలు అందుబాటులో ఉన్నాయి. అయితే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో అలాంటివి లేవు. ఇక్కడ హిందూ జాతీయవాదం పెద్దగా పనిచేయదు. ఉత్తర భారతదేశంతో పోలిస్తే దక్షిణాదిన అభివృద్ధి ఎక్కువ కావడం, సంక్షేమ రాజకీయాలు దక్షిణాదిలో చాలాకాలంగా నడుస్తూండటం వల్ల ఉత్తర భారతదేశంలో బీజేపీ వినిపించే 'రహదారులు, వంటగ్యాస్' కథనాలు కూడా చెల్లవిక్కడ.

హిందూ జాతీయ వాదంలో ఇంకో అంశమూ ఉంది. హిందీ! దక్షిణాదిలో ఈ భాషాధిపత్య ధోరణీ చెల్లుబాటు కాదు. హిందీని రాజభాషగా చేయాలన్న డిమాండును 1980లల్లోనే ఆర్‌ఎస్‌ఎస్ వదిలేసుకుందని చరిత్రకారులు చెబుతూండటం ప్రస్తావనార్హం. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పాఠశాలల్లో ప్రాంతీయ భాషల్లోనూ బోధన జరుగుతూండటం తెలిసిందే. అయినప్పటికీ హిందీ జాతీయవాదం పేరుతో జరిగే పెత్తనాన్ని దక్షిణాదిలోని మేధోవర్గం సులువుగా గుర్తించగలుగుతోంది. రాజకీయ పార్టీలూ ఈ విషయాన్ని విస్పష్టంగా బహిరంగ పరిచాయి కూడా. దక్షిణాది వారికి తమ భాష, వారసత్వాలపై గౌరవం మెండు. తప్పు కాదు కూడా. తమ భారతీయతను ఇష్టపడుతూనే... హిందీ, హిందూ జాతీయతా భావజాలాలు తమ సాంస్కృతిక ఏకతను దెబ్బతీస్తున్నాయన్న భావన వారిలో ఉంది. దక్షిణాది మద్దతు లేకుండానే బీజేపీ మరోసారి ఢిల్లీ గద్దెను ఎక్కవచ్చు. సంఖ్యల్లోని తర్కంలో ఇదంతా ఇమిడివుంది. నియోజకవర్గాల పునఃవ్యవస్థీకరణ దీన్ని మరింత సులభతరం చేయొచ్చు. కానీ దక్షిణాది నుంచి వచ్చే ఉచితమైన ఫిర్యాదులను బీజేపీ విస్మరిస్తుందా? ఇది వెంటాడే గుణం ఉన్న ప్రశ్న.

వ్యాసకర్త బ్రౌన్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ స్టడీస్, సోషల్ సైన్సెస్ అధ్యాపకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

భయపెడుతున్న అజ్ఞాతులు



గత కొన్ని నెలలుగా భయంకర తీవ్రవాదులు, డ్రగ్ లార్డ్స్, నేర సిండికేట్ నాయకులను పాకిస్తాన్‌లోని 'అజ్ఞాత వ్యక్తులు' వరుసగా హత్య చేస్తున్నారు. ఈ అజ్ఞాత వ్యక్తులు ఎవరో ఎవరికీ తెలీదు. ఎలాగైనా వదిలించు కోవాలనుకుంటున్న వ్యవస్థ తాలూకు హిట్ మెనా లేక విదేశీ హిట్ మెనా? ఏమైనాగానీ చాలా పెద్దది ఏదో జరుగుతోంది.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

ఆరోగ్య ప్రభావాలు



కోవిడ్ టీకాల ఘోర ఫలితాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. లక్షలాది మంది కోవిడ్–19 టీకా తీసుకున్న, తీసుకోని వారిని పోల్చిన మూడు అధ్యయనాలు–– మస్కులోస్కెలెటల్ అపసవ్యతలు, గైనాకాలాజికల్ అపసవ్యతలు, రక్త అపసవ్యతల నుంచి టీకా తీసుకోనివారు తక్కువ ఇబ్బంది పడతారని చెబుతున్నాయి.

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్ట్

అండగా ఉంటా!



డచ్ ఎన్నికల్లో విజయం సాధించినందుకుగానూ ప్రపంచవ్యాప్తంగా నాకు శుభాకాంక్షలు తెలిపిన స్నేహితులందరికీ ధన్యవాదాలు. ఇండియా నుంచి చాలా దయాపూరిత సందేశాలు వచ్చాయి. కేవలం హిందువు అయిన కారణంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో దాడులకు గురైన, చావు బెదిరింపులను ఎదుర్కొన్న హిందువులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను.

– గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నేత

స్వదేశానికి పిలుపు



ఇండియా బయట పెరిగిన మనిషిగా, నేను ఇండియాలో స్థిరపడేందుకు ఒక ముఖ్య ఉద్వేగ పూరిత కారణం 'స్వదేశ్' సినిమా (షారుక్ ఖాన్ నటించారు; 2004లో డిసెంబర్ 17న విడుదలైంది.) మార్పు సాధ్యమేనని నమ్మేట్టు చేసింది.

– నిఖిల్ తనేజా, ఆంట్రప్రెన్యూర్

చెడగొట్టింది!



మూర్ఖత్వాన్ని అంటువ్యాధిగా మలచడమే సామాజిక మాధ్యమాల ఘన వారసత్వం అని ఏదో ఒకరోజు చరిత్రకారులు పుస్తకాలు రాస్తారు.


– వీర్ దాస్, కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

స్వచ్ఛత కోసం తపించి...

పరిశుభ్రత దైవమని నిర్వచించిన తొలి సంస్కర్త, చీపురుతో వీధుల్ని– కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడూ, బడిలో ఆధ్యాత్మికతను వెతికిన వాడూ, నిమ్న వర్గాలకు అంబేడ్కరే దేవుడు అన్న దార్శనికుడూ సంత్ గాడ్గే బాబా. ఆయన సామాజిక న్యాయం కోసం పరితపించారు. సమస్త ఛాందసాలను హేతువుతో ఖండించిన సాధువు. అంతేకాదు ప్రకృతిని కాపాడుకోవాలని చెప్పిన పర్యావరణ వాది కూడా.



సంత్ గాడ్గే బాబా

ఆయన అసలు పేరు దేబు. 1870 ఫిబ్రవరి 23వ తేదీన మహారాష్ట్రలోని 'షేన్ గావ్'లో ఒక రజక కుటుంబంలో జన్మించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి మేన మామ ఇంట్లో పెరిగాడు. చిన్న వయసు నుంచే పగలంతా చాకిరీ చేసేవాడు. రాత్రి అయితే చాలు ఊర్లోనో, పొరుగూరులోనో పాటకచేరికి వెళ్లిపోయేవాడు. కులాచారం ప్రకారం తన కుమార్తె బారసాలకు మేకలను బలిచ్చే ఆచారాన్ని అడ్డుకొని మిఠాయిలు పంచిపెట్టారు. 1905లో ఒక సాధువు ప్రభావంతో దేబు తల్లినీ, భార్యాపిల్లలను వదిలి సత్యాన్వేషణకు ఇంటి నుంచి బయటపడ్డారు.

ఇంటి నుంచి బయటపడ్డాక మూకుడు, చీపురు ఆయన ప్రతీకలయ్యాయి. దర్జీల దగ్గర రంగురంగుల పీలికలను ఏరుకొని దుస్తులను కుట్టుకునే వారు. మూకుడునే నెత్తిమీద టోపీ లాగా బోర్లించుకునేవారు. భిక్షం అవసరమైనప్పుడు అడుక్కొని తిన్నాక శుభ్రంగా కడిగి దాన్నే నెత్తి మీద బోర్లించుకునేవారు. మరాఠీలో మట్టిచిప్పను గాడ్గే అంటారు. అందుకే ఆయనకి 'గాడ్గే బాబా' అని పేరు వచ్చింది. సత్యాన్వేషణలో ఉన్నవాడు ముందుగా అహాన్ని రద్దు చేసుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని గాడ్గే బాబా ఎవరైనా 'మీదే కులం' అని అడుగుతే అంటరానివాడనని చెప్పేవారు. దానితో అవమానాలూ, ఛీత్కారాలూ ఎదురయ్యాయి. ఆ రకంగా వందల ఏళ్లుగా ఓ ప్రధాన సమూహం అనుభవిస్తున్న బాధల్ని అనుభవంలోకి తెచ్చుకున్నారు.

ఊళ్ళో వాళ్ళ పనులు చేసి పెట్టి వాళ్లు పెట్టే జొన్న రొట్టెలు మాత్రమే తీసుకునేవారు. ఏ ఊరు వెళితే ఆ వూరి వాళ్లను చీపురు అడిగి చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేలా ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. సాయంత్రం తాను శుభ్రపరచిన గుడి దగ్గరే రెండు రాళ్ళను తీసుకుని తాళం వేస్తూ తన అద్భుతమైన కంఠంతో కీర్తనలు పాడేవారు. చివరికి 1956 డిసెంబర్ 20న తుది శ్వాస విడిచారు. ఆయన స్ఫూర్తితో సామాజిక సమరసతను పెంపొందిద్దాం. విద్వేషాలు లేని సమ సమాజాన్ని నిర్మిద్దాం.

– సామల కిరణ్ । 99493 94688
(రేపు గాడ్గే బాబా వర్ధంతి)

సాంకేతిక పోటీలో నిలబడాలంటే...

సందర్భం



ఆచార్య అజయ్ కుమార్ సూద్

గౌరవనీయులైన ఛాన్సలర్ శ్రీ గిరిధర్ మాలవ్య, వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ జైన్ తదితరులకు నమస్కారం. 103వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొనడం నాకు దక్కిన గౌరవం. ఈ రోజు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు జ్ఞాపకాల పుస్తకంలో శాశ్వతంగా నిలిచిపోయే రోజు ఇది. తరగతి గదులనూ, పరీక్షలనూ దాటుకొని వాస్తవ ప్రపంచంలోకి మీ ప్రయాణం ప్రారంభమయ్యే రోజు ఇది. ఈ తరుణంలో రాబోయే కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం ఎదుర్కొనే సవాళ్లను, లభించే అవకాశాలను పరిశీలిద్దాం.

విద్య, శాస్త్ర (సైన్స్), సాంకేతికత (టెక్నాలజీ), నూతన పరిశోధనలు – అనే నాలుగు స్తంభాలు ఏ దేశాన్నైనా బలంగా నిలబెట్టేవి. ఈ నాలుగు స్తంభాలూ దేనికదే గణనీయమైన బలాన్ని సముపార్జించుకున్నప్పటికీ దేనికదే ఒంటరిగా చాలా కాలం పయనించాయి. గతానుగతికమైన ఈ దృక్పథం మారాలి. అలా మారిన దృక్పథం ఎక్కువ ప్రయోజనాలను పొందేలా చేస్తుంది. ఈ విధానం వలన ఉత్సుకతతో నడిచే ప్రాథమిక శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు, అనువర్తిత పరిశోధనలు అనే విభజనకు దారితీసింది. నేటి ప్రాథమిక శాస్త్ర విజ్ఞానం త్వరలో సాంకేతికతా రూపంలోకి అనువర్తించ బడుతుందని గుర్తుంచుకోవాలి. గురుత్వాకర్షణ తరంగాలను కూడా అంచనా వేసిన ఐన్‌స్టీన్ 'సాపేక్షతా' సిద్ధాంతం గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీ) అనే సాంకేతికతకు కచ్చితంగా అవసరమని ఆనాడు ఎవరూ ఊహించి ఉండరు. ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాధారణ సాపేక్ష సిద్ధాంతం లేకుండా ఉపగ్రహాలు ఎలా కదులుతాయో కచ్చితంగా అంచనావేసి చెప్పలేం కదా.

ఈ సందర్భంలో భారత ప్రభుత్వ ప్రధాన సాంకేతిక సలహాదారుగా, నా సహచరులతో కలిసి సాంకేతికతకు సంబంధించి ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను రూపొందించే క్రమంలో మా ఆలోచనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాము. విఘాతం కలిగించే అభివృద్ధి కన్నా క్రమాభివృద్ధే మాకు ముఖ్యం. భారతదేశం అనేక రంగాలలో వైజ్ఞానిక విప్లవాల దిశగా దూసుకుపోతోంది. క్వాంటం టెక్నాలజీ, ఎమర్జింగ్ డిజిటల్ టెక్నాలజీ, ఆరోగ్య రక్షణ, క్లీన్ ఎనర్జీ వంటివి అందులో కొన్ని ముఖ్యమైనవి.

క్వాంటం విప్లవం గురించి రెండు మాటలు చెబుతాను. మొదటి క్వాంటం విప్లవం 1913–1925



మధ్య సంభవించింది. దీనివల్ల హైడ్రోజన్ అణువు వర్ణపట రేఖలు క్వాంటం పద్ధతి ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలిగాం. ప్రస్తుతం చూస్తున్న రెండవ క్వాంటం విప్లవంలో వ్యక్తిగతమైన, సంక్లిష్టమైన క్వాంటం సిస్టమ్‌లను నియంత్రించడంపై దృష్టి పెట్టడం కనిపిస్తుంది. అంటే సంప్రదాయ కంప్యూటర్‌లను ఉపయోగించి పరిష్కరించలేని సమస్యలను పరిష్కరించడమన్నమాట! ఉదాహరణకు ప్రకృతిలో సహజసిద్ధంగా జరిగే కిరణజన్య సంయోగక్రియలో సౌరశక్తిని రసాయనశక్తిగా మార్చగలిగే పత్రహరిత రేణువులూ, అలాగే వాటి అనుబంధ ద్రవ్యాల శక్తినీ 'క్వాంటం మోడల్' అనే చిత్రపటం ద్వారా కిరణజన్య సంయోగక్రియ సమర్థతను తెలుసుకోవచ్చు. కొన్ని ప్రయోగశాలల్లో ఇప్పటికే క్వాంటం కంప్యూటర్స్ ద్వారా ఏర్పాటు చేసిన 'క్యూ బిట్స్' ఉండటాన్ని మనం గమనిస్తున్నాము. భారతదేశం క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ఇటీవల ఒక మిషన్‌ను ప్రారంభించింది.

ఇవ్వాళ డిజిటల్ టెక్నాలజీ కృత్రిమ మేధ... యాంత్రిక శిక్షణ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి విషయాలపై దృష్టిని సారించింది. సాంకేతిక రంగంలో ప్రపంచపోటీలో నిలబడటానికి, పరిశోధన–అభివృద్ధి, లక్ష్యంగా సాంకేతిక అభివృద్ధి – విస్తరణయే సరైన మార్గం. అందువల్ల, మేము ఇప్పటికే అమెర్జింగ్, ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీస్‌లపై వివిధ జాతీయ మిషన్లను రూపకల్పన చేశాం. సైబర్ ఫిజికల్ సిస్టమ్‌పై జాతీయ మిషన్, సెమీకండక్టర్లపై జాతీయ మిషన్, కృత్రిమ మేధపై జాతీయమిషన్ వంటివి ఇటువంటివే.

భారత్ కృత్రిమమేధ, యంత్ర అభ్యాసాన్ని, రోబోటిక్స్, టెలిహెల్త్‌ను ఉపయోగించుకొని స్వదేశీయమైన కొత్త వైద్య పరికరాల తయారీలో ముందడుగులో ఉంది. సాంకేతికంగా స్వావలంబనతో ఉండాలంటే మెరుగైన సాంకేతిక ఆధారిత ఉత్పత్తులనూ, సాంకేతిక ఆధారిత వ్యవస్థాపకతనూ సమాంతరంగా ప్రోత్సహించాలి. శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన విషయాలలో ఒకటి కంటే ఎక్కువ మార్గాల్లో భాగం కావడానికి మీ తరానికి ఇది అద్భుతమైన అవకాశం. మీలో చాలా మంది భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన సవాళ్ళనూ, సామాజికంగా ఎదురయ్యే అవరోధాలనూ పరిష్కరించడానికి కృషి చేస్తారని భావిస్తున్నాను.

(బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సలహా దారు ఆచార్య అజయ్ కుమార్ సూద్ ప్రసంగ సంక్షిప్త రూపం. అనువాదం: ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు)

కర్మఫలం వదిలి పోదు!

ఆధ్యాత్మిక భారతీయతకు కర్మసిద్ధాంతం వెన్నెముక వంటిది. ఈ సిద్ధాంతం ప్రకారం మనిషి పుట్టిన తరువాత చేసే ప్రతి పని కూడా కర్మగానే పరిగణించబడుతుంది. మనుషుల జీవితాలలో సమస్తమైన పనులూ కర్మములేనసీ, ప్రతి కర్మకు కారణం, ఫలితం అనేవి రెండూ ఉంటాయని కర్మ సిద్ధాంతం చెబుతుంది. అయితే చేసే పని, అనగా కర్మ, కంటికి కనపడుతుంది కాని ఆ కర్మ ఫలితం కంటికి వెంటనే కనిపించాలన్న నియమం లేదు. కర్మ ఫలితం పాప పుణ్యాల రూపంలో రెండు విధాలుగా ఉంటుందన్నది కూడా కర్మ



జ్యోతిర్మయం

సిద్ధాంతంలో ఒక ప్రధానాంగం. ఈ విశ్వంలో ఏ చిన్న ప్రాణి యొక్క జన్మ కూడా ఏదో ఒక్క జన్మతో సమాప్తమయ్యేది కాదనీ, ఒక జన్మలో చేసిన కర్మల ఫలితాలు ఆ జన్మలోనే అనుభవించబడవనీ, పునర్జన్మ ఉంటుందనీ, ప్రాణుల కర్మల యొక్క ఫలాలైన పాపపుణ్యాలు వారిని వదలక ముందు జన్మలలో సైతం వెంటాడతాయనీ చెప్పడం కర్మసిద్ధాంతంలో అతి ముఖ్యమైన భాగం. ఈ విషయాన్నే 'మార్కండేయ పురాణం' ద్వితీయాశ్వాసంలో ఒక వినసొంపైన కందపద్యం ద్వారా చెప్పాడు ఆ పురాణకర్త మారన కవి.

విను తళియ నిడిన యన్నం
బును బోలెం జేసినట్టి పుణ్యము పాపం
బును మానవులకు నేవిధ
మున గుడువక పోవు గర్మములు ప్రబలంబుల్.

'కుడుచు' అనే మాటకు తినుట, తాగుట, అనుభవించుట అని మూడు అర్థాలున్నాయి. ఆ సౌకర్యాన్ని ఆధారంగా చేసుకుని కూర్చిన పద్యం పైది. ఆహ్లాదకరమైన శ్లేష ఉన్నది ఇందులో. 'మనిషి చేసుకున్న పాపపుణ్యాలు కంచంలో పెట్టి ఉంచిన భోజన పదార్థాల వంటివి. ఎవరివైతే వారికే ఉద్దేశించబడినట్టివి. ఎప్పటికైనా వాటిని భుజించక తప్పదు. కర్మలనేవి అలాంటివి. వాటికి చాలా గొప్ప శక్తి ఉంది. ఎన్ని జన్మలకైనా వెంటనంటి వస్తూ, ఫలం అనుభవించేదాకా వదలవు అవి!' అని పై పద్యం భావం. కర్మఫలాన్ని భోజన పదార్థంతో పోల్చి కర్మసిద్ధాంతం యొక్క హృదయాన్ని గురించి హృద్యంగా చెప్పాడు మారన కవి ఇందులో.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.సప్తమి సా.4.02 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.3.12 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.10.47 నుండి 12.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.25 వరకు, తదుపరి రా.10.39 నుండి 11.31 వరకు, **అమృతఘడియలు:** రా.7.46 నుండి 9.13 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.26.

ఇంటి కోసం ఇంటిల్లిపాదినీ


చైత్ర


చైత్రిక్


ప్రసాద్




ప్రసాద్ భార్య శాన్విక (మధ్యలో), చెల్లెళ్లు స్వప్న, స్రవంతి

▶ మొదటి పేజీ తరువాయి

ఓ యువతి మృతదేహం లభ్యం కావడంతో బయటపడింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లావాసులు ఉలిక్కిపడేలా చేసిన వరుస హత్యల వివరాలిలా.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన మంగలి ప్రసాద్ ఏడాది క్రితం ఉపాధి కోసం కామారెడ్డి జిల్లాలోని పాల్వంచకి వచ్చి కుటుంబంతో పాటు నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య శాన్విక అలియాస్ రమణి (30), కవల పిల్లలు చైత్ర (7), చైత్రిక్ (7), ఇద్దరు చెల్లెళ్లు స్రవంతి (20), దివ్యాంగురాలైన స్వప్న (16) ఉన్నారు. ప్రసాద్ మాక్లూర్‌లో ఉన్న సమయంలో ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. అనంతరం అతడు బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లాడు. ప్రసాద్ కువైట్‌లో ఉన్నప్పుడు ప్రియురాలితో విభేదాలు వచ్చాయి. ఈ క్రమంలో ఆమె ప్రసాద్ పేరుతో సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడింది. అతడు స్వదేశానికి రాగానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ కేసులో రిమాండ్ పూర్తయి బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత అతడు పాల్వంచకు మకాం మార్చాడు. కాగా యువతి ఆత్మహత్య కేసు నుంచి బయట పడేందుకు గల్ఫ్‌లో ఉన్నప్పుడే ఒప్పందం చేసు కున్నాడు. ఈ క్రమంలో తన పేరు మీద మాక్లూర్‌లో ఉన్న స్థలాన్ని, ఇంటిని అమ్మాలనుకున్నాడు. అతడి స్నేహితుడైన మాక్లూర్‌కు చెందిన ప్రశాంత్ ఆ ఇంటిని తానే కొంటానని చెప్పి కొంత డబ్బును అప్పట్లో ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇంటిని ముందుగా తన పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే బ్యాంక్ లోన్ తీసుకుని మిగతా డబ్బులు ఇస్తానని ప్రసాద్‌ను ఒప్పించాడు. దీంతో ఇంటిని ప్రశాంత్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. అయితే రోజులు గడుస్తున్నా రుణం రాకపోవడంతో ప్రసాద్ ఇంటిని తిరిగి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని, లేదంటే డబ్బులు ఇవ్వాలని ప్రశాంత్‌ను అడిగాడు.

అడ్డు తొలగించుకుంటే ఆ ఇల్లు మొత్తం తనదే అవుతుందని

ప్రసాద్‌ను, అతని కుటుంబసభ్యుల అడ్డు తొలగించుకుంటే ఇల్లు మొత్తం తనదే అవుతుందని ప్రశాంత్ భావించాడు. ఆ మేరకు నవంబర్ 28న ప్రసాద్ హత్యకు ప్లాన్ వేశాడు. డిచ్‌పల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి ప్రసాద్‌ను హత్య చేసి మృతదేహాన్ని చెట్లపొదల్లో పూడ్చి పెట్టాడు. తర్వాత పాల్వంచలోని అతడి ఇంటికి వెళ్లాడు. ప్రసాద్‌ను పోలీసులు ఓ కేసు విషయంలో అరెస్ట్ చేశారని నమ్మించి అతడి భార్య శాన్విక (ప్రస్తుతం ఈమె గర్భవతి)ను బాసరకు తీసుకువెళ్లాడు. ఆమెను హత్య చేసి గోదావరి నదిలో పడేశాడు. ఆ తర్వాత ఇద్దరు పిల్లలు చైత్ర, చైత్రిక్‌లను ఈనెల 9న తీసుకువెళ్లి నిర్మల్ వెళ్లే దారిలో సోన్ బ్రిడ్జి వద్ద హత్య చేసి వాగులో పడేశాడు. బాలిక చైత్ర మృతదేహం అదే రోజు లభించగా.. చైత్రిక్ మృతదేహం 18వ తేదీన లభించింది. ఇద్దరు పిల్లలను చంపిన తర్వాత ప్రశాంత్ తిరిగి ప్రసాద్ ఇంటికి వెళ్లాడు. అన్న, వదినలు పోలీస్ స్టేషన్‌లో ఉన్నా రని నమ్మించి ప్రసాద్ చెల్లెళ్లు స్రవంతి, స్వప్నలను బైక్‌పై తీసుకువెళ్లి ఆ ఇద్దరిని కూడా హత్య చేశాడు. ఇదిలా ఉండగా సదాశివనగర్ పోలీసులు 14న ఓ మృతదేహాన్ని గుర్తించి విచారణ చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా మాక్లూర్‌కు చెందిన ప్రశాంత్‌ను నిందితుడిగా గుర్తించారు. పోలీసుల విచారణలో ప్రశాంత్ హత్యలను వివరించినట్లు తెలిసింది. ఈ హత్యలలో అతడికి మరో ముగ్గురు సహకరించినట్లు విచారణలో తేలింది. ప్రశాంత్‌తో పాటు హత్యలకు సహకరించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఆ వడ్లకు పైసలిచ్చేస్తాం!

రైస్ మిల్లర్ల వద్ద నిల్వ ఉన్న 83 ఎల్ఎంటీ ధాన్యంపై సర్కార్ సీరియస్

- ఈ ధాన్యం విలువ రూ.18వేల కోట్లుగా తేలిన లెక్క
- నిల్వ ఉన్న ధాన్యాన్ని ఇప్పటికే మిల్లర్లు అమ్ముకున్నట్లు ప్రభుత్వ నిర్ధారణ
- మిల్లుల్లో లెక్క చూపిన ధాన్యం ధర చెల్లించేందుకు సిద్ధమని సర్కార్‌కు మిల్లర్ల రాయభారం
- క్వింటాలుకు రూ.2,350 చొప్పున వసూలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం?



సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లులకు పంపిన 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఏమైందో లెక్క తెలియడం లేదని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మిల్లర్లు బెంబేలెత్తుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే మంత్రి ఉత్తమ్ పౌరసరఫరాల సంస్థ పనితీరుపై సమీక్ష నిర్వహించి రూ.56 వేల కోట్ల అప్పులు, రూ.11 వేల కోట్ల నష్టాల్లో ఉన్నట్లు తేల్చారు. ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్‌లలో చోటు చేసుకున్న అవకతవకలే అందుకు కారణమని, మిల్లర్లు ఇప్పటికే ధాన్యాన్ని విక్రయించడంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు కూడా లేవని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మిల్లర్లలో ఆందోళన మొదలైంది. సర్కార్ ధాన్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోకముందే రాజీ చేసుకోవాలని భావిస్తున్నారు. తమ వద్ద ఉన్న ధాన్యం నిల్వ విలువను ఖర్చులతో కలిపి ప్రభుత్వానికి చెల్లించాలని ప్రతిపాదనలు పంపించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయమేదీ తీసుకోలేదు.

మిల్లర్ల వద్ద 83 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం

గత సంవత్సరం రబీ(యాసంగి)లో సేకరించిన 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ముడిబియ్యంగా మిల్లింగ్ చేసేందుకు పనికిరాదని, బాయిల్డ్ రైస్‌గా మాత్రమే మిల్లింగ్ చేయడానికి వీలవుతుందని మిల్లర్లు తేల్చి చెప్పారు. ఈ మేరకు 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుల్లోనే నిల్వ చేసినట్లు లెక్కలు చూపించారు. ఇదే కాకుండా గత సంవత్సరం వానకాలానికి సంబంధించిన మరో 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా మిల్లింగ్ చేసి, ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగించడంలో మిల్లర్లు విఫలమయ్యారు. ఈ మొత్తం 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ సుమారు రూ. 18 వేల కోట్లుగా ప్రభుత్వం నిర్ధారించింది. సంస్థకున్న రూ.56 వేల కోట్ల అప్పుల్లో ఈ రూ.18 వేల కోట్లు చెల్లిస్తే తప్ప మళ్లీ అప్పు పుట్టని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మిల్లర్ల వద్ద ఉన్నట్లు చెపుతున్న 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంపై కీలక నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనిపై పౌరసరఫరాల సంస్థ సీఎండీ అనిల్ కుమార్, ఇతర అధికారులు ప్రణాళిక రూపొందించారని తెలిసింది. మిల్లర్లు స్వయంగా ధాన్యం విలువ చెల్లించేందుకు ముందుకు వస్తున్న నేపథ్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన కనీస మద్దతు ధరకు తోడు, రవాణా, నిర్వహణ ఖర్చులన్నీ మిల్లర్ల నుంచి వసూలు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

వేలం ప్రయత్నాలు విఫలం..

మిల్లర్లు సీఎంఆర్‌కు తిరస్కరించిన యాసంగి ధాన్యాన్ని విక్రయించాలని గత ప్రభుత్వం ఆగస్టు నెలలో నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత 25 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యాన్ని అమ్మేందుకు బిడ్డర్ల నుంచి టెండర్లను ఆహ్వానించారు. ఈ టెండర్లకు 10 సంస్థలే అర్హత సాధించడంతో పాటు ధాన్యం క్వింటాలుకు సగటు ధరను రూ.1865 గా కోట్ చేయడంతో ఈ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసింది. దాంతో ప్రభుత్వం అక్టోబర్‌లో రెండో దఫా టెండర్లను ఆహ్వానించింది. నిబంధనలను సడలించి సాధారణ మిల్లర్లు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనేలా టెండర్లను ఆహ్వానించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ టెండర్లకు ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువు దీరినప్పటికీ, పాత టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మిల్లర్ల వద్ద 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు లెక్కల్లో కనిపిస్తున్నప్పటికీ, అందులో సగానికి పైగా విక్రయించినట్లు పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే గుర్తించింది. కర్ణాటక, తమిళనాడుకు భారీ ఎత్తున ధాన్యాన్ని, బియ్యాన్ని విక్రయించినట్లు ప్రభుత్వం వద్ద సమాచారం ఉంది. ఈ పరిస్థితుల్లో మిల్లర్ల నుంచి ధాన్యం విలువకు సమానమైన మొత్తాన్ని (క్వింటాలుకు రూ. 2,350) చొప్పున ముక్కు పిండి వసూలు చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో మిల్లుల్లో ఉన్న ధాన్యంపై కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

కొలిక్కిరాని మేడిగడ్డ పునరుద్ధరణ!

- పని పూర్తయిందని రెండేళ్ల కిందే ధ్రువీకరణ ఇచ్చారన్న ఎల్ అండ్ టీ
- డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తయిందని వెల్లడి
- నిర్మాణంలో నాణ్యత లోపాలపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
- తప్పించుకోవాలనుకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక
- బాధ్యత తమదేనని ఎల్ అండ్ టీ గతంలో చెప్పిందన్న ఈఎన్‌సీలు
- ప్రకటన చేసిన జీఎంకు ఆ అధికారం లేదన్న ఎల్ అండ్ టీ
- బ్యారేజీ కుంగడానికి మూల కారణమేంటో తేల్చాలని ఉత్తమ్ సూచన
- మేడిగడ్డ బ్యారేజీపై నిర్మాణ సంస్థతో వాడీవేడి సమావేశం


మేడిగడ్డ బ్యారేజీపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ వ్యవహారం కొలిక్కి రాలేదు. సొంత ఖర్చుతో పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ మరోసారి నిరాకరించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు సి.మురళీధర్, బి.నాగేందర్ రావు, నల్లా వెంకటేశ్వర్లుతో కలిసి ఎల్ అండ్ టీ డైరెక్టర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వీ దేశాయ్ బృందంతో సమావేశమై బ్యారేజీ పునరుద్ధరణపై చర్చించారు. మేడిగడ్డ బ్యారేజీ పనుల్లో నాణ్యత లోపాలు ఎలా చోటుచేసుకున్నాయని మంత్రి ఎల్ అంట్ టీ బృందంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక లేఖ రాసి బ్యారేజీ పునరుద్ధరణ నుంచి తప్పుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. 2020 జూన్ 29 నాటికి బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని, ఒప్పందం ప్రకారం పని పూర్తయినట్టు ధ్రువీకరిస్తూ 2021 మార్చి 25న ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ లేఖ సైతం ఇచ్చారని ఎల్ అండ్ టీ బృందం వివరించింది. నీటిపారుదల శాఖ ఇచ్చిన డిజైన్ల ప్రకారమే బ్యారేజీని నిర్మించామని, డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ సైతం ముగిసిందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత తమది కాదని పేర్కొంది. గత అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకు కుంగిపోగా, మరుసటి రోజే బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత తమదేనని అంగీకరిస్తూ ఎల్ అండ్ టీ జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనను నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు మంత్రికి చూపించారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకునే స్థాయి కానీ, అధికారం కానీ సురేశ్‌కుమార్‌కు లేదని ఎల్ అండ్ టీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దేశాయ్ చెప్పినట్లు తెలిసింది. అప్పట్లో ఆయనపై ఒత్తిడి చేసి ప్రకటన ఇప్పించారని ఆరోపించినట్టు సమాచారం. ఎల్ అండ్ టీ బోర్డు సమావేశంలో చర్చించి ఆమోదించాకే ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ పనులు పూర్తయినా ఒప్పందం ప్రకారం చేయాల్సిన కొన్ని పనులు ఇంకా పూర్తి కాలేదని, చివరి బిల్లును సైతం ఇప్పటివరకు చెల్లించలేదని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో సాంకేతికంగా పనులు పూర్తికానట్టేనని వాదించారు.

ఇంకా అంచనాలే రూపొందించలేదా?

మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణలో భాగంగా గోదావరిలో ఎగువ నుంచి వస్తున్న జలాలను దారి మళ్లించడానికి కాఫర్ డ్యామ్ నిర్మించాల్సి ఉంటుందని, ఇందుకు రూ.55.5 కోట్ల మేర ప్రతిపాదనలు సమర్పించాలని ఎల్ అండ్ టీ ప్రతినిధులు ఉత్తమ్‌కు వివరించారు. కాఫర్ డ్యామ్‌కు అంత వ్యయం కాదని ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు బదులిచ్చారు. మీ అంచనాల ప్రకారం ఎంత వ్యయం అవుతుందని ఉత్తమ్ ఆయనను ప్రశ్నించారు. ఇంకా అంచనాలు రూపొందించలేదని వెంకటేశ్వర్లు బదులివ్వగా, మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాఫర్ డ్యామ్ నిర్మాణంలో భాగంగా పునాది కింద దృఢత్వం కోసం కటాఫ్ పైల్స్ వేయాల్సి ఉంటుందని, వీటిని ఆర్డర్ ఇచ్చి తెప్పించుకోవడానికే 45 రోజుల సమయం పడుతుందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు వివరించారు.

అనుభవం కోసమే సర్టిఫికెట్ ఇచ్చి ఇరుక్కున్నారు..

మేడిగడ్డ పనులు చేసిన అనుభవం వాడుకుని కొత్త కాంట్రాక్టులు దక్కించుకోవడానికి ఎల్ అండ్ టీ సంస్థ వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ కోరగా, ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ జారీ చేసేయడంతోనే సమస్య ఉత్పన్నమైందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒప్పందం ప్రకారం పనులన్నీ పూర్తికాకుండానే ఎలా జారీ చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ సర్టిఫికెట్‌ను అడ్డం పెట్టుకుని ఎల్ అండ్ టీ సంస్థ బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.

కారణమేంటో తేల్చండి!

మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత ఎవరిదన్న అంశంపై వివాదాన్ని పక్కనపెట్టి అసలు బ్యారేజీ కుంగడానికి కారణాలను వెలికి తీయాలని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సమస్యకు మూల కారణం తెలిసిన తర్వాత పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలిసింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితిని తెలుసుకోవడానికి పరీక్షలు నిర్వహించాలని, ఇందుకోసం నిర్మాణ సంస్థలను పిలిపించి మాట్లాడాలని ఆదేశించారు. తప్పు చేసి తప్పించుకోవాలని చూస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రితో సమావేశం అనంతరం కాఫర్ డ్యామ్ నిర్మాణం పనులను ప్రారంభించే అంశంపై ఎల్ అండ్ టీ బృందంతో ఈఎన్‌సీలు చర్చించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని, అదనపు పనులకు ఏదైనా ఆర్థిక సహాయం అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

క్లుప్తంగా...

ఏఏజీగా బాధ్యతలు చేపట్టిన రజనీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ)గా న్యాయవాది తేరా రజనీకాంత్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కేసుల్లో ప్రభుత్వ వాదనలు సమర్థవంతంగా వినిపిస్తానని, పెండింగ్ పిటిషన్లు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తేరాను హైకోర్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాద్రీ, నిషాంత్‌రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏజీ బీఎస్ ప్రసాద్, మాజీ ఏఎస్‌జీ సూర్యకరణ్‌రెడ్డి, హెచ్‌సీఏఏ ఉపాధ్యక్షుడు కల్యాణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'సింగరేణి ఎన్నికల'పై కౌంటర్ వేయండి

వర్కర్స్ యూనియన్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సింగరేణి ఎన్నికలు వాయిదా కోరుతూ దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని ది సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను హైకోర్టు ఆదేశించింది. డిసెంబర్ 27న నిర్వహించాల్సిన కార్మిక సంఘం ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేసింది. అయితే కేంద్ర కార్మిక శాఖ ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని వర్కర్స్ యూనియన్‌ను ఆదేశిస్తూ, విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్ర క్రియను ప్రారంభించి, నవంబర్ 30 లోపు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించాలని అక్టోబర్‌లో సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మరోసారి ఎన్నికలు వాయిదా కోరుతూ తాజాగా ఎస్‌సీసీఎల్ హైకోర్టును ఆశ్రయించింది.

నాపై ఉన్న కేసు కొట్టివేయండి

- ఎస్సీ, ఎస్టీ కేసుపై హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

సాక్షి, హైదరాబాద్: తనపై దాఖలైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ జస్టిస్ కె.సురేందర్ ముందుకు వచ్చింది. అయితే ప్రజాప్రతినిధులపై విచారణను ఈ బెంచ్ చేపట్టలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీంతో పిటిషన్ జస్టిస్ కె.లక్ష్మణ్ ముందుకు ఒకట్రెండు రోజుల్లో విచారణకు రానుంది. కేశవాపురం గ్రామంలో గిరిజనుల భూములు కబ్జా చేసి ఎన్నికల సమయంలో రాత్రికిరాత్రే రిజిస్ట్రేషన్ చేశారన్న ఫిర్యాదు మేరకు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో మల్లారెడ్డితో పాటు తహసీల్దార్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఆటలో గడ్డివాముకు నిప్పంటుకుని..

నాలుగేళ్ల బాలుడి ఆహుతి


జియా ఉద్దీన్

ఆర్మూర్ టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని చేపూర్‌లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదానికి ఓ బాలుడు బలయ్యాడు. చేపూర్ గ్రామానికి చెందిన నజీరుద్దీన్ కుమారుడు జియా ఉద్దీన్(4) సోమవారం తన పెద్ద నాన్న కూతురు జైరాబానుతో కలిసి ఇంటి ముందు గేదెల కోసం నిల్వ ఉంచిన గడ్డివాము వద్ద ఆడుకుంటున్నాడు. ఇద్దరిలో ఒకరు గడ్డివాముకు నిప్పంటించారు. పొగలు రావడంతో బాలిక అరుస్తూ బయటకు వెళ్లిపోయింది. మంటలు చెలరేగడంతో జియాఉద్దీన్ అక్కడే చిక్కుకుపో యా డు. స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే బాలుడు అగ్నికి ఆహుతయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు తెలిపారు.

'ఆటా సేవా' గ్రాండ్‌ఫినాలేకు స్పీకర్‌కు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: రవీంద్రభారతిలో ఈనెల 30న జరిగే ఆటా సేవా కార్యక్రమాల గ్రాండ్ ఫినాలేలో పాల్గొనాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆటా ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ప్రసాద్ కుమార్‌ను ఆటా వేడుకల ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా.. ఆటా ప్రతినిధులు వేణు సంకినేని, రామకృష్ణారెడ్డి, సతీశ్‌రెడ్డి, రవీందర్ కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అలాగే మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిలను కలిసి ఆహ్వానించారు. ఆటా గ్రాండ్ ఫినాలేతో పాటు, 2024, జూన్ 7, 8, 9 తేదీల్లో అమెరికా, అట్లాంటాలో నిర్వహించే కాన్ఫరెన్స్‌కు కూడా హాజరై అక్కడి తెలుగు వారికి తమ అభినందనలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో 18వ ఆటా కాన్ఫరెన్స్ కన్వీనర్ సాయి సూదిని, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ కాశీ కొత్త, నరసింహారెడ్డి ద్యాసాని, ఇండియా కో ఆర్డినేటర్ జ్యోత్స్నారెడ్డి పాల్గొన్నారు.

78 మందిపై వేటు

పార్లమెంటులో సస్పెన్షన్ల పర్వం • ఇప్పటిదాకా 92కు చేరిన సస్పెండైన ప్రతిపక్ష ఎంపీల సంఖ్య

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఉభయ సభల్లో ఏకంగా 78 మంది ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. ఒకేరోజు 78 మందిని బహిష్కరించడం భారత పార్లమెంట్ చరిత్రలో ఇదే మొదటిసారి. పార్లమెంట్‌లో ఈ నెల 13వ తేదీనాటి భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ సభలో తీవ్ర అలజడి సృష్టించిందుకు వీరిని సస్పెండ్ చేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ప్రకటించారు. లోక్‌సభ నుంచి 33 మంది, రాజ్యసభ నుంచి 45 మంది విపక్ష ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. గత వారమే లోక్‌సభలో 13 మంది, రాజ్యసభలో ఒక విపక్ష ఎంపీపై సస్పెన్షన్ వేటు పడిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సస్పెండైన మొత్తం ప్రతిపక్ష సభ్యుల సంఖ్య 92కు చేరుకుంది. వీరంతా ఒకే కారణంతో వేటుకు గురయ్యారు. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరణ, రాజీనామాకు డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో ఆందోళనకు దిగారు. ఎంపీల నినాదాలు, నిరసనలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. సస్పెన్షన్ల పర్వంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన బిల్లులపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా ప్రభుత్వం కుట్ర పన్నిందని, అందులో భాగంగానే సస్పెండ్ చేసిందని మండిపడ్డారు.

లోక్‌సభలో విపక్షాల రగడ

భద్రతా వైఫల్యంపై విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బిగ్గరగా నినాదాలు చేయడంతో లోక్‌సభ సోమవారం పలుమార్లు వాయిదా పడింది. కేంద్ర మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. శాంతించాలని, సభా కార్యకలాపాలకు సహకరించాలని స్పీకర్ పలుమార్లు కోరినా ఫలితం లేకుండాపోయింది. దాంతో 33 మంది విపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు వేర్వేరు తీర్మానాలు మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. అనంతరం సదరు ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. వీరిలో 10 మంది డీఎంకే, 9 మంది తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. స్పీకర్ పోడియంపైకి చేరుకొని నినాదాలు చేసిన ముగ్గురు కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తనపై విచారణ జరపాలని సభా హక్కుల కమిటీని స్పీకర్ ఆదేశించారు. ఆ నివేదిక వచ్చేదాకా వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మిగతా ఎంపీలను శీతాకాల సమావేశాలు ముగిసేదాకా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యసభలో అదే దృశ్యం

రాజ్యసభలో కూడా అదే దృశ్యం పునరావృతమైంది. చైర్మన్ ఆదేశాలను ధిక్కరించడంతోపాటు సభా కార్యక్రమాలకు అడ్డు తగులుతూ అనుచితంగా ప్రవర్తించడంతో మొత్తం 45 మంది ప్రతిపక్ష సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. వీరిలో 12 మంది కాంగ్రెస్, ఏడుగురు తృణమూల్, నలుగురు డీఎంకే సభ్యులున్నారు. 45 మందిలో 34 మందిని ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం సస్పెండ్ చేశారు. మిగతా 11 మంది



భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి వివరణకు డిమాండ్ చేస్తూ సోమవారం లోక్‌సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విపక్ష ఎంపీలు

సభలో ప్రవర్తించిన తీరుపై విచారణ జరిపి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సభా హక్కుల కమిటీని చైర్మన్ ఆదేశించారు. నివేదిక వచ్చేదాకా సభకు దూరంగా ఉండాలని వారిని చైర్మన్ ఆదేశించారు. దాంతో వారు 3 నెలల దాకా సభకు హాజరయ్యే అవకాశం లేనట్లే.

ప్రస్తుత సెషన్ ముగిసేదాకా సస్పెండైన లోక్‌సభ సభ్యులు

అధీర్ రంజన్ చౌదరి, గౌరవ్ గొగొయ్, కె.సురేశ్, అమర్‌సింగ్, రాజమోహన్ ఉన్నిథాన్, తిరుణావుక్కరసర్, కె.మురళీధరన్, ఆంటోనీ (కాంగ్రెస్); కల్యాణ్ బెనర్జీ, అపురూప పొద్దార్, ప్రసూన్ బెనర్జీ, సౌగతా రాయ్, శతాబ్ది రాయ్, ప్రతిమా మండల్, కకోలీ ఘోష్ దస్తీదార్, అసిత్ కుమార్ మాల్, సునీల్ కుమార్ మండల్ (తృణమూల్ కాంగ్రెస్); టీఆర్ బాలు, ఎ.రాజా, దయానిధి మారన్, టి.సుమతి, కె.నవాస్‌కని, కళానిధి వీరస్వామి, సి.ఎన్.అన్నాదురై, ఎస్.ఎస్.పళనిమాణిక్కం, జి.సెల్వన్, ఎస్.రామలింగం (డీఎంకే); ఈటీ మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్); ఎన్.కె.ప్రేమచంద్రన్ (ఆర్ఎస్పీ); కౌసలేంద్ర కుమార్ జేడీ(యూ)

సభా హక్కుల కమిటీ నివేదిక వచ్చేదాకా సస్పెండైన సభ్యులు:
కె.జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలీక్ (కాంగ్రెస్)

ప్రస్తుత సెషన్ ముగిసేదాకా సస్పెండైన రాజ్యసభ సభ్యులు

ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, కె.సి.వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా, అమీ యాజ్ఞిక్, నరేన్‌భాయ్ జె.రాథ్వా, సయీద్ నాసిర్ హుస్సేన్, ఫూలోదేవి నేతమ్, శక్తిసింహ్ గోహిల్, రజని అశోక్‌రావు పాటిల్, రంజీత్ రంజన్, ఇమ్రాన్ ప్రతాప్‌గార్హీ (కాంగ్రెస్); సుఖేందు శేఖర్ రాయ్, మొహమ్మద్ నదీముల్ హక్, అబిర్ రంజన్ బిశ్వాస్, శాంతను సేన్, మౌసమ్ నూర్, ప్రకాశ్ చిక్ బరాయిక్, సమీరుల్ ఇస్లాం (తృణమూల్ కాంగ్రెస్); ఎం.షణ్ముగలింగం, ఎన్.ఆర్.ఇలాంగో, కనిమొళి ఎన్‌వీఎన్ సోము, ఆర్.గిరిరాజన్ (డీఎంకే); మనోజ్ కుమార్ ఝా, ఫయాజ్ అహ్మద్ (ఆర్జేడీ), రామ్‌గోపాల్ యాదవ్, జావెద్ అలీఖాన్ (ఎస్పీ); రామ్‌నాథ్ ఠాకూర్, అనిల్ ప్రసాద్ హెగ్డే (జేడీ–యూ); వి.సదాశివన్ (సీపీఎం); వందనా చవాన్ (ఎన్సీపీ); మహువా మాజీ (జేఎంఎం); జోస్ కె.మణి (కేసీ–ఎం); అజిత్ కుమార్ భూయాన్ (స్వతంత్ర)

సభా హక్కుల కమిటీ నివేదిక వచ్చేదాకా సస్పెండైన సభ్యులు:
జెబీ మాథర్ హిషామ్, ఎల్.హనుమంతయ్య, నీరజ్ డాంగి, రాజమణి పటేల్, కుమార్ కేటకర్, జి.సి.చంద్రశేఖర్ (కాంగ్రెస్); జాన్ బ్రిట్టాస్, ఎ.ఎ.రహీం (సీపీఎం); బినోయ్ విశ్వం, పి.సందోష్‌కుమార్ (సీపీఐ); మొహమ్మద్ అబ్దుల్లా (డీఎంకే)

“ నియంతృత్వాన్ని పరాకాష్టకు తీసుకెళ్లారు. అచ్చం బాహుబలుల మాదిరిగా ప్రవర్తించారు. సభ నడవాలంటే విపక్షాలు ఉండాలనే కనీస నియమాన్నీ మరిచారు. అందరినీ దారుణంగా సస్పెండ్ చేశారు.
- అధీర్ రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ నేత

లోక్‌సభలో పొగ ఘటనకు కారకుడైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాను సస్పెండ్ చేయాలని మేం కోరుతుంటే మమ్మల్నే సస్పెండ్ చేశారు. ఈ దారుణ ధోరణి ప్రజాస్వామ్యానికే వ్యతిరేకం.
- సౌగతా రాయ్, తృణమూల్ కాంగ్రెస్ నేత

పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ ఇలాంటిది జరగలేదు. 33 మంది లోక్‌సభ ఎంపీలను సస్పెండ్ చేస్తారా?. సభను ప్రశాంతంగా నడపాలి. అధికార పార్టీ సభ్యుల వైఖరి మీదే అది ఆధారపడి ఉంటుంది. విపక్షాలు వివరణ కోరుతుంటే ప్రభుత్వం ఈ విధంగా స్పందించడం దారుణం.
- టీఆర్ బాలు, డీఎంకే నేత

కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ ల్యాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీన తమ ముందు విచారణకు హాజరు కావాలని కోరింది. నవంబర్ 2వ తేదీన మొదటిసారిగా ఈడీ అధికారులు కేజ్రీవాల్‌కు నోటీసు పంపారు. కానీ, అది ఉద్దేశపూర్వకం, అస్పష్టం, అన్యాయమని ఆరోపిస్తూ కేజ్రీవాల్ ఆ విచారణకు గైర్హాజరయ్యారు. ఇలా ఉండగా, ఈ నెల 19వ తేదీ నుంచి 10 రోజులపాటు సాగే విపాసన మెడిటేషన్ కోర్సులో పాల్గొనేందుకు సీఎం కేజ్రీవాల్ గుర్తు తెలియని ప్రాంతానికి వెళతారని ఢిల్లీ ప్రభుత్వ అధికారి ఒకరు శనివారం ప్రకటించడం గమనార్హం.

లద్దాఖ్‌లో మూడు భూకంపాలు

జమ్మూ: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో సోమవారం పావుగంట వ్యవధిలో మూడుసార్లు భూకంపం సంభవించగా జమ్మూకశ్మీర్‌లో కిష్త్‌వార్‌లో స్వల్ప తీవ్రతతో భూమి కంపించింది. నష్టం, మరణాలకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదని అధికారులు తెలిపారు. కార్గిల్ కేంద్రంగా సాయంత్రం 3.48 గంటల సమయంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.5గా నమోదైందన్నారు. అనంతరం 4.01 గంటల సమయంలో సంభవించిన రెండు భూకంపాల తీవ్రత రిక్టర్ స్కేలుపై వరుసగా 4.8, 3.8గా నమోదైంది. జమ్మూకశ్మీర్‌లోని కిష్త్‌వార్ కేంద్రంగా భూమికి 10 కిలోమీటర్ల లోతులో సాయంత్రం 4.18 గంటలకు సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.6గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మెక్సికోలో క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు... 12 మంది దుర్మరణం

మెక్సికో సిటీ: మెక్సికోలో క్రిస్మస్ సీజన్ వేడుకలు రక్తసిక్తంగా మారాయి.గ్వానజువాటో రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. సల్వాటియెర్రా పట్టణంలో శనివారం రాత్రి నుంచి మొదలైన క్రిస్మస్ 'పొసడా'వేడుకలు ఆదివారం వేకువజాము వరకు కొనసాగాయి. అనంతరం ప్రజలు వేడుక ప్రాంతం నుంచి బయటకు వస్తుండగా గుర్తు తెలియని దుండగులు యథేచ్ఛగా వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 12 మంది చనిపోయారు. డ్రగ్స్ ముఠాల మధ్య విభేదాలే ఈ విషాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు.

బెంగాల్‌లో టీఎంసీ, కాంగ్రెస్ లెఫ్ట్ పొత్తు సాధ్యమే: మమత

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రతిపక్ష ఇండియా కూటమి నేత, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తమ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ), కాంగ్రెస్, వామపక్షాల మధ్య త్రిముఖ పొత్తు కుదిరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. విభేదాలను పరిష్కరించుకోవడంలో కూటమి పార్టీలు కాలహరణం చేశాయన్న ఆమె..ఇప్పటికీ మించిపోయింది లేదన్నారు. బెంగాల్‌లో టీఎంసీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీల మధ్య సీట్ల పంపకంపై ఏకాభిప్రాయం సాధ్యమయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. హిందీ బెల్టుతోపాటు ఇతర ప్రాంతాల్లో బీజేపీ బలం పుంజుకుంటోందన్న వ్యాఖ్యలపై... 'బీజేపీ బలంగా లేదు. మేం బలహీనంగా ఉన్నాం. దీనిని అధిగమించేందుకు కలిసికట్టుగా పని చేయాలి' అని అన్నారు.

నేడు అయోధ్యకు శ్రీరామ పాదుకలు

8 కిలోల వెండి, కిలో బంగారంతో చేయించిన హైదరాబాద్ వాసి

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామాలయం గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ఠకు ముహూర్తం దగ్గర పడింది. ఈలోపు శ్రీరామ పాదుకా యాత్రలో భాగంగా దేశ వ్యాప్తంగా రాముడు నడిచిన మార్గాలమీదుగా పూజలందుకుంటూ శ్రీరామ పాదుకలు మంగళవారం అయోధ్యకు చేరుకోనున్నాయి. 9 కిలోల బరువున్న ఈ పాదుకల కోసం 8 కిలోల వెండి వాడారు. కిలో బంగారంతో పాదుకలకు తాపడం చేశారు. హైదరాబాద్‌కు చెందిన అయోధ్య భాగ్యనగర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాస శాస్త్రి ఈ పాదుకలను తయారు చేయించారు. జనవరి 22న ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత ఈ పాదుకలను ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు.

ఉగ్ర కుట్ర భగ్నం

న్యూఢిల్లీ/బనశంకరి: పేలుళ్లకు పథకరచన చేసిన అనుమానిత ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) సోమవారం అరెస్ట్‌చేసింది. దేశ రాజధానిసహా కర్ణాటక, మహారాష్ట్ర, జార్ఖండ్‌లోని 19 ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు సోమవారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు చేసి ఎనిమిది మంది అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులను అరెస్ట్‌చేశారు. కర్ణాటకలోని బళ్లారి, బెంగళూరు, మహారాష్ట్రలోని అమరావతి, ముంబై, పుణె, జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, బొకారో పట్టణాల్లో ఈ ఆకస్మిక దాడులు జరిగాయి. దాడి ప్రాంతాల్లో అత్యాధునిక పేలుడు పదార్థం(ఐఈడీ) సంబంధ ముడి పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారీ స్థాయిలో నగదు, ఉగ్రవాద సాహిత్యం, స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బళ్లారిలో ఉగ్ర మాడ్యూల్‌కు సారథ్యం వహిస్తున్న మినాజ్ అలియాస్ మొహమ్మద్ సులేమాన్‌ను అరెస్ట్ చేశారు. ఐసిస్ స్ఫూర్తితో ఉగ్రవాదులు బళ్లారి మాడ్యూల్‌ను ఏర్పాటు చేశారని తెల్సుకుని ఎన్ఐఏ డిసెంబర్ 14న కేసు నమోదుచేసి వారి జాడ కోసం వెతుకుతోంది.

కోర్టుకు చేరిన జ్ఞానవాపి సర్వే నివేదిక

- సీల్డుకవర్‌లో అందజేసిన ఏఎస్ఐ అధికారులు
- ఈ నెల 21న విచారణ చేపడతామన్న వారణాసి జిల్లా కోర్టు

వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో చేపట్టిన శాస్త్రీయ సర్వే నివేదికను సోమవారం ఏఎస్ఐ(ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) అధికారులు సీల్డు కవర్‌లో వారణాసి జిల్లా కోర్టుకు సమర్పించారు. దీనిపై ఈ నెల 21న విచారణ చేపడతామని కోర్టు తెలిపింది. వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వేశ్వరుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న 17వ శతాబ్దం నాటి మసీదును అప్పట్లో ఉన్న ఆలయంపైనే నిర్మించారంటూ అందిన పలు పిటిషన్లపై కోర్టు సర్వే చేపట్టాలని జూలైలో ఆదేశించిన విషయం తెలిసిందే. సర్వే నివేదిక ప్రతులను ముస్లిం పక్షం వారికి కూడా ఏఎస్ఐ అధికారులు అందజేసినట్లు హిందూ పిటిషనర్ల తరఫున న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ వెల్లడించారు. తదుపరి విచారణ 21న ఉంటుందని కోర్టు పేర్కొందని తెలిపారు. సర్వే నివేదిక వివరాలను బహిర్గతం చేయరాదంటూ ముస్లిం పక్షం కోర్టులో వేసిన పిటిషన్‌ను తాము సవాల్ చేస్తామన్నారు. మసీదు వెలుపలి గోడపై ఉన్న హిందూ దేవతల శిల్పాల వద్ద పూజలు చేసేందుకు అనుమతించాలంటూ కొందరు మహిళలు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జూలై 21న జిల్లా కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత నిర్మాణాలకు ఎటువంటి నష్టం కలగని రీతిలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకుని శాస్త్రీయంగా సర్వే చేపట్టాలని ఏఎస్ఐకి పురమాయించింది. 'మసీదు గోపురాలు, సెల్లార్లు, పశ్చిమ దిక్కు గోడ కింద సర్వే చేయాలి. పిల్లర్ల వయస్సును నిర్ధారించాలి. భవనం రీతిని విశ్లేషించాలి'అని సూచించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించగా చుక్కెదురైంది. ఏఎస్ఐ అధికారులు సకాలంలో సర్వేను పూర్తి చేయలేకపోవడంతో కోర్టు ఆరు పర్యాయాలు గడువును పొడిగించింది.

కృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా కేసు విచారణ వాయిదా

ప్రయాగ్‌రాజ్: మథురలోని కృష్ణ జన్మభూమి ఆలయాన్ని ఆనుకుని ఉన్న షాహీ ఈద్గా మసీదు ఆవరణలో సర్వే చేపట్టాలన్న అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను ముస్లిం పక్షం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై వచ్చే జనవరి 9వ తేదీన విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించిందని ముస్లిం పక్షం అలహాబాద్ హైకోర్టుకు తెలిపింది. దీంతో, సర్వే కమిషన్ విధివిధానాలు, కూర్పుపై సోమవారం జరగాల్సిన విచారణను హైకోర్టు వాయిదా వేసింది. హిందూ ఆలయంపైనే మసీదును నిర్మించినట్లు ఆనవాళ్లు ఉన్నాయంటూ కొందరు వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు.. మసీదు సర్వేను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అధికారిని నియమించేందుకు అంగీకరించింది.

భర్త చేసినా అత్యాచారమే

అహ్మదాబాద్: 'అత్యాచారం ఎవరు చేసినా అత్యాచారమే. భర్త అత్యాచారానికి పాల్పడినా అది నేరమే' అని గుజరాత్ హైకోర్టు పేర్కొంది. మహిళలపై లైంగిక హింస పట్ల నిశ్శబ్దాన్ని ఛేదించాల్సిన అవసరముందని న్యాయమూర్తి జస్టిస్ దివ్యేశ్ జోషి అన్నారు. ఓ మహిళ బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇటీవల ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కోడలి పట్ల క్రూరత్వం, నేరపూరిత ప్రవర్తన కారణంగా పిటిషనర్‌కు బెయిలిచ్చేందుకు నిరాకరించారు. భర్త, కొడుకు కలిసి కోడలిపై అత్యాచారం చేస్తూ వాటిని వీడియోలు తీసి పోర్నోగ్రఫీ సైట్లలో పెట్టి డబ్బు సంపాదిస్తున్నారని తెలిసినా ఆమె మిన్నకుండిపోవడంపై జడ్జి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బానిస మనస్తత్వం నుంచి విముక్తి

ఎర్రకోట పైనుంచి విముక్తిని ప్రకటించుకుంది | ఘనమైన సాంస్కృతిక వారసత్వం పట్ల భారత్ గర్విస్తోంది

- శరవేగంగా రామ్ సర్క్యూట్ అభివృద్ధి పనులు: మోదీ
- వారణాసిలో స్వర్‌వేద్ మహామందిర్ ప్రారంభం

వారణాసి: బానిస మనస్తత్వం నుంచి భారత్ విముక్తిని ప్రకటించుకుందని, ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని గర్వకారణంగా భావిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బానిసత్వంలో మగ్గుతున్న సమయంలో కుట్రదారులు మన దేశాన్ని బలహీనపర్చేందుకు ప్రయత్నించారని, మన సాంస్కృతిక చిహ్నాలను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. ఈ చిహ్నాలను పునర్నిర్మించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం స్వర్‌వేద్ మహామందిర్‌ను ప్రధాని మోదీ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత సోమనాథ్ ఆలయ పునర్‌నిర్మాణాన్ని కొందరు వ్యతిరేకించారని చెప్పారు. ఇలాంటి ఆలోచనా విధానం కొన్ని దశాబ్దాల పాటు కొనసాగిందన్నారు. దీనివల్ల దేశం ఆత్మన్యూనత భావంలోకి జారిపోయిందని, సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం పట్ల గర్వించడం కూడా మర్చిపోయిందని వ్యాఖ్యానించారు. స్వాతంత్య్రం వచ్చాక ఏడు దశాబ్దాల తర్వాత కాలచక్రం మరోసారి తిరగబడిందని, బానిస మనస్తత్వం నుంచి విముక్తిని ఎర్రకోటపై నుంచి భారత్ ప్రకటించుకుందని స్పష్టం చేశారు. సోమనాథ్ నుంచి ప్రారంభించిన కార్యాచరణ ఇప్పుడొక ఉద్యమంగా మారిందని తెలిపారు. కాశీ విశ్వనాథ్ కారిడార్, కేదార్‌నాథ్, మహాకాళ్ మహాలోక్ క్షేత్రాల అభివృద్ధే అందుకు నిదర్శనమని వివరించారు. బుద్ధా సర్క్యూట్‌ను గొప్పగా అభివృద్ధి చేశామని, బుద్ధుడు ధ్యానం చేసుకున్న క్షేత్రాలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రామ్ సర్క్యూట్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మరికొన్ని వారాల్లో అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు.



స్వర్‌వేద్ మహామందిర్ లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న మోదీ, యోగి

'వికసిత్'లో పాల్గొనండి...

మౌలిక సదుపాయాల లేమి మన ఆధ్యాత్మిక యాత్రకు పెద్ద అవరోధంగా మారుతోందని, ఆ పరిస్థితిని మార్చేస్తున్నామని మోదీ వివరించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆధ్యాత్మిక గురువులు, మత పెద్దలు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏడంతస్తుల స్వర్‌వేద్ మహామందిర్ కేంద్రంలో ఏకకాలంలో 20,000 మంది ధ్యానం చేసుకోవచ్చు. స్వరవేద శ్లోకాలను ఇక్కడి గోడలపై అందంగా చెక్కారు.

నాలుగు కులాల సాధికారతే లక్ష్యం

యువత, పేదలు, రైతులు, మహిళలనే నాలుగు కులాలు సంపూర్ణ సాధికారత సాధించాలన్నదే తన లక్ష్యమని మోదీ అన్నారు. సోమవారం వారణాసిలో ఆయన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం రూ.19,000 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు.

దేశ ప్రజలకు మోదీ 9 వినతులు

1. ప్రతి నీటి బొట్టును ఆదా చేయండి. జల సంరక్షణ విషయంలో ప్రజలను చైతన్యవంతులుగా మార్చండి
2. గ్రామాలకు వెళ్లండి. డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో అవగాహన పెంచండి.
3. పరిశుభ్రతలో మీ ప్రాంతాన్ని నంబర్ వన్‌గా మార్చడానికి కృషి చేయండి.
4. స్థానికంగా తయారైన ఉత్పత్తులను ప్రోత్సహించండి.
5. ఎంత ఎక్కువ వీలైతే అంతగా సొంత ఊరును సందర్శించండి. దేశమంతటా తిరగండి. మన దేశంలోనే పెళ్లిళ్లు చేసుకోండి.
6. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా రైతులను ప్రోత్సహించండి.
7. నిత్యం తీసుకొనే ఆహారంలో తృణధాన్యాలను ఒక భాగంగా మార్చుకోండి.
8. జీవితంలో ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వండి.
9. కనీసం ఒక పేద కుటుంబానికి అండగా నిలవండి.

కోవిడ్ కేసులు పైపైకి

అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్రం సూచన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీచేసింది. కోవిడ్ కేసుల్లో పెరుగుదల, కేరళలో కరోనా కొత్త సబ్‌వేరియంట్ జేఎన్1 (బీఏ 2.86.1.1) వెలుగుచూసిన నేపథ్యంలో కేంద్రం సోమవారం ముందస్తు చర్యలకు దిగింది. '' కోవిడ్ కేసుల్లో ఉధృతి కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చర్యలు తీసుకోవాలి. పెరుగుతున్న కేసులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా ఉండాలి. భారత వాతావరణాన్ని తట్టుకుని వేరియంట్లు విజృంభించేలోపు ముందస్తు చర్యలతో సమాయత్తం అవుదాం'' అని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ రాష్ట్రాలకు లేఖ రాశారు. ఆదివారం దేశవ్యాప్తంగా ఐదుగురు కోవిడ్‌తో కన్నుమూశారు. కొత్తగా వందలాది కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

24 గంటల్లో 110 మంది దుర్మరణం

జబాలియా(గాజా స్ట్రిప్): హమాస్ మెరుపుదాడి తర్వాత నిరంతరాయంగా కొనసాగిస్తున్న భీకరదాడులను ఇజ్రాయెల్ మరింత పెంచింది. ఉత్తర గాజాలోని జబాలియా పట్టణంలో గత 24 గంటల్లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 110 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. డజన్ల మంది గాయాలపాలయ్యారు. ''శిథిలాల కింద ఇంకా చాలా మంది చిక్కుకున్నారు. నా బంధువుల పిల్లలు ముగ్గురు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. 110 మృతదేహాలను దగ్గర్లోని అల్-ఫలూజా శ్మశానవాటికకు తరలించలేని పరిస్థితి. అక్కడ ఆగకుండా బాంబుల వర్షం కురుస్తోంది. దిక్కులేక దగ్గర్లోని నిరుపయోగంగా ఉన్న పాత శ్మశానవాటికలో పూడ్చిపెట్టాం' అని గాజా ప్రాంత ఆరోగ్య విభాగ డైరెక్టర్ జనరల్ మునీర్ చెప్పారు.

వారి 'ఫేస్‌బుక్' వివరాలివ్వండి

న్యూఢిల్లీ: లోక్‌సభలో పొగబెట్టిన ఉదంతంలో అరెస్టయిన నిందితుల 'ఫేస్‌బుక్' ఖాతాల వివరాలు ఇవ్వాలని 'మెటా' సంస్థను ఢిల్లీ పోలీసులు కోరారు. నిందితులు సభ్యులుగా ఉన్న, ప్రస్తుతం మనుగడలో లేని 'భగత్ సింగ్ ఫ్యాన్ క్లబ్' ఫేస్‌బుక్ పేజీ వివరాలను అందించాలని 'మెటా'కు ఢిల్లీ పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం లేఖ రాసిందని సంబంధితవర్గాలు వెల్లడించాయి. ఈ ఫేస్‌బుక్ పేజీని నిందితులే క్రియేట్ చేసి ఘటన తర్వాత డిలీట్ చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు 'మెటా' మాతృసంస్థ. ఈ నేపథ్యంలో నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ ఛాటింగ్‌లనూ తమకు ఇవ్వాలని పోలీసులు 'మెటా'ను కోరారు.

ఆస్పత్రిలో దావూద్!

కరాచీలో మూడు రోజులుగా చికిత్స • విషప్రయోగం, మృతి అవాస్తవాలే: నిఘా వర్గాలు



మోస్ట్ వాంటెడ్ అండర్ వరల్డ్ డాన్, 1993 ముంబై పేలుళ్ల సూత్రధారి దావూద్ ఇబ్రహీం ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. దాంతో అతన్ని రెండు రోజుల క్రితం పాకిస్తాన్‌లోని కరాచీలో హుటాహుటిన ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం. ఒక ఫ్లోర్ మొత్తాన్నీ ఖాళీ చేయించి అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ చికిత్స అందిస్తున్నట్టు చెబుతున్నారు. ఆస్పత్రి వర్గాలు, కుటుంబీకులకు తప్ప మరెవరికీ ప్రవేశం లేకుండా పోలీసులు భారీ సంఖ్యలో పహారా కాస్తున్నారట. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు మీడియా సంస్థలు ఈ మేరకు వార్తా కథనాలు ప్రసారం చేశాయి. అంతేగాక 67 ఏళ్ల దావూద్‌కు విషప్రయోగం జరిగిందని, అందుకే ఉన్నపళాన ఆస్పత్రికి తరలించారని సోమవారమంతా జోరుగా పుకార్లు షికారు చేశాయి. చికిత్స పొందుతూ ఆదివారమే అతను మరణించినట్టు కూడా వార్తలొచ్చాయి! అయితే దావూద్‌పై విషప్రయోగం, అతని మృతి వార్తలు పూర్తిగా అవాస్తవమని నిఘా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలవడం మాత్రం నిజమేనని నిర్ధారణ అయినట్టు తెలుస్తోంది. దావూద్ చాలా ఏళ్లుగా కుటుంబంతో పాటుగా పాకిస్తాన్‌లోనే నివసిస్తున్నట్టు ఇప్పటికే తేలింది. అతను కరాచీలోనే ఉంటున్నట్టు పక్కా ఆధారాలున్నాయని భారత్ వెల్లడించింది కూడా. భారత్‌తో పాటు ఐరాస భద్రతా మండలి కూడా 2003లోనే దావూద్‌ను మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించడం తెలిసిందే. అతని తలపై ఏకంగా 2.5 కోట్ల డాలర్ల రివార్డు ఉంది!

రోజంతా కలకలం

దావూద్‌పై విషప్రయోగం, మృతి వార్తలు సోమవారం ఉదయం నుంచే కలకలం రేపాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఓ యూట్యూబర్ వీటిని తొలుత బయట పెట్టాడు. పలు సోషల్ మీడియా వార్తలను ఉటంకిస్తూ ఈ మేరకు కథనం ప్రసారం చేసి దుమారం రేపాడు. ఆది, సోమవారాల్లో పాకిస్తాన్ అంతటా గంటల తరబడి ఇంటర్నెట్ మూగబోవడానికి, దావూద్ మృతికి లింకుందని చెప్పుకొచ్చాడు. ''దేశంలో ఏదో పెద్ద ఉదంతమే జరిగింది. దాన్ని దాచేందుకే నెట్‌పై ఆంక్షలు విధించారు'' అంటూ ప్రముఖ పాక్ జర్నలిస్టులు ఎక్స్ పోస్టుల్లో అనుమానాలు వెలిబుచ్చడంతో మరింత అలజడి రేగింది. దావూద్ విషమ పరిస్థితుల్లో కరాచీ ఆస్పత్రిలో చేరినట్టు పాక్ జర్నలిస్టు అర్జూ కాజ్మీ ఎక్స్ పోస్టులో నిర్ధారించారు.

తొలిసారేమీ కాదు...

దావూద్‌పై విషప్రయోగం జరిగిందని, అతను మరణించాడని వార్తలు రావడం ఇది తొలిసారేమీ కాదు. ఏటా కనీసం ఒకట్రెండుసార్లు ఇలాంటి వార్తలు రావడం, అవన్నీ పుకార్లేనని తేలడం పరిపాటిగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కరాచీలోనే దావూద్: అల్లుడు

పాక్ ఖండిస్తున్నా, దావూద్ కరాచీలో ఉండటం వాస్తవమేనని అతని అల్లుడు అలీ షా పార్కర్ గత జనవరిలో ధ్రువీకరించాడు. కరాచీలోని అబ్దుల్లా గాజీ బాబా దర్గా వెనక రహీం ఫకీ సమీపంలోని డిఫెన్స్ ఏరియాలో దుర్భేద్యమైన ఇంట్లో కొన్నేళ్లుగా దావూద్ నివాసముంటున్నట్టు తెలిపాడు. దావూద్ చెల్లెలు హసీనా పార్కర్ కొడుకైన అలీ షా జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఇంకా పలు విషయాలు వెల్లడించాడు. ''దావూద్ ఓ పాక్ పఠాన్ స్త్రీని రెండో పెళ్లి చేసుకున్నాడు. దావూద్‌కు ముగ్గురు సోదరులు, నలుగురు అక్కచెల్లెళ్లు, ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లున్నారు. ఒక కూతురును పాక్ మాజీ క్రికెటర్ జావెద్ మియాందాద్ కుమారునికిచ్చి పెళ్లి చేశాడు'' అని అలీ షా తెలిపాడు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



రాజన్నకు జన జాతర

వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

8లో ▸



పూదోట మల్లన్న జాతర

కోరుట్లరూరల్: అయిలాపూర్ శివారులోని పూదోట మల్లన్న జాతర ఘనంగా జరిగింది. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు చేసి నైవేద్యం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
27.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి. తెల్లవారుజామున పొగమంచుకు అవకాశం ఉంది.

ఫోన్ల వేటలో పోలీసులు భళా!

- సెల్‌ఫోన్ల రికవరీలో ఉమ్మడి జిల్లా పోలీసుల ప్రతిభ
- సత్ఫలితాలు ఇస్తున్న సీఈఐఆర్ విధానం
- ఏప్రిల్‌లో కరీంనగర్‌లోనే ప్రారంభించిన పోలీసుశాఖ
- ఇప్పటి వరకూ పోయిన ఫోన్లలో 50శాతం వరకు గుర్తింపు



పోయిన ఫోన్‌ను అందజేస్తున్న చొప్పదండి సీఐ రవీందర్ (ఫైల్)

పోలీసులు బ్లాక్ చేసి, అప్పగించిన ఫోన్ల వివరాలు

జిల్లా	బ్లాక్ చేసినవి	గుర్తించినవి	అప్పగించినవి
రామగుండం	1,813	888	418
కరీంనగర్	1,531	654	360
జగిత్యాల	1,030	447	157
రాజన్నసిరిసిల్ల	1,075	465	383
మొత్తం	5,449	2,454	1,318

(నోట్: 20–04–2023 నుంచి 07–12–2023 వరకు)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి తిరిగి అప్పగించడంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. సీఈఐఆర్ విధానం ఉపయోగించి ఫోన్లను గుర్తిస్తున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ విద్యార్థి నుంచి వృద్ధులు, అధికారి నుంచి కూలీవరకు, ఉన్నతాధికారి నుంచి చిరుద్యోగి వరకు, వార్డు మెంబరు నుంచి ప్రధాని వరకు అందరిని కలిపే సామాజిక మాధ్యమంగా మారింది. అలాంటి సెల్‌ఫోన్ పొరపాటున పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా అందులోని డేటాతోపాటు, విలువైన సమాచారం పోతుంది. అందుకే పోలీసులు అలా పోగొట్టుకున్న ఫోన్లను వేటాడి గుర్తించేందుకు సీఈఐఆర్ విధానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సాంకేతికతను తొలిసారిగా కరీంనగర్ కమిషనరేట్‌లో ప్రయోగపూర్వకంగా ప్రారంభించారు. ప్రస్తుతం 50శాతం వరకు ప్రజలు పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించగలిగారు.

1,318 ఫోన్ల అందజేత

ఈ ఏడాది ఏప్రిల్‌లో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతపై కరీంనగర్ కమిషనరేట్‌లో పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఆ వెంటనే రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా సిబ్బందికి శిక్షణను విస్తరించారు. ఈ సాంకేతికత వినియోగంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకూ 5,449 ఫోన్లు ఉమ్మడి జిల్లాలో పోయినట్లు రిపోర్ట య్యాయి. అందులో 1,318 ఫోన్లను రికవరీ చేశారు. సెల్‌ఫోన్ల రికవరీ అత్యధికంగా 418 రామగుండం పరిధిలో ఉండగా, అత్యల్పంగా 157 జగిత్యాల పరిధిలో ఉండటం గమనార్హం.

సీఈఐఆర్ సాంకేతికత అంటే..?

డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి కనిపెట్టొచ్చు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నంబరు సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఈ తరువాత ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయదు. ఒకవేళ ఫోన్ ఆన్‌చేసినా, అందులో కొత్త సిమ్‌కార్డు వేసినా.. ఆ విషయం ఫోన్ యజమానికి ఎస్‌ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.

ఎలా పనిచేస్తుంది..?

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే డబ్లూ.డబ్లూ.డబ్లూ.సీఈఐఆర్.జీవోవీ.ఐఎన్ పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

- అందులో మొబైల్ నంబర్–1, మొబైల్ నంబరు–2, సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి.
- పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామా, అంతకుముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నంబరు, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చప్టాలను సూచించిన బాక్సుల్లో నింపాలి. వెంటనే సెల్‌ఫోన్ (పాత నెంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నంబరుకు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తరువాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. అందులోని డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగిలించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నంబరుకు మెసేజ్ వస్తుంది. ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవడం సులభతరంగా మారుతుంది.

అన్‌బ్లాక్ చేయండిలా

- మీఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక మీకే దొరికినా.. మీ పాత ఐడీని, ఫోన్‌నంబరు, ఇతర వివరాలు నింపిన తరువాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.



నేటికీ దొరకని 'బండి' ఫోన్

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో వాట్సాప్‌లో పేపర్ లీకేజీ కలకలం రేపింది. ఈ వ్యవహారంలో ఎంపీ బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో సంజయ్ ఫోన్ అదృశ్యమైంది. పోలీసులే తన ఫోన్ మాయం చేశారని సంజయ్ ఆరోపించారు. ఆయన ఫోన్‌తో తమకు సంబంధం లేదని పోలీసులు వివరణ ఇచ్చారు. ఆరోపణల పర్వం ఎలా ఉన్నా.. బండి సంజయ్ ఫోన్ నేటికీ లభించలేదు. అందులో అనేక కీలక విషయాలు ఉన్నాయని, తన ఫోన్ వెంటనే అప్పగించాలని బండి అనుచరులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా.. పోలీసుల తరఫు నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాకపోవడం గమనార్హం. ఫోన్ల రికవరీలో దేశంలోనే నంబర్‌వన్‌గా గుర్తింపు తెచ్చుకున్న తెలంగాణ పోలీసులు ఎంపీ సెల్‌ఫోన్ విషయంలో ఎలాంటి పురోగతి సాధించకపోవడంపై ఆయన అనచరులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఐఎంఈఐ నంబరు తెలియకపోతే?

- పోగొట్టుకున్న ఫోన్ ఐఎంఈఐ నంబరు తెలియకపోయినా/ గుర్తులేకపోయినా మీ మొబైల్ నుంచి స్టార్ హాష్ జీరో సిక్స్ హాష్ డయల్ చేయగానే మీ మొబైల్ నంబరుపై దాని ఐఎంఈఐ నంబరు ప్రత్యక్షమవుతుంది.
- ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే.. ఫోన్ కొన్న బాక్స్ మీద లేదా కొనుగోలు చేసిన షాప్‌లో ఉన్న ఇన్వాయిస్ (బిల్) ద్వారా ఐఎంఈఐ నంబరు సాధించవచ్చు.

బ్లాక్‌చేయండిలా..

- ఒకవేళ మీరు సెకండ్ హ్యాండ్ లేదా ఓఎల్‌ఎక్స్ తదితర వెబ్‌సైట్స్ లేదా తెలిసిన వారి వద్ద ఫోన్ కొనుక్కోవాల్సి వచ్చినపుడు అది దొంగిలించిందా..? లేదా బ్లాక్‌లిస్టులో ఉందా? అన్న విషయం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు.
- ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలోనూ ఐఎంఈఐ నంబరును తెలుసుకోవచ్చు. ఇందుకోసం కేవీఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి. అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నంబరును టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి.
- ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్/ ఐఓఎస్ మొబైళ్ల ప్లేస్టోర్లలో అందుబాటులో ఉంది. లేదా సీఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా సెల్‌ఫోన్ తనిఖీ చేసుకోవచ్చు.

న్యూస్‌రీల్

డీఈవో ఆకస్మిక తనిఖీ



కరీంనగర్: కరీంనగర్ అర్బన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)ను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ 2, ఎస్ఏ–1 పరీక్షల మార్కుల రిజిష్టర్‌ను, వాటిలో విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. సీడీఈ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థుల వివరాలు, మార్పుపై ప్రతీ తరగతి టీచర్ సమగ్ర సమాచారాన్ని యాక్షన్ ప్లాన్‌తో సహా క్లాస్ టీచర్ ద్వారా ప్రధానోపాధ్యాయులు వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుల రివ్యూ మీటింగ్ రిజిష్టర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేట్ అశోక్‌రెడ్డి, తెలుగు పండితులు గాజుల రవీందర్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.6,650



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. సోమవారం మార్కెట్‌కు 121 వాహనాల్లో 1,218 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,100 పలికింది. గన్నీ సంచుల్లో ఎనిమిది మంది రైతులు 16 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,200, మోడల్ ధర రూ.5,900, కనిష్ట ధర రూ.5,500కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ సంస్థ 62మంది రైతుల నుంచి 977.95 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6.995, కనిష్ట ధర రూ.6,739 పలికింది. మార్కెట్ కార్యదర్శి గగులోతు రెడ్డినాయక్ క్రయ విక్రయాలను పర్యవేక్షించారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు



కరీంనగర్ కల్చరల్: మార్గశిర శుద్ధషష్ఠి సుబ్రహ్మణ్య షష్ఠి పూజలను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాలసర్ప, వివాహవిలంబ, కుజ, రాహు, కేతు దశల దోషాల నివారణ, దాంపత్య జీవనం, సంతానం కోసం ఆయా ఆలయాల్లో జరిగిన అభిషేక అర్చనల్లో భక్తులు పాల్గొన్నారు. పాత బజార్ గౌరీశంకర, కమాన్‌రోడ్ రామేశ్వర, భగత్‌నగర్ అంజనాద్రి, అ య్యప్ప, చైతన్యపురి మహాశక్తి, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు ఆలయాలతో పాటు సుబ్రహ్మణ్యస్వామి, అనంత నాగేంద్రస్వామి విగ్రహాలున్న ఆలయాలలో భక్తుల సందడి నెలకొంది.

మంత్రిని కలిసిన టీఎన్‌జీవోలు



కరీంనగర్: రాష్ట్ర పరిశ్రమలు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును జిల్లా టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మేందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, మల్క రాజేశ్వరరావు, కోట రామస్వామి పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు

విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 21 గురువారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి కే.దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాతోపాటు ఇతర జిల్లాలో అపోలో హెల్త్ కేర్, ఫార్మసీలో పనిచేయుటకు తగిన విద్యార్హతలు ఉన్న 18 నుంచి 30సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు సంబంధిత సర్టిఫికెట్లతో కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి 206 ఫిర్యాదులు
- సమస్యల పరిష్కారం కోసం బారులు తీరిన ప్రజలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ పమేలా సత్పతి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

శాఖల వారీగా ఫిర్యాదులు

కరీంనగర్ కార్పొరేషన్	34
కొత్తపల్లి తహసీల్దార్	16
కరీంనగర్ ఆర్డీవో	11
గంగాధర తహసీల్దార్	09
మిగిలిన శాఖలకు	136

కరీంనగర్: మొర ఆలకించండి. సమస్యలు పరిష్కరించండి. ఎక్కడ చెప్పుకున్నా జవాబు దొరకడం లేదంటూ జిల్లావ్యాప్తంగా ఉన్న 16మండలాల నుంచి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో వివిధశాఖల అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 206 ఫిర్యాదులు రాగా.. ఇందులో ఎక్కువగా భూ సంబంధిత వివాదాలవే కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్ నగర పాలక కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చి ఆదుకోండి



ఎల్ఎండీలో ముంపునకు గురైన గ్రామాలవాసులం. 98 జీవో ప్రకారం మాకు ఎస్సారెస్పీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉత్తర్వులు అమలు చేయాలి. ఇంటికో ఉద్యోగం, ఇల్లు కట్టిస్తామన్న ప్రభుత్వ హామీని నిలుపుకోవాలి. మా ఆస్తులు, నివేశన స్థలాలు కోల్పోయిన సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని, ఎస్సారెస్పీలో ఉద్యోగవకాశాలు కల్పించి ఆదుకోవాలి.

– ముంపు గ్రామాల సంక్షేమ సంఘం

ప్రభుత్వ భూములు కాపాడండి



రేకుర్తిలో సమ్మక్క–సారలమ్మ గుట్ట వద్ద ప్రభుత్వ భూమి సర్వే నంబరు 55,137లో అక్రమ నిర్మాణాలను ఆపివేయాలి. నద్దినాల భూమిని స్వాధీనం చేసుకోవాలి. గ్రామపంచాయతీ దొంగ పర్మిషన్లతో నిర్మించిన ఇళ్లను తొలగించాలి. రేకుర్తి భూములపై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అందుకే కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన చేపడుతున్నా.

– దుర్గం మనోహర్, రేకుర్తి

పెన్షన్ ఇప్పించండి



మాది రామడుగు మండలం రామచంద్రాపూర్. ఒకకాలు పూర్తిగా తొలగించారు. వికలాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఐదేళ్లుగా అధికారులు పట్టించుకోవడం లేదు. పెన్షన్ ఇప్పించి ఆదుకోండి.

– కొడిమ్యాల మల్లేశం, రామచంద్రాపూర్

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



జిల్లావ్యాప్తంగా బీడీ, గ్రానైట్, మున్సిపల్, పంచాయతీ, ప్రైవేట్ సంస్థలు, ఆస్పత్రుల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. వారి కోసం జిల్లా కేంద్రంలో 500 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి. వేలమంది కార్మికులు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ బీమా కడుతున్నారు. వీరికోసం ఆస్పత్రి లేకపోవడంతో కుటుంబసభ్యులకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదు.

– డాక్టర్ పెంచాల శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్

బల్దియాపై దృష్టి పెట్టాలి



కరీంనగర్ నగరపాలక సంస్థలో క్షేత్రస్థాయిలో అధికారులు ట్యాక్సీ రిజిస్ట్రేషన్ ప్లేట్ అద్దె వాహనాలు తీసుకున్నట్లు రికార్డుల్లో చూపుతూ, సొంత వాహనాలు బినామీ పేర్లమీద నడుపుతున్నారు. ఈ విషయమై పలు దఫాలుగా పైఅధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఇంజినీరింగ్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారి, కమిషనర్ వైట్‌ప్లేట్ రిజిస్ట్రేషన్ వాహనాలను నిబంధనలను ఉల్లంఘిస్తూ వాడుతున్నారు. కలెక్టర్ బల్దియాపై దృష్టిసారించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలి.

– అన్నమల్ల సురేశ్, సామాజిక కార్యకర్త

ఎంఈవో, ఎస్సీ డీడీపై చర్యలు తీసుకోండి



జమ్మికుంటలోని విద్యోదయ హైస్కూల్ యాజమాన్యం విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తుందని ఫిర్యాదు చేసిన జమ్మికుంట ఎంఈవో, సోషల్ వెల్ఫేర్ డీడీ పట్టించుకోవడం లేదు. విద్యోదయ పాఠశాలలో నాసిరకం ఆహారం అందిస్తున్నారు. నీళ్లచారు పోస్తున్నారు. మరుగుదొడ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇలాంటి సమస్యలపై గతంలో ఎంఈవోకు, డీడీకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు.

– విద్యార్థి సంఘాల సమాఖ్య నాయకులు

మా ఓట్లను బొమ్మకల్‌కు మార్చండి



మాది బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమన్ కాలనీ. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మా ఓట్లను జ్యోతినగర్‌లో ఉన్న 157,158 బూత్‌కు మార్చారు. త్వరలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మా ఓట్లను బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వాజిద్ అలీఖాన్, రజ్వీచమన్

చావే శరణ్యం



సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాక నగరంలోని భగత్‌నగర్‌లో ఇంటిస్థలం కొనుగోలు చేశాం. ఇల్లు నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకున్నాం. కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు ఆ స్థలం మాదేనంటూ కబ్జా చేశారు. రెండేళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తూ పోలీసు అధికారులకు, ప్రజాప్రతినిధులకు గోడు వెల్లబోసుకున్నా న్యాయం జరగడం లేదు. ఇక మాకు చావే శరణ్యం.

– రాజిరెడ్డి దంపతులు, భగత్‌నగర్, కరీంనగర్

కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జీలుగా పొన్నం, దుద్దిళ్ల

- నిజామాబాద్ లోక్‌సభకు జీవన్‌రెడ్డి
- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా నియామకం



పొన్నం ప్రభాకర్ | దుద్దిళ్ల శ్రీధర్‌బాబు | తాటిపర్తి జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జీలుగా రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నిజామాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జిగా పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిలను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది మార్చిలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా అత్యధిక ఎంపీ సీట్లను కైవసం చేసుకునే దిశగా పార్టీ అధిష్టానం కసరత్తును ప్రారంభించింది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్సాహంతోనే పార్లమెంట్‌కు జరిగే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ధీటుగా ఎదుర్కొనేందుకు సీనియర్ నేతలను రంగంలోకి దించింది. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు నాయకులు దశాబ్దాలుగా పనిచేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉండే పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డిలను నియమించడంతో లోక్‌సభ సమరానికి కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతుందని చెప్పవచ్చు.



పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 'పొన్నం'

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ సోమవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతల స్వీకారానికి రాష్ట్ర మంత్రులతో పాటు సీనియర్ కాంగ్రెస్ నేతలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల్లో సాధికారత కమిటీలు ఏర్పాటు చేయాలి



బ్యాడ్జీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

కరీంనగర్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికా సాధికారత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కస్తూరిబా విద్యార్థులు, సంక్షేమశాఖ అధికారులతో మహిళా సాధికారతపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంతో పాటు వినోదభరితమైన వాతావరణంలో విద్యతో కూడిన ఉన్నత విలువలు నేర్పాలని అన్నారు. బాలికా సాధికారత కమిటీలు ఏర్పాటు చేసి బాల్యవివాహాలు, లైంగికదాడులు, లింగవివక్షత, ఆరోగ్య సమస్యలు వంటి వాటిని ధైర్యంగా ఎదుర్కొనేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం స్నేహితా బ్యాడ్జీలను విద్యార్థులు, మహిళా ఉద్యోగులకు అందజేశారు. సంక్షేమశాఖ అధికారి సరస్వతీ, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, విద్యాశాఖ అధి కారి జనార్దన్‌రావు, డీఆర్డీవో శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సఖీ సెంటర్ నిర్వాహకురాలు లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి


మృతుడు లక్ష్మీ రాజం (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లికి చెందిన రెడ్డవేణి లక్ష్మీరాజం(65) ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఆదివారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం లక్ష్మీరాజం సంకెపల్లి శివారులోని రుద్రవరం పాతరోడ్డు పక్కన ఉన్న వెంచర్‌లో వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. ఇంటి నుంచి వెళ్లిన ఆయన వెంచర్‌లోని సీసీరోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ వృద్ధుడికి అంతిమ సంస్కారాలు

జగిత్యాలజోన్: జిల్లాకేంద్రంలోని ఓ అనాథ వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధుడు గంగారాం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి సోమవారం ఆశ్రమ నిర్వాహకులు అంత్యక్రియలు నిర్వహించారు. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన గంగారాం మూడేళ్లక్రితం వృద్ధాశ్రమంలో చేరాడు. గంగారం పదిభాషల్లో మాట్లాడేవారని ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్, ఎల్లిమెల్ల సత్తయ్య, కాలగిరి బాపురెడ్డి, చంద్రమౌళి, సునీత తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పోశాలు (ఫైల్)

ముత్తారం(మంథని):సీతంపల్లికి గ్రామానికి చెందిన లింగం పోశాలు(58) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోశాలు మద్యం మత్తులో ఈనెల 16న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి కొడుకు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధూసూదన్‌రావు తెలిపారు.

రైలునుంచి పడి యువకుడు..


వినయ్‌కుమార్ (ఫైల్)

జమ్మికుంట: ప్రయాణిస్తున్న రైలు నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కేదార్పుర్ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ (18) బెంగళూరు నుంచి జబల్‌పూర్‌కు వెళ్తున్న జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. సోమవారం ఉదయం జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లితండ్రులకు రైల్వే పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడ్డ బియ్యం, నిందితుడితో పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన డొక్క శేఖర్ రేషన్ బియ్యం సేకరించి ఇంట్లో నిల్వ ఉంచాడన్నారు. పక్క సమాచారం మేరకు శేఖర్ ఇంటిపై దాడి చేసి.. 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


ఆలయ ఆవరణలో భక్తులు


ధర్మగుండంలో స్నానం చేస్తున్న భక్తులు


కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి దంపతులకు రాజన్నప్రసాదాలు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకులు శివసాయి


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాజన్నకు జనజాతర

- దర్శించుకున్న 35 వేల మంది భక్తులు

వేములవాడ: రాజన్నను సోమవారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తుల రద్దీతో కిటకిటలాడింది. చలి తీవ్రత పెరిగినప్పటికీ భక్తులు చలిలోనే వణుకుతూ ధర్మగుండంలో స్నానాలు చేశారు. రాజన్నకు కోడెమొక్కులు, తలనీలాలు సమర్పించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు, భీమన్నగుడి ఇతర అనుబంధ దేవాలయాలను సందర్శించుకున్నారు.

రాజన్నను దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి

వేములవాడ: వేములవాడ రాజన్నను కామారెడ్డి ఎమ్మెల్యే కే.వెంకట రమణారెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. దర్శనానంతరం ఆలయ పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి ప్రసాదాలు అందించారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్‌ను విద్యుత్ చౌర్యం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా న్యాయస్థానం జరిమానా విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. సీఐ వివరాల మేరకు రమేశ్ తన ఇంటికి విద్యుత్‌శాఖ అనుమతి లేకుండా కరెంట్‌ను వాడుతుండగా విద్యుత్ అధికారులు విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొదటినేరం కింద కేసు నమోదు చేసి రూ.500 జరిమానా విధించారు. మళ్లీ తన ఇంటికి విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తుండగా రెండోనేరం కింద విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి పెద్దపల్లి జిల్లా న్యాయస్థానంలో హాజరుపర్చగా, నేరం రుజువవ్వడంతో న్యాయమూర్తి డి.హేమంత్‌కుమార్ సదరు నిందితుడికి రూ.10,150 జరిమానా చెల్లించాలని లేదంటే మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆడుకుంటూనే ప్రాణాలు విడిచాడు

- అనారోగ్యంతో బాలుడి దుర్మరణం
- బతుకుదెరువు కోసం విదేశాలకు తండ్రి
- కొడుకు మరణంతో స్వగ్రామానికి


బాలుడి మృతదేహం

ధర్మపురి: ఆడుకుంటూనే ఓ బాలుడు ప్రాణాలు విడిచిన ఘటన ధర్మపురి మండలం నేరెళ్లలో విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. నేరెళ్ల గ్రామానికి చెందిన తోకల నరేశ్, నర్మద దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు నవదీప్ (8), మూడు నెలల బాబు ఉన్నాడు. కుటుంబాన్ని పోషించుకునేందుకు నరేశ్ ఆర్నెళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. నర్మద డెలివరీ అయినప్పటి నుంచి బుగ్గారం మండలం వెల్గొండలోని పుట్టింట్లో ఉంటోంది. పెద్ద కుమారుడు నవదీప్ (8) నేరెళ్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండోతరగతి చదువుతున్నాడు. రెండు నెలలుగా వెల్గొండ నుంచే పాఠశాలకు వచ్చిపోతున్నాడు. వారంరోజులుగా నవదీప్ జ్వరంతో బాధపడుతున్నాడు. చిన్నపాటి జ్వరమని భావించిన తల్లి నర్మద ఆస్పత్రికి తీసుకెళ్లి మందులు తెచ్చి వేస్తోంది. కొద్దిరోజులుగా పాఠశాలకు వెళ్లకుండా స్నేహితులతో కలిసి ఆడుకుంటూ ఉంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం స్నేహితులతో ఆడుకుంటుండగా కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. బాలుడి శవాన్ని సోమవారం నేరెళ్లకు తీసుకొచ్చారు.

పుట్టెడు దుఃఖంతో ఇంటికి..

కొడుకు మరణవార్త తెలుసుకున్న తండ్రి నరేశ్ దుబాయ్ నుంచి సోమవారం స్వగ్రామానికి చేరాడు. కొడుకు విగతజీవిగా మారడంతో గుండెల విసేలా రోధించాడు. ప్రతిరోజూ ఫోన్లో ముద్దుముద్దుగా మాట్లాడేటోనివి.. ఇప్పుడు ఎవరితో మాట్లాడాలి బిడ్డా.. అంటూ తల్లిదండ్రులు రోధించిన తీరు స్థానికులను కలచివేసింది.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడలో దుర్గం రాజు ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ సంభవించి సామాగ్రి దగ్ధమైంది. రాజు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన కొద్ది సేపటికి ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో ఫ్రిజ్, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సంజీవ్ (ఫైల్)

గొల్లపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలో చోటుచేసుకుంది. గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన గంధం సంజీవ్ (23) పత్తి వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారం నిమిత్తం మరో నలుగురితో కలిసి వరంగల్ జిల్లా నర్సంపేట మండలం వెళ్లాడు. నర్సంపేట నుంచి వరంగల్‌కు బైక్‌పై వెళ్తుండగా లక్నెపల్లి వద్ద నర్సంపేట మండలం సర్వాపురం గ్రామానికి చెందిన మేర్గు ఎల్లాగౌడ్ వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సంజీవ్, ఎల్లాగౌడ్‌ను 108లో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా సంజీవ్ మార్గంమధ్యలో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్:భోజన్నపేట గ్రామానికిచెందిన కాల్వ సతీశ్ (35) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాకు యత్నించాడు. ఈక్రమంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై మహేందర్ తెలిపారు. తమ ఇంట్లో జరిగిన ఓ ఫంక్షన్‌లో అతిగా మద్యం తాగిన విషయమై భార్య మందలించడంతో ఈనెల 16న సతీశ్ క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు పెద్దపల్లిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

తమ్ముడిపై అన్న దాడి

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లి చెందిన సుంకరి రాజేశంపై అతడి అన్న సుంకరి ప్రభాకర్, కొడుకు వెంకటేశ్ ఆదివారం రాత్రి దాడి చేశారు. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం.. అన్నదమ్ముల మధ్య భూమి విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రాజేశం తనఇంటి ఎదుట ఉండగా.. ప్రభాకర్, అతడి కొడుకు కర్రతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నాగారంలో ఇల్లు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంథని: నాగారం గ్రామంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చింతల కొమురక్క ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కొంత నగదు, నిత్యావసర సరుకులు, వెండి, జీవిత బీమా పత్రాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలు అదుపులోకి తేవడంతో సమీపంలోని నివాసాలకు మంటల ముప్పు తప్పింది.

జాతీయస్థాయి పోటీలకు పొరండ్ల విద్యార్థి


సోహెల్‌ను అభినందిస్తున్న సిబ్బంది

జగిత్యాలరూరల్:జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన ఎండీ.సోహెల్ ఇటీవల హన్మకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడకలో ద్వితీయస్థానంలో నిలిచారు. ఈనెల 26 నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అంజన్న తెలిపారు. సోహెల్‌ను సోమవారం ప్రధానోపాధ్యాయుడు మనోహరాచారి, సర్పంచ్ పొగళ్ల సంధ్యారాణి, ఎంపీటీసీ ఆరె సౌజన్య, ఏఎంసీ చైర్మన్ దుంపల రాజిరెడ్డి అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపిక


మామిడి నందిని

మానకొండూర్ రూరల్: మానకొండూర్ మండలంలోని వేగురుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన మామిడి నందిని అండర్ -14లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 13 నుంచి 16వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో నందిని రాణించింది. ఈనెల 22 నుంచి 26వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ రగ్బీ పోటీల్లో పాల్గొననుంది. విద్యార్థిని హెచ్‌ఎం మధుసూదనాచారి, పీఈటీ పాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

పెళ్లికావడం లేదని యువకుడి ఆత్మహత్య


సజ్జనపు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

జగిత్యాలక్రైం: పెళ్లి కావడం లేదని ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లాకేంద్రంలోని కుర్మవాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన సజ్జనపు ప్రవీణ్‌కుమార్ (32) కుర్మవాడలో ఉంటున్నాడు. కొద్దిరోజులు గల్ఫ్ వెళ్లాడు. ఆయనకు ఇంకా పెళ్లికాలేదు. పైగా తరచూ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి భాగ్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

ఫకీర్‌పేట తొలిసర్పంచు మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఫకీర్‌పేట గ్రామపంచాయతీ తొలి సర్పంచు బొద్దుల రాందాసు(89) అనారోగ్యంతో మృతిచెందాడు. చామనపల్లి గ్రామపంచాయతీ నుంచి 1980 సంవత్సరంలో ఫకీర్‌పేట కొత్తగ్రామపంచాయతీగా ఏర్పాటైంది. 1981లో బొద్దుల రాందాసును గ్రామస్తులు ఏకగ్రీవ సర్పంచుగా ఎన్నుకోగా1988 వరకు పదవిలో కొనసాగారు. కరీంనగర్‌లో ఆదివారం రాత్రి 11గంటలకు వృద్ధాప్యంతోపాటు అనారోగ్య సమస్యలతో రాందాసు మృతిచెందాడు. సోమవారం ఆయన మృతదేహానికి సర్పంచు కటకం నందయ్య, ఉపసర్పంచు బొద్దుల శంకరయ్య, జూబ్లీనగర్ మాజీ సర్పంచు రుద్ర రాము, పద్మశాలీ సంఘంప్రతినిధులు బొద్దుల రాజేశం, మోర మహేందర్ తదితరులు నివాళి అర్పించారు.

జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక


విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

కరీంనగర్‌రూరల్: ఢిల్లీలో ఈనెల 25 నుంచి జరగనున్న జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సుహార్ష్ సాయి, ఎల్లా అవనిరెడ్డి ఎంపికయ్యారు. జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జీఎస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుహార్ష్ సాయి కాంస్య పతకం, ఎల్లా అవనిరెడ్డి రెండు కాంస్య పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. సోమవారం స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, కోచ్ సురేందర్‌సింగ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్ ఉన్నారు.

వైభవంగా మహాచండీయాగం


పూజలో నరేందర్‌రెడ్డి దంపతులు

రామడుగు: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి అల్ఫోర్స్ ప్రాంగణంలో మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా రెండోరోజు సోమవారం గణపతిపూజ, గురుపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి, డాక్టర్ వి.వనజారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య సాగిన మహాయాగంతో అల్ఫోర్స్ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు మహాప్రసాదం అందజేశారు. వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- అదనపు కట్నం తేవాలని హింసించిన అత్తామామ
- వివాహమైన రెండేళ్లకే నూరేళ్లు
- అనాథగా మారిన తొమ్మిదినెలల బాలుడు


మౌనిక (ఫైల్)


కొడుకుతో మౌనిక(ఫైల్)

పెద్దపల్లిరూరల్: అదనపు కట్నం తేవాలనే అత్తామామల వేధింపులు భరించలేక పెద్దపల్లి జిల్లా మన్మంతునిపేట గ్రామానికి చెందిన గోగుల మౌనిక ఉరఫ్ తీగల సాధన (25) సోమవారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివాహమైన రెండేళ్లకే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టడంతో ఆమె తొమ్మిది నెలల కుమారుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఎస్సై మల్లేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన గోగుల మౌనిక ఉరఫ్ తీగల సాధనను రెండేళ్ల క్రితం పెద్దపల్లి మండలం హన్మంతునిపేటకు చెందిన తీగల రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఆ సమయంలో రూ.7లక్షల నగదు, పల్సర్‌బైక్ కట్నంగా ఇచ్చినట్లు మౌనిక తల్లి గోగుల సమ్మక్క తెలిపారు. ఆ తర్వాత కూడా అదనంగా కట్నం తేవాలంటూ తమ కూతురును భర్త రాజ్‌కుమార్, అత్త, మామ యశోద, పోచాలు వేధించేవారని కన్నీటి పర్యంతమైంది. తరచూ కొంత మొత్తాన్ని వారికి ఇచ్చామని పేర్కొన్నారు. మళ్లీ రూ.2లక్షలు తేవాలంటూ వేధించడంతో మౌనిక ఈనెల13న పుట్టింటికి వచ్చిందన్నారు. ఇటీవలే భర్తతో మాట్లాడించి మళ్లీ అత్తింటికి పంపించామని అన్నారు. ఈక్రమంలో సోమవారం వేకువజామున మౌనిక ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు భర్త రాజ్‌కుమార్, అత్త, మామలు యశోద, పోచాలుపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మహేశ్ తెలిపారు.

'సూరమ్మ' ప్రాజెక్టుపై ఆశలు


కలిగోట శివారులో రిజర్వాయర్‌గా మారనున్న సూరమ్మ చెరువు

- నేడు కలెక్టర్‌తో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్ష
- ప్రాజెక్టు, కాలువల వివరాలతో నివేదిక సిద్ధం

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సాగునీరందించే కలిగోట సూరమ్మ ప్రాజెక్టుపై రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. తాము అధికారంలోకొస్తే ప్రాజెక్టును పూర్తిచేస్తామని కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థిగా ఆది శ్రీనివాస్ ప్రకటించారు. ఆయన ఎమ్మెల్యే అయ్యారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ప్రాజెక్టుపై రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. వారి ఆశలకు జీవం పోసేలా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జగిత్యాల జిల్లాకేంద్రంలో కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే సూరమ్మ ప్రాజెక్టుపై నివేదిక తయారు చేయాలని జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారులను ఆదేశాలు వెళ్లాయి. ఈ మేరకు మూడు మండలాల రెవెన్యూ అధికారులు సూరమ్మ ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, కుడి, ఎడమ కాలువల్లో కోల్పోయే భూమి వివరాలతో నివేదికను సోమవారమే సిద్ధం చేయడం విశేషం.


జగిత్యాల – రాజన్నసిరిసిల్ల జిల్లాల సరిహద్దులోని కథలాపూర్ మండలం కలిగోట శివారులో ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా సూరమ్మ రిజర్వాయర్ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు 2006లో ప్రణాళిక రూపొందించారు. ఎడమ, కుడికాలువల ద్వారా కథలాపూర్, మేడిపెల్లి, బీమారం, కోరుట్ల, మెట్‌పల్లి మండలాలకు చెందిన 50 వేల ఎకరాలకు నీరందించాలనేది లక్ష్యం. అయితే నిధులు కేటాయించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. తిరిగి 2018 జూన్ 22న అప్పటి భారీ నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. రూ.204 కోట్లు కేటాయించారు. సూరమ్మ చెరువును రిజర్వాయర్‌గా మార్చడానికి కలిగోట, అంబారిపేట, రుద్రంగి గ్రామాల సరిహద్దుల్లో సుమారు 650 ఎకరాలు సేకరించారు. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నింపేందుకు ప్రణాళిక రూపొందించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 47 గ్రామాల పరిధిలో 50వేల ఎకరాలకు నీరందిస్తామని అధికారులు అప్పట్లో ప్రకటించారు. ఈ కాలువల ద్వారా ఆయా గ్రామాల చెరువులను నింపుతూ.. చివరి ఆయకట్టుకు పక్కాగా నీరందించేందుకు అధికారులు ప్రణాళిక తయారుచేసినా పనులు ప్రారంభానికి నోచలేదు. దీంతో ప్రాజెక్టుపై రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎన్నికలు రావడం.. కాంగ్రెస్ మాట ఇవ్వడం.. అధికారంలోకి రావడంతో ఆశలు రేకెత్తుతున్నాయి.

మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రాజెక్టు పూర్తయితే మూడు మండలాలకు సాగునీరందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చింది. మొదటగా సూరమ్మ ప్రాజెక్టుతోపాటు కాలువ పనులు పూర్తి చేయడంపై దృష్టిసారించాలి. అప్పుడే ఈ ప్రాంత రైతులకు మేలు చేసినట్లవుతుంది. పాలకులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తే బాగుంటుంది.
– బద్దం మహేందర్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట

పూర్తవుతుందన్న నమ్మకం ఉంది



ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ సూరమ్మ ప్రాజెక్టుపై అధికారులతో చర్చించాలని నిర్ణయించడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంత సమస్యలపై ఎమ్మెల్యేకు అవగాహన ఉండటంతో సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తవుతాయని నమ్మకం ఉంది. రైతుల కల త్వరగా నెరవేరేలా ప్రభుత్వం చొరవ చూపాలి.
– అల్లూరి దేవారెడ్డి, రైతు, బొమ్మెన

క్లుప్తంగా

నేడు కొత్తపల్లి మండల సమావేశం

కొత్తపల్లి: కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ పిల్లి శ్రీలతమహేశ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరు కానున్నట్లు చెప్పారు. మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యలు చర్చించండి

విద్యానగర్(కరీంనగర్): అసెంబ్లీ సమావేశాల్లో పాలకపక్షం ప్రతిపక్షంపై, ప్రతిపక్షం పాలకపక్షంపై విమర్శలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై చర్చించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఇరు పార్టీలను కోరారు. సోమవారం కరీంనగర్‌లోని బీసీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రూ.లక్షల్లో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో ఒకరిపై ఒకరు కక్ష సాధింపు ధోరణిలో కాకుండా ప్రజల సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరిపి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి మురళి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నగరంలోని ప్లాస్టిక్ హోల్ సెల్, రిటైల్ దుకాణదారులు, హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించామని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లకు బదులుగా జూట్ బ్యాగులు, బట్ట సంచులు, పేపర్ బ్యాగులు, ఎకో ప్లేట్లు వాడుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అధికారులు, దుకాణదారులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం


ఎల్ఈడీ స్క్రీన్ చూస్తున్న గ్రామస్తులు

కరీంనగర్‌రూరల్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోమవారం ఫకీర్‌పేట గ్రామంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కటకం నందయ్య, పంచాయతీ కార్యదర్శి స్వప్న, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా విద్యార్థుల నుంచి యథేచ్ఛగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ అధ్యక్షుడు అంగడి కుమార్ సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం సమర్పించారు. కుమార్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య విద్యాసంస్థల పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని అన్నారు. విద్యాహక్కు చట్టాలు అమలు చేయకుండా తుంగలోకి తొక్కి పేద విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఓటరు జాబితా సవరణ

- రేపటి నుంచి కొత్త ఓటర్ల నమోదు
- జనవరి 5 వరకు దరఖాస్తుకు అవకాశం


చెర్లభూత్కూర్‌లో కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌వో(ఫైల్)

కరీంనగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టులో అవకాశం కల్పించింది. త్వరలో పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2024కు ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8 వరకు ఓటరు తుది జాబితా రూపొందించాలని ఉత్తర్వులో పేర్కొంది. ప్రస్తుతం కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,55,054 ఉండగా.. పురుషులు 1,77,893, మహిళలు 1,77,117 మంది ఉన్నారు.

ఇంటింటికి తిరుగుతూ..

వచ్చే ఏడాది జనవరి 1 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈనెల 20 నుంచి ఆయా గ్రామాల్లోని బీఎల్‌వోలు ఇంటింటికి తిరుగుతూ అర్హుల నుంచి జనవరి 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. కొత్తగా ఫారం–6 దరఖాస్తు చేస్తే బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తారు.

ఫిబ్రవరి 8న తుది జాబితా

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు పర్యాయాలు ఓటరు సవరణ కార్యక్రమాన్ని చేపట్టినా.. జాబితాలో తప్పులు చోటుచేసుకున్నాయి. తప్పులు లేని జాబితా తయారీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా.. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో అనుకున్న లక్ష్యం నీరుగారిపోతోంది. బీఎల్‌వోలు నామమాత్రంగా సర్వే చేపట్టడంతో పలు గ్రామాల్లోని జాబితాల్లో మృతుల పేర్లు వచ్చాయి. అయితే ప్రస్తుతం ఓటరు సవరణ జాబితాను పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం–6 నింపి దరఖాస్తు చేసుకుంటే బీఎల్‌వోలు పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తారు. ఫొటో మార్పిడి, పేర్లలో తప్పులు, పుట్టిన తేదీ వివరాలను సరిచేసుకోవడం, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశముంది. దరఖాస్తులను పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. అనంతరం 22 వరకు ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తారు. బీఎల్‌వోలు మరోసారి ఇంటింటి సర్వే నిర్వహించిన అనంతరం ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అర్హులైన యువత తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి. గ్రామాల్లో బీఎల్‌వోలు అవగాహన కల్పించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించేలా చర్యలు చేపడతాం. మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశముంది. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నవీన్, తహసీల్దార్, కరీంనగర్‌రూరల్

ఎంపీగా బండి చేసిన అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న జక్కుల నాగరాజు

కరీంనగర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏమి లేదని, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ప్రధానికి సన్నిహితుడిగా ఉంటున్న బండి ఐదేళ్లలో ప్రత్యేక నిధులు తీసుకురావడంలో ఘోరంగా వైఫల్యం చెందాడని బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు విమర్శించారు. సోమవారం బీఆర్ఎస్ యూత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయనే ఉద్దేశంతో బండి సంజయ్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ బీఆర్ఎస్‌పై, పార్టీ అగ్ర నాయకులపై ఇష్టరాజ్యంగా విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఎంతో నమ్మకంతో గెలిపిస్తే ఈ ప్రాంతానికి ఒక్క ప్రాజెక్టు, ఒక్క పరిశ్రమ తేలేదని, విభజన హామీలపై నోరు మెదపకుండా ఐదేళ్లుగా నయా పైసా అభివృద్ధి చేయని ఎంపీగా మిగిలిపోయాడని ఆరోపించారు. బండి సంజయ్ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కులాలు, మతాల కుమ్ములాటలు, యువతను రెచ్చగొట్టడం, సెంటిమెంట్‌ను రగిలించడం, స్వార్థపూరిత రాజకీయాలతోనే ఐదేళ్ల కాలం వెళ్లదీశాడన్నారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు శ్రీనాథ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, సాయికృష్ణ, అనిల్, ఓంకార్, ప్రభాకర్, అజయ్, శ్రీను, వంశీ, బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేసినవారిపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న పిల్లి వెంకటయ్య

విద్యానగర్(కరీంనగర్): చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పిల్లి వెంకటయ్య, సరవ్వ దంపతులు తమను ముదిరాజ్ కులం నుంచి గ్రామానికి చెందిన కుల పెద్దలు బహ్కిరించారని, వారిపై తగిన చర్య తీసుకోవాలని జిల్లా పోలీస్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. సోమవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల పెద్దలు గ్రామంలోని ఊర చెరువులో చేపలు పట్టనివ్వడం లేదని, కారణం ఏమిటనడిగితే తమను కులం నుంచి బహిష్కరించారని వాపోయారు.

ఆధ్యాత్మికం

భగవద్గీత పఠన పోటీలు


విద్యార్థులను అభినందిస్తున్న సునీతమనోహర్‌రెడ్డి

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ఆధ్వర్యంలో గీతాజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భగవద్గీతలోని మూడో అధ్యాయం శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఇ.రాంమోహన్‌రావు, మురళీమనోహర్, అబ్దుల్ కలాం, సురేంద్రస్వామి, సతీష్‌వీరన్న వ్యవహరించారు. సీనియర్ విభాగం నుంచి శ్రీచైతన్య(గంగిపల్లి పాఠశాల) ప్రథమ బహుమతి, రేష్మ(గంగిపల్లి పాఠశాల) ద్వితీయ బహుమతి, ధర్మేష్(సెయింట్ జార్జి పాఠశాల, రేకుర్తి) తృతీయ బహుమతి, జూనియర్ విభాగం నుంచి సాయిశ్రేష్ఠ(సరస్వతి శిశుమందిర్) ప్రథమ బహుమతి, దేవిశ్రీ(సరస్వతి శిశుమందిర్) ద్వితీయ బహుమతి, జి.లాస్య(బ్లూబెల్స్ పాఠశాల) తృతీయ బహుమతులు సాధించారు. సంపూర్ణ భగవద్గీత ప్రథమ బహుమతి రిషిక్(వాచస్పతి వివేకానంద పాఠశాల), ద్వితీయ బహుమతి వివేకానంద(అకాడమిక్ హైస్కూల్) పొందారు. విజేతలకు బ్లూబెల్స్ పాఠశాల ప్రిన్సిపాల్ జంగ సునీతమనోహర్‌రెడ్డి, న్యాయ నిర్ణేతలు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీరప్ప గుడి నిర్మాణానికి భూమిపూజ


హోమం చుట్టూ భక్తుల ప్రదక్షిణ

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో కమరాతి సహిత బీరయ్య గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో పెద్ది చిన్న కనకయ్య–గట్టమ్మ దంపతులతో ప్రత్యేక హోమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు వెంగల్‌దాసు శ్రీనివాస్, వార్డు సభ్యులు తోట కిరణ్‌కుమార్, వరాల శ్రీనివాస్, కురుమ సంఘం అధ్యక్షుడు భాగోతం భీమేష్, స్థానిక నాయకులు దాది సుధాకర్, ర్యాకం మోహన్, పర్శరాములు, కనకయ్య, బీరయ్య, రాయుడు, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిశ్చలమైన నమ్మకమే భక్తి


సుబ్రమణ్యస్వామికి ఫలపంచామృతాభిషేకం


ప్రవచిస్తున్న పురాణం మహేశ్వరశర్మ

విద్యానగర్(కరీంనగర్): దైవం పట్ల నిశ్చలమైన నమ్మకమే భక్తి అని దుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ అన్నారు. సుబ్రమణ్య షష్టి సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీదేవసేనా సహిత సుబ్రమణ్యస్వామివార్ల కల్యాణాన్ని ఆయన నిర్వహించారు. ఉదయం సుబ్రమణ్యస్వామివారికి ఫలపంచామృతాభిషేకం, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం జరిగిన స్వామివారి కల్యాణ ఉత్సవంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భగవంతుడే సర్వోన్నతుడని భక్తుడు భావించాలని బ్రహ్మసూత్రాల్లో స్పష్టంగా ఉందన్నారు. భక్తికి ప్రధాన సాధనం సత్సాంగత్యం అని అన్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా దండివారం పట్నం


మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని శ్రీకొచ్చగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో షష్టి వారాలు పురస్కరించుకొని మొదటి సోమవారం దండివారం పట్నం వేశారు. ఒగ్గు పూజారి సాయిల్ల శివయ్య ఆధ్వర్యంలో పెద్ద గొల్ల ఆసిరి మల్లేశం ఇంటినుంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. ఆలయ మండపంలో రంగురంగులతో పట్నం వేసి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు వెంగల్‌దాసు శ్రీనివాస్, వార్డు సభ్యులు తోట కిరణ్, వరాల శ్రీనివాస్, పద్మ, శంకరయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కాల్వ మురళి, సభ్యులు కాల్వ మల్లేశం, అశోక్, లింగన్న, కనకయ్య, సతీష్, శంకర్, శ్రీనివాస్, టి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ అడ్లూరి పూజలు


పూజలు చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రంలో దేవాలయ అర్చకుడు మంగళంపల్లి రాజేశ్వరశర్మ చాణిక్యాల ఆధ్వర్యంలో ఫల పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ఈవో కాంతారెడ్డి, పురాణం మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు చేసినట్లు ఈవో వుడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి 6.30 గంటల నుంచి శ్రీవారికి ఫలరస పంచామృతాభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. శనివారం ఉదయం 3 గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా దర్శనాలు ప్రారంభమౌతాయని తెలిపారు. శీఘ్రదర్శనం టికెట్ తీసుకున్నవారు కల్పన హోటల్ దారి క్యూలైన్ ద్వారా, ధర్మ, ఉచిత దర్శనం చేసుకునేవారు కలెక్టర్ నివాసం ముందు క్యూలైన్ నుంచి రావాలని కోరారు.

వాలీబాల్ పోటీలకు సిద్ధార్థ విద్యార్థి


అక్షిత్‌ను అభినందిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్–14 విభాగంలో మంకమ్మతోటలోని సిద్ధార్థ స్కూల్లో 8వతరగతి చదువుతున్న హన్మండ్ల అక్షిత్ ఎంపికయ్యాడు. సోమవారం విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు. ఈనెల 13 నుంచి 15 వరకు నారాయణపేట జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 22 నుంచి 25 వరకు ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నాడు.

27న యువతకు పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని 15–29 సంవత్సరాల మధ్య వయస్సున్న యువత, విద్యార్థుల కళా నైపుణ్యాలు, సాహిత్య పాటవాలను వెలికితీసి ప్రోత్సహించేందుకు, సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించేందుకు 8 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న యువజన సంఘాల నాయకులు, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మా, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఈనెల 26 లోపు వారి పేరు, వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్, అడ్రస్, ఫోన్ నెంబర్, ప్రదర్శన పేరు మొదలగు వివరాలతో జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9949850360, 9640967943, 8985275068 నెంబర్లలో సంప్రదించాలన్నారు. జిల్లాస్థాయి యువజన పోటీలను ఈనెల 27న ఉదయం 9 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా యువజన, మండల సంఘాల బాధ్యులు, క్రీడా సంఘాల బాధ్యులు, యువజన సంఘాల అవార్డు గ్రహీతలు, జాతీయ అవార్డు, రాష్ట్ర అవార్డు గ్రహీతలు ఈనెల 20న ఉదయం 11 గంటలకు డా.బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో యూత్ ఫెస్టివల్ ప్రణాళికలు, విధివిధానాలపై చర్చ సమావేశానికి హాజరవ్వాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోరా విద్యార్థిని


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్‌కల్చరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా అనుపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–14 బాలికల విభాగం కబడ్డీ పోటీల్లో కరీంనగర్ జిల్లాలోని కోరా ఉన్నత పాఠశాల విద్యార్థులు పూనమ్, సాహితి పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పూనమ్ ఎంపికైంది. సోమవారం చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి అభినందించారు. పీఈటీ దుర్గరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీ


ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డామని మండలంలోని ఆటోడ్రైవర్లు సోమవారం పట్టణంలో ఆటోలతో నిరసన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో మార్కెట్ చౌరస్తా నుంచి ఆటోలతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు తరలివచ్చి మెమోరాండం అందించారు. ఆటోడ్రైవర్లకు నెలకు రూ. 15 వేల జీవన భృతి అందించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాగయ్య, లక్ష్మణ్, రమేశ్, ప్రసాద్, వెంకటస్వామి, అజయ్, బాలు, తిరుపతి, సాగర్, రజాక్, గంగాధర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



తిమ్మాపూర్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభను మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటితో కలిగే ప్రయోజనాలను ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం చేస్తున్నారు. అర్హులు లబ్ధి పొందాలని సూచిస్తున్నారు. తిమ్మాపూర్‌లో ప్రచార రథం ద్వారా పథకాలను ప్రదర్శిస్తూ వాటి గురించి అధికారులు అవగాహన కల్పించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి అభిప్రాయాలు తెలిపారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుండ్ర నీలమ్మ, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో కిరణ్, ఎస్‌బీఐ మేనేజర్ వేణుమాధవ, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



రామడుగు: మండల కేంద్రంలోని దోబీ ఘాట్‌తో పాటుగా మడేలేశ్వర స్వామి గుడి స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని రజకులు సోమవారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని 151/సీలో అరవై ఏళ్ల మడలేశ్వరస్వామి గుడి నిర్మాణం చేసుకొని దోబీఘాట్‌లో బట్టలు ఉత్కుకోవడం జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థలం తనదేనని జేసీబీతో చదును చేసి కబ్జా చేశాడని, స్థలం అన్యాక్రాంతం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టాఫ్ నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదల

40 వేల మంది మార్కుల జాబితా వెల్లడించిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు స్టాఫ్‌నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఏడాది క్రితం నోటిఫికేషన్ ఇవ్వగా, రాత పరీక్ష పూర్తయి కొన్ని నెలలైనా ఇప్పటివరకు ఏదో ఒక కారణంతో ఫలితాలు ఆలస్యమయ్యాయి. మంగళవారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఫలితాలను ప్రకటించారు. 40 వేల మందికిపైగా పరీక్ష రాయగా వారందరి మార్కుల జాబితా విడుదల చేశారు. ప్రత్యేకంగా అర్హత మార్కులు వీటికి లేకపోవడంతో అందరి పేర్లతో జాబితాను విడుదల చేశారు. ఎవరికి వారు అభ్యర్థులు తమకు ఎన్ని మార్కులు వచ్చాయో బోర్డ్ వెబ్‌సైట్లో చూసుకోవచ్చు. అభ్యర్థులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల అనుభవానికి వెయిటేజీ మార్కులుంటే, వాటిని కలిపే జాబితా తయారు చేశారు. ఈ ఫలితాలపై అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం 5.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేస్తారు. ఈ జాబితా ఆధారంగా ఎంపిక చేసిన జోన్‌లోకి వచ్చిన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం పిలుస్తారు. ఇందులో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలెక్షన్ లిస్ట్ విడుదల చేస్తారు. అనంతరం జోన్ల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తారు. ఈ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని బోర్డు వెల్లడించింది. కాగా, తొలుత 5,204 స్టాఫ్ నర్స్ ఖాళీల భర్తీకి గత ఏడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా, మూడు రోజుల క్రితమే మరో 1,890 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుబంధ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మొత్తం 7,094 ఖాళీలను (5,204+ 1,890) భర్తీ చేస్తారు. గతేడాది డిసెంబర్ 30న స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష' ఈ ఏడాది ఆగస్ట్ 2న జరిగింది. అనంతరం ప్రొవిజనల్ కీ విడుదల చేసి దరఖాస్తుదారుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. సబ్జెక్ట్ నిపుణుల నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా 'కీ కమిటీ' తుది కీని ఖరారు చేసింది. ప్రిలిమినరీ కీకి, ఫైనల్ కీకి మధ్య ఎలాంటి తేడా లేదు. దీంతో ప్రిలిమినరీ కీని తుది కీగా పరిగణించారు.

సమస్యలు పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం డీజీపీ రవి గుప్తాను కలిసి వినతిపత్రం అందించారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులు పరిశీలించొద్దు!

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం చివరలో ప్రారంభించిన గృహలక్ష్మి పథకం కోసం సేకరించిన 15 లక్షల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని పూర్తిగా పక్కన పెట్టి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని భావిస్తోంది.

మంజూరు చేసే వేళ ముంచుకొచ్చిన ఎన్నికలు

గత ప్రభుత్వం తొలుత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. భారీ యూనిట్ కాస్ట్‌తో, దేశంలో ఎక్కడా లేనట్టుగా ఉచితంగా రెండు పడక గదులతో కూడిన ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. కానీ వాటి యూనిట్ కాస్ట్ సరిపోవటం లేదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటం, సాంకేతికంగా కొన్ని లోపాలు చూపి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం నిధులు నిలిపేయటం, కొన్ని అంతర్గత లోపాలు.. వెరసి ఆ పథకం అంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఏడాది క్రితం.. దాని స్థానంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. సొంత జాగా ఉండి ఇల్లు లేని పేదలకు రూ.3 లక్షలను అందించి వారే ఇళ్లను నిర్మించుకునేలా దీన్ని రూపొందించారు. ఇంచుమించు ఇందిరమ్మ పథకం తరహాలోనే డిజైన్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుని దరఖాస్తులు ఆహ్వానించింది. 15 లక్షల దరఖాస్తులు వచ్చి పడ్డాయి. వాటిల్లో 12 లక్షలు అర్హమైనవిగా గుర్తించారు. వాటిల్లో నుంచి 4 లక్షల దరఖాస్తులు ఎంపిక చేసే వేళ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. చివరి తేదీ రాత్రి వరకు దాదాపు2 లక్షల దరఖాస్తులకు సంబంధించి జాబితాను సిద్ధం చేశారు. వారికి నిధులు ఇచ్చేందుకు వీలుగా ఎన్నికల సంఘం నుంచి అనుమతి కూడా వచ్చింది. కానీ, అప్పటికే ప్రచారం తారస్థాయికి చేరుకోవటంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ దరఖాస్తులను రిజెక్టు చేస్తుందేమోనన్న భయంతో కొందరు దరఖాస్తుదారులు కూడా అధికారులపై ఒత్తిడి చేయకుండా ఎన్నికలయ్యే వరకు వేచిచూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించారు. వారు అనుకున్నట్టే ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం తమ దరఖాస్తులను పరిశీలిస్తుందని వారు ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ఆ దరఖాస్తులను పరిశీలించవద్దని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వం కీలక నిర్ణయం?

- గత ప్రభుత్వం చివరలో 15 లక్షల దరఖాస్తుల సేకరణ
- కానీ వాటి స్థానంలో కొత్తగా మళ్లీ దరఖాస్తులు సేకరించాలని ప్రభుత్వ నిర్ణయం
- గ్రామసభల ద్వారా జనం నుంచి దరఖాస్తులు సేకరించేలా ఏర్పాట్లు



గ్రామ సభల్లో కొత్త దరఖాస్తులు..

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించేవారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని అవలంబించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాత ప్రభుత్వం సేకరించిన దరఖాస్తులను పక్కన పెట్టి కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది. ఇటీవల హైకోర్టులో గిరిజనప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ అంశంపై ఓ కేసు విచారణకు వచ్చింది. నిబంధనల ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారా జరగాల్సి ఉంటుంది. గిరిజనులకు దక్కాల్సిన లబ్ధి గిరిజనేతరులు తన్నుకుపోతున్నారన్న ఉద్దేశంతో వారికి రక్షణగా ఈ నిబంధన ఏర్పాటు చేశారు. గృహలక్ష్మి పథకంలో దరఖాస్తుల స్వీకరణలో ఈ నిబంధనల పాటించలేదన్నదని ఫిర్యాదు. నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తుల స్వీకరణ జరిగిందన్న వాదనను ఇప్పుడు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం. సరిగ్గా ఎన్నికల వేళ దరఖాస్తుల పరిశీలన జరిగిన నేపథ్యంలో మొత్తంగా ఆ దరఖాస్తులను పక్కనపెట్టనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

పేదలకు ఆరోగ్యమస్తు

- ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంపు: ఏపీ సీఎం జగన్
- విస్తరించిన ప్రయోజనాలతో ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ

సాక్షి, అమరావతి: వైద్యం కోసం పేదలు ఏ ఒక్కరూ అప్పుల పాలు కాకూడదనే తాపత్రయంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామని, ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమని, గతంలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్ని మార్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స వ్యయం పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులంటే సిబ్బంది ఉండరనే దుస్థితిని మన ప్రభుత్వం పూర్తిగా మార్చేసిందన్నారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లాంటి వైద్య సిబ్బందిని నియమించి మానవ వనరుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం ఉంటే మన రాష్ట్రంలో కేవలం 3.96 శాతం మాత్రమే ఉందని, ఈ కొరతను కూడా అధిగమించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇక జాతీయ స్థాయిలో నర్సుల కొరత 27 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా అని తెలిపారు. జాతీయ స్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత 33 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా స్థాయికి తెచ్చామని, నూటికి నూరు శాతం పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందడానికి ఏం చేయాలి? ఎవరిని అడగాలి? ఎక్కడికి వెళ్లాలి? చికిత్స వ్యయం ఎంతవరకు వర్తిస్తుంది? తదితర సందేహాలను సంపూర్ణంగా నివృత్తి చేస్తూ సరికొత్త ఫీచర్లతో రూపొందించిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను లబ్ధిదారులకు అందజేసి విస్తృత అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు, స్మార్ట్ కార్డుల పంపిణీ, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాలను సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు.


స్మార్ట్ కార్డులను అందుకున్న లబ్ధిదారులతో సీఎం

సీబీఐ ఎస్పీ, వైఎస్ వివేకా కుమార్తె, అల్లుడిపై కేసు నమోదు

- అప్పట్లో పులివెందుల కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ చేసిన వివేకా పీఏ కృష్ణారెడ్డి
- కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో సీబీఐ అదనపు ఎస్పీ రాంసింగ్ (తరువాత ఎస్పీ అయ్యారు) నేతృత్వంలో దర్యాప్తు కొనసాగిన విషయం విదితమే. రాంసింగ్ ఏకపక్షంగా, కేవలం కేసుతో సంబంధం లేని వ్యక్తులను టార్గెట్ చేసి దర్యాప్తు చేశారని విమర్శలు ఎదుర్కొన్నారు. అందులో భాగంగా అప్పట్లో వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డిని కూడా రాంసింగ్, వైఎస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పలుమార్లు తమకు అనుకూలంగా వ్యవహరించాలని బెదిరించారు. హత్యకేసు దర్యాప్తులో భాగంగా పీఏ కృష్ణారెడ్డిని పలుమార్లు రాంసింగ్ విచారణకు పిలిపించుకుని కేసులో తాము చెప్పినట్లు వినాలని, తాము చెప్పినట్లుగా కోర్టులో మేజిస్ట్రేట్ ముందర సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇవ్వాలని, కేసుతో సంబంధం కొంతమంది వ్యక్తుల పేర్లు చెప్పాలని బెదిరించారు. దీనికి అంగీకరించని కృష్ణారెడ్డిపై ఆయన కుటుంబసభ్యుల ముందే పలుమార్లు రాంసింగ్ థర్డ్ డిగ్రీ ఉపయోగించి దారుణంగా కొట్టారు. అలాగే వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి కూడా కృష్ణారెడ్డిని తమ వద్దకు పిలిపించుకుని సీబీఐ వారు చెప్పినట్లుగా వినాలని, లేకపోతే ఈ కేసులో ఇరికిస్తారని, సీబీఐ వాళ్లు చెప్పినట్లుగా వినడం వల్లనే వాచ్‌మన్ రంగన్న, డ్రైవర్ దస్తగిరిలను కేసు నుంచి కాపాడటం జరిగిందని పలుమార్లు బెదిరించారు. దీనిపై అప్పట్లో సాక్ష్యం చెప్పడానికి అంగీకరించని పీఏ కృష్ణారెడ్డి 2021 డిసెంబర్ 28వ తేదీన పులివెందుల కోర్టుకు వెళ్లి ప్రైవేట్ కంప్లయింట్ చేశారు. దీన్ని పరిశీలించిన పులివెందుల కోర్టు రాంసింగ్, సునీత, రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు చేసి విచారించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆ ముగ్గురిపై పులివెందుల పోలీసులు ఐపీసీ సెక్షన్లు 352, 323, 330, 342, 348, 506, 194/ఏ, 166ఏ(బి), 109 కింద కేసు నమోదు చేశారు. దీనిపై సోమవారం వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ ఓబుళరెడ్డి పులివెందులలో మీడియాతో మాట్లాడుతూ పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, విచారణలో మిగిలిన విషయాలు తెలుస్తాయని చెప్పారు.



ఎరుపెక్కిన జగిత్యాల

భూమి కోసం భారీగా తరలివచ్చిన మహిళలు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం సోమవారం మహిళలతో కిక్కిరిసింది. జిల్లా కేంద్రం శివారు నర్సింగాపూర్, టీఆర్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు పట్టాలు ఇప్పిస్తామని కొంతకాలంగా సీపీఎం నాయకులు ప్రచారం చేశారు. వివిధ జిల్లాల నుంచి మహిళలను తీసుకొచ్చి భూపోరాటం పేరిట గుడిసెలు వేయించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని, జగిత్యాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆ పార్టీ నాయకులు సూచించడంతో జిల్లాతోపాటు, పొరుగుజిల్లాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చారు. చంటిపిల్లలతో తల్లులు, గర్భిణులు, వృద్ధులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దీంతో జగిత్యాల మొత్తం ఎరుపుమయంగా మారింది. వచ్చిన వారిలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల వారు కూడా ఉండటం గమనార్హం. దీనిపై మహిళలను ఆరా తీయగా, సీపీఎం నాయకుల ప్రచారం మేరకు జగిత్యాలకు వచ్చామని, దరఖాస్తు చేసుకుంటే కొందరు నాయకులు రూ.200 తీసుకున్నారని, అలాగే నర్సింగాపూర్, టీఆర్‌నగర్‌లో నివాసమున్నవారు రూ.5 వేలు చెల్లించాలని నిబంధన పెట్టారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చినట్లు తెల్సింది. అయితే ఇళ్లు ఇప్పిస్తామంటూ నేతలు మహిళలకు హామీ ఇచ్చి పంపించినట్లు తెలిసింది.

మెడికోలను బలిగొన్న అతివేగం!

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- విందు కోసం వెళ్లి వస్తూ.. అనంత లోకాలకు
- మహారాష్ట్రలోని పాండర్‌కొడ సమీపంలో ఘటన
- శోకసంద్రంగా మారిన 'రిమ్స్'


బాలసాయి (ఫైల్)


డేవిడ్ రాజ్ (ఫైల్)


కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న డేవిడ్‌రాజ్ తల్లిదండ్రులు

కైలాస్‌నగర్: అతివేగం..అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలిగొంది. వైద్యవిద్యను అభ్యసించి రోగులకు సేవలందించాల్సిన వారు ఊహించని రీతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడిని చేరారు. కుటుంబీకులకు తీరని శోకాన్ని మిగిల్చారు. ఆదివారం అర్ధరాత్రి మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పాండర్‌కొడ టోల్‌ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రిమ్స్ వైద్య విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో అరగంటలో ఆదిలాబాద్‌కు చేరుకుంటారనే సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో అనంత లోకాలకు చేరారు. సెలవు రోజు కావడంతో సాయంత్రం వరకు స్నేహితులో సరదాగా గడిపిన ఏడుగురు వైద్య విద్యార్థులు బాలసాయి (23), డేవిడ్ రాజ్ (21), యశ్వంత్, అమృత్ రాజ్, శరణ్‌దీప్, సాయి కిరణ్, చౌహాన్ కృష్ణ జిల్లాకు సరిహద్దున ఉన్న పాండర్‌కొడ దాబాకు భోజనం చేసేందుకు మూడు బైక్‌లపై వెళ్లారు. భోజనం అనంతరం తిరుగు పయనమైన వారు పాండర్‌కొడ టోల్‌ప్లాజా సమీపంలో ఆగి ఉన్న లారీని అతివేగంతో ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని అవనిగడ్డకు చెందిన బాలసాయి, హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన డేవిడ్ రాజ్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వారు నడుపుతున్న బైక్ నుజ్జునుజ్జవడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతుంది. మిగతా ఐదుగురు క్షేమంగా రిమ్స్‌కు చేరుకున్నారు. వీరంతా ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న మహారాష్ట్ర పోలీసులు మృతదేహాలను పాండర్‌కొడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా అజాగ్రత్తతో బైక్ నడపడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.


ప్రమాదంలో ధ్వంసమైన బైక్


పాండర్‌కొడ ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

పాండర్‌కొడ ఆస్పత్రికి ఎమ్మెల్యే, రిమ్స్ డైరెక్టర్..

వైద్య విద్యార్థులు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ రిమ్స్ వైద్య బృందంతో పాండర్‌కొడ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడి పోలీసులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యకళాశాల ఆవరణలో ఉంచిన మృతదేహాలను చూసి తోటి వైద్య విద్యార్థులు, వైద్యులు, మృతుల తల్లిదండ్రులు, కుటుంబీకులు రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. వారిని తలచుకుంటూ కన్నీటి పర్యంతమవడంతో రిమ్స్ ప్రాంగణం శోకసంద్రంలా మారింది. మృతదేహాలకు వైద్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబీకులకు అప్పగించారు.

ఇళ్ల స్థలాల కోసం భారీ ఆందోళన

- సీపీఎం ఆధ్వర్యంలో మహిళల ర్యాలీ
- జగిత్యాల ఆర్డీవోకు వినతిపత్రం

జగిత్యాలటౌన్: నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పేదలకు స్థలాలు ఇవ్వాలని, నిర్మాణానికి రూ.15లక్షలు కేటాయించాలని పార్టీ పిలుపు మేరకు సోమవారం పెద్ద సంఖ్యలో మహిళలు ఆధార్ కార్డులు, దరఖాస్తులతో కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. చంటిబిడ్డలతోసహా తరలిరావడంతో జగిత్యాల ఎరుపెక్కింది. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులో ఉన్న 220ఎకరాల ప్రభుత్వ స్థలంలో పేదలు డేరాలు, గుడిసెలను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారని, వంద రోజులకుపైగా ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ సీపీఎం నాయకుల పిలుపు మేరకు కలెక్టరేట్ బయట ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లాతోపాటు కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. వారంతా కలెక్టరేట్ వైపు రావడంతో గేట్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులు జిల్లెల్ల బాలకృష్ణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి పేదవాడికి 120గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు ఇచ్చేవరకూ ఆందోళన చేస్తామని తేల్చి చెప్పారు. పార్టీ నాయకురాలు ఇందూరి సులోచన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పదివేల ఎకరాల ప్రభుత్వ భూమిలో పేద ప్రజలందరికీ ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జగిత్యాల ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.


ఎరుపు రంగు వస్త్రాలతో మహిళలు


కలెక్టరేట్ గేట్ వద్ద పోలీసుల బందోబస్తు

ఉత్పత్తులను నిల్వ చేసుకొని అమ్ముకుంటే లాభాలు

- ఎన్‌ఐపీహెచ్‌ఎం డైరెక్టర్ డాక్టర్ మరియాదాస్

జమ్మికుంట: వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, పప్పు దినుసులను గోదాముల్లో నిల్వ చేసుకొని ధరలు పెరిగినప్పుడు అమ్ముకుంటే లాభాలు పొందొచ్చని ఎన్‌ఐపీహెచ్‌ఎం(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్ డాక్టర్ మరియాదాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీకేలో రైతు సంఘాలు, రైస్ మిల్లుల వ్యాపారులకు వ్యవసాయ ఉత్పత్తుల గోదాముల్లో నిల్వ చేసుకునే పద్ధతిపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గోదాముల్లో నిల్వ చేసుకునే ఉత్పత్తులపై అవసరాల కోసం బ్యాంకులో రుణాలు పొందే సదుపాయం ఉంటుందని, ప్రమాదాలు సంభవిస్తే ఉత్పత్తులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంతి, వేణుగోపాల్, టెక్నికల్ అసిస్టెంట్ అనిల్, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మరియాదాస్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


ఉపాధ్యాయులతో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తాండూర్: తాండూర్ మండలంరేచిని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -14 జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన కె.వెంకటేశ్, ఎం.హర్షిత ప్రతిభ చాటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలు ఈనెల 20నుంచి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్నాయి.

శివ్వారం అభయారణ్యంలో ట్రైనీ బీట్ ఆఫీసర్లు


శివ్వారం మొసళ్ల అభయారణ్యంలో శిక్షణ బీట్ ఆఫీసర్లు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శివ్వారం మొసళ్ల అభయారణ్యాన్ని హైదరాబాద్ దూలపల్లికి చెందిన 34వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ శిక్షణ అధికారుల బృందం సోమవారం సందర్శించారు. ప్రకృతి సిద్ధంగా గోదావరినదిలో ఏర్పడ్డ మొసళ్ల అభయారణ్యం ప్రాముఖ్యతపై స్థానిక సెక్షన్ అధికారి బాలకృష్ణ ట్రైనీ అధికారులకు వివరించారు. మొసళ్ల మడుగు ఒడ్డును సేదతీరిన మొసళ్లను చూశారు. ఎకో టూరిజంలో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన బోటింగ్, ట్రెక్కింగ్, పురాతన గుళ్లను పరిశీలించారు. గుట్టపై నిర్మించిన వాచ్‌టవర్ ద్వారా మొసళ్ల మడుగు అందాలను వీక్షించారు. కార్యక్రమంలో చెన్నూర్ డివిజనల్ ఫారెస్ట్ అధికారులు రమేశ్, శివకుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు.

సీఎం ప్రకటనతో చెరుకు రైతుల్లో ఆశలు

మల్లాపూర్: జగిత్యాల జిల్లాలోని ముత్యంపేట నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి శాసనమండలిలో ప్రకటించడంపై స్థానిక రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. మండలి సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి పైవిధంగా స్పందించిన విషయం తెల్సిందే. తెలంగాణ ఉద్యమంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ అంశం ఉత్ప్రేరకంగా పనిచేసిందని, హామీ ఇచ్చిన వారు అమలు చేయకపోవడంతో ఎన్నికల్లో చేదు అనుభవాలు చూశారని సీఎం గుర్తు చేశారు. తమ ప్రభుత్వం నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తిగిరి ప్రారంభించేందుకు కట్టుబడి ఉందని ప్రకటించారు. ఎలాంటి సమస్యలు, అడ్డంకులు రాకుండా మంత్రులు, అధికారులతో కూడిన కమిటీ వేస్తామని, నివేదిక ఆధారంగా చక్కెర కర్మాగారాలను తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.


ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ

అది ఆదివారం సాయంత్రం.
రవీంద్రభారతి ఆడిటోరియం.
అందెలరవళి మధ్య శ్లోక ఆరంగేట్రం.
కూచిపూడి సాధనలో మూడవతరం ఆమెది.
పదహారేళ్ల నాట్యసాధనకు ప్రతీక ఆ అరంగేట్రం.

మూడుతరాల నాట్యోత్సాహం


అమ్మమ్మ రాధిక, అమ్మ దీపికతో శ్లోకారెడ్డి

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మొన్నటి రోజున ఆరంగేట్రం చేసిన శ్లోకారెడ్డి కూచిపూడి నాట్యసాధనను తన ఆరవ ఏట మొదలు పెట్టింది. పదకొండవ ఏట 'బాల చైతన్య అకాడమీ అవార్డు' అందుకుంది. నాట్యమే శ్వాసగా అడుగులు వేస్తూ గడిచిన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ 'భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణంగా భావిస్తున్నట్లు' చెప్పారు. ఆరంగేట్రం సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

''నా నాట్యగురువు అమ్మే. అమ్మ దీపాంజలి నాట్యసంస్థను ప్రారంభించి నాట్యంలో శిక్షణతోపాటు నాట్య ప్రదర్శనలు ఇస్తోంది. అలా నాకు ఆ ప్రదర్శనల్లో నాట్యం చేసే అవకాశం దక్కింది. గోదాకల్యాణం, స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రారంభోత్సవం సందర్భంగా నాట్య ప్రదర్శన, జీ ట్వంటీ సదస్సు, గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్, ప్రపంచ తెలుగు మహాసభలు, రాజ్‌భవన్, ఖజురహో, హంపి, నిశగంధి, కింకిణి డాన్స్ ఫెస్టివల్స్, త్యాగబ్రహ్మ గానసభ, దుబాయ్‌లో భారత పర్యాటక రంగం ప్రదర్శన, భారత 70వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా టర్కీలోని ఇండియన్ ఎంబసీ నిర్వహించిన కార్యక్రమం, లెజెండరీ పర్సనాలిటీ మ్యాస్ట్రో పండిట్ బిర్జు మహారాజ్ డాన్స్ ఫెస్టివల్ ... ఇలా అమ్మతోపాటు, ఆమె ఆధ్వర్యంలో లెక్కలేనన్ని ప్రదర్శనల్లో నాట్యం చేయగలిగాను. అమ్మ ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రదర్శనల్లో నేను కూడా వేదికమీద ఉండడం వల్ల చాలా నేర్చుకున్నాను. శిక్షణ సమయంలో, వేదిక మీద ప్రదర్శనలిచ్చేటప్పుడు మాత్రమే గురువు. క్లాస్ నుంచి బయటకు వచ్చి ఇంట్లో అడుగుపెట్టగానే అమ్మలోని గురువు మాయమై అమ్మ బయటకు వస్తుంది. మేము ఏం తినాలి, హోమ్‌వర్క్ గురించి తెలుసుకుని మర్నాటి స్కూల్‌కి సిద్ధం చేయడంలో మునిగిపోయేది. అమ్మ బాగా గారం చేస్తుంది, కానీ నాకు నాన్న దగ్గరే ఎక్కువ చనువు.


రుద్రమదేవిగా శ్లోక

అమ్మమ్మ అడుగుజాడల్లో

మా ఇంట్లో నాట్యసాధనకు అంకితమైన మూడవ తరం నాది. మా అమ్మమ్మ రాధిక, అమ్మ దీపిక, నేను. మేము ముగ్గురమూ ఒకే వేదిక మీద కనిపించడం సంతోషకరం. రుద్రమ దేవి, భద్రకాళి అష్టకం, గోదాదేవి, కృష్ణలీలలు ప్రదర్శించాను. అమ్మమ్మ రవీంద్రభారతి ప్రారంభోత్సవ కార్యక్రమం(1961, మే, 11వ తేదీ) లో నాట్యప్రదర్శన ఇచ్చింది. ఇప్పుడు అదే వేదిక మీద నా అరంగేట్రం జరగడం నా అదృష్టం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భరతనాట్య కళాకారిణి పద్మభూషణ్ గ్రహీత అలర్మేల్‌వల్లి గారు రావడం నా పూర్వజన్మ సుకృతం. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే... నాకు సమాజం పట్ల శ్రద్ధ కలగడానికి కారణం కూడా నాట్యమే. నాట్యం గొప్ప మాధ్యమం. ఈ మాధ్యమం ద్వారా పౌరాణిక, ఇతిహాసాలతోపాటు జాతీయాంశాలు, సామాజికాంశాలను కూడా సామాన్యులకు చేరవేయగలుగుతాం. ఒక కొత్త ఇతివృత్తాన్ని రూపొందించడానికి సమాజాన్ని చదువుతాం. కాబట్టి సమాజంలో ఉండే సమస్యలు అవగతమవుతాయి. వాటి మీద నాట్య రూపకాన్ని ప్రదర్శించి అంతటితో మిన్నకుండిపోవడం స్వార్థమే అవుతుంది. కళాకారులుగా మేము సమాజానికి మా వంతుగా తిరిగి ఇవ్వాలి కూడా. మన సమాజంలో సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి ఉండి కూడా ప్రోత్సాహం కరవైన వాళ్లెంతోమంది ఉన్నారు. వాళ్లలో కొందరికైనా నేను చేయగలిగిన సహాయం చేయాలనేది నా కోరిక.

కోవిడ్ సమయంలో వైద్యరంగంలో పనిచేసే వారి పట్ల సానుకూలంగా వ్యవహరించడం మీద చేసిన నాట్యరూపకం యూట్యూబ్‌లో బాగా వైరల్ అయింది. ప్రకృతి పరిరక్షణ, ప్రపంచశాంతి కోసం నాట్య రూపకాలను రూపొందిస్తున్నాను. లలితకళల ఇతివృత్తంగా చిత్రీకరించిన మ్యూజిక్ స్కూల్ ద్విభాషా చిత్రానికి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా లండన్‌కు చెందిన ప్రముఖ కొరియోగ్రాఫర్ ఆడమ్ ముర్రేతో పనిచేయడం నా కెరీర్‌లో మరో ఆణిముత్యం అనే చెప్పాలి. ఆరంగేట్రంలో రుద్రమ పాత్రను ఎంచుకోవడానికి కారణం మహిళాసాధికారత పట్ల చైతన్యవంతం చేయడం కూడా. నా భవిష్యత్తు రూపకాలు కూడా సమాజం, ప్రకృతితోపాటు మహిళల భద్రత, మహిళాభ్యుదయం మీద ఉంటాయి'' అని వివరించారు శ్లోకా రెడ్డి.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సంగీతమూ ఇష్టమే!

నేను పుట్టింది, పెరిగింది అంతా హైదరాబాద్‌లోనే. పాఠశాల విద్య చిరక్ ఇంటర్నేషనల్ స్కూల్. సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ నుంచి గ్రాడ్యుయేషన్ తర్వాత లండన్‌లో క్వీన్ మేరీ యూనివర్సిటీ నుంచి డిజిటల్ మార్కెటింగ్‌లో మాస్టర్స్ చేశాను. మన కల్చర్ కోసం పనిచేయడం స్కూల్లోనే మొదలైంది. స్కూల్ కల్చరల్ కమిటీకి డిప్యూటీ హెడ్‌ని. డాన్స్, మ్యూజిక్ రెండూ ఇష్టమే. తమ్ముడితోపాటు ఏడేళ్లు కర్ణాటక సంగీతం కూడా సాధన చేశాను. కానీ నా స్ట్రెస్ బస్టర్ మాత్రం బుక్ రీడింగే. 'స్పందన' చిల్డ్రన్‌హోమ్‌లోని పిల్లలతో గడపడం కూడా నాకిష్టం. 'యట్-రైజ్' అనే నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ స్థాపించి కళాభిరుచి ఉన్నవారితోపాటు గ్రామాల్లో కనీస అవసరాల కోసం పోరాడుతున్న వాళ్లకు ఆసరాగా నిలుస్తున్నాను. క్లెన్లీనెస్ డ్రైవ్, మెడికల్ క్యాంపులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో నా వంతుగా కొంతమేర సహకారం అందిస్తున్నాను.

- శ్లోకారెడ్డి, కూచిపూడి నాట్యకారిణి

● ముగ్గు-ముచ్చట





కాసర సింధు
జంగారెడ్డిగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా

15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్య చుక్క



అర్రా ప్రసూన
హనుమకొండ

21 చుక్కలు
సరి చుక్క 1 వరకు



ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా చక్కటి ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సాగుబడి
మూల కార్తె: డిసెంబర్ 16 నుంచి

'వ్యవసాయ' ఉద్గారాలు 31% కాదు.. 60%!



● రసాయనిక ఎరువులే కాదు సేంద్రియ ఎరువులు కూడా భూగోళాన్ని పెద్దఎత్తున వేడెక్కిస్తున్నాయి
● రోగ కారకం కాని ఆహారం విలువను గుర్తెరిగిన వినియోగదారుల ఉద్యమం ద్వారానే పర్యావరణహితమైన వ్యవసాయం విస్తరిస్తుంది
● పద్మశ్రీ పురస్కార గ్రహీత డా॥ సుభాష్ పాలేకర్‌తో 'సాక్షి సాగుబడి' ముఖాముఖి

వాతావరణంలోకి విడుదలయ్యే మొత్తం ఉద్గారాల్లో వ్యవసాయం, ఆహార సంబంధిత ఉద్గారాల వాటా 31% అని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ప్రకటించగా.. ఇది 60% మేరకు ఉంటాయని పద్మశ్రీ పురస్కార గ్రహీత డా॥ సుభాష్ పాలేకర్ అంచనా వేస్తున్నారు. పశువుల ఎరువు/ వర్మీ కంపోస్టు/ కంపోస్టు వంటివి ఏటా ఎకరానికి 10 టన్నుల మేరకు వేస్తుండటం కూడా భూతాపం విపరీతంగా పెరగడానికి ఓ ముఖ్య కారణంగా అందరూ గుర్తించాలని స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయ, ఆహార రంగాల ఉద్గారాలు తగ్గాలంటే.. రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం కూడా మాని, రైతులందరూ సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిని అనుసరించాలన్నారాయన.

భవిష్యత్తులో పెను తుపాన్లు, కరువులను తట్టుకోవాలన్నా.. పోషక విలువలున్న ఆహారం అందరికీ అందాలన్నా ఇదొక్కటే మార్గమన్నారు. దేశవ్యాప్తంగా 70 లక్షల మంది రైతులు తాను చెప్పిన పద్ధతిలో సాగు చేస్తున్నారని, సుసంపన్న దిగుబడులిస్తున్న వారి క్షేత్రాలే ఇందుకు నిదర్శనాలన్నారు. రోగ కారకం కాని ఆహారం విలువను వినియోగదారులు గుర్తించి ఉద్యమ స్ఫూర్తితో రైతులను ప్రోత్సహిస్తేనే పర్యావరణ హితమైన వ్యవసాయం విస్తరిస్తుందని పాలేకర్ స్పష్టం చేస్తున్నారు. భారతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (ఐసిఎఆర్-మేనేజ్)లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో పాల్గొన్న డా॥ పాలేకర్‌తో 'సాక్షి సాగుబడి' ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..

■ పర్యావరణ హితమైన వ్యవసాయ పద్ధతులపై మీరు చాలా ఏళ్లుగా స్వచ్ఛందంగా దేశవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి ఏమిటి?

డా॥ పాలేకర్: శిక్షణా శిబిరాల ద్వారా దేశంలోనే కాదు విదేశాల్లో కూడా లక్షలాది మంది సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిని సోషల్ మీడియా (వెబ్ సైట్, యూట్యూబ్, వాట్సప్) ద్వారా నేర్చుకుంటున్నారు. నీతి ఆయోగ్ తోపాటు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో విస్తారంగా రసాయనిక ఎరువులతో పాటు ఎకరానికి ఏటేటా పది టన్నుల చొప్పున పశువుల ఎరువు, కంపోస్టు, వర్మీ కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులు కూడా వాడకుండా.. నేను చెప్పినట్లు అనేక నమూనాల ప్రకారం పంటలు పండిస్తున్నారు. నేను చెప్పింది చెప్పినట్లు చేసిన వారు తొలి ఏడాదిలోనే రసాయనిక వ్యవసాయానికి తగ్గకుండా దిగుబడులు పొందుతున్నారు. రసాయనాలు వాడకుండా.. నేలలో పోషకాలను రూపుమార్చి మొక్కల వేర్లకు అందించేందుకు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి బెస్ట్ మైక్రోబియల్ కల్చర్‌ను వినియోగిస్తే చాలు.

■ దేశంలో ఎంత మంది రైతులు మీ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు?

డా॥ పాలేకర్: సుమారు 70 లక్షల మంది రైతులు అనుసరిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకుంటూ, వాట్సప్ ద్వారా సందేహాలు తీర్చుకుంటున్నారు. యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో చాలా మంది ఫాలో అవుతున్నారు. నీతి ఆయోగ్ నా టెక్నాలజీతో కన్విన్స్ అయ్యింది. హైదరాబాద్‌లోని 'మేనేజ్' సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిలో ఆశ్చర్యకరమైన దిగుబడులు సాధిస్తున్న రైతుల క్షేత్రాలను నేనే స్వయంగా రైతులకు చూపిస్తున్నాను. మొన్న వికారాబాద్ జిల్లాలో విజయరామ్ సాగు చేస్తున్న ఫైవ్ లేయర్ మోడల్ క్షేత్రాన్ని వందలాది మందికి చూపించాను. ఈ నెల 24,25 తేదీల్లో అహ్మదాబాద్ దగ్గర క్షేత్ర సందర్శన ఉంది. నేను రూపాయి పారితోషికం ఆశించకుండా ఉచితంగానే కర్బన ఉద్గారాలు లేని వ్యవసాయం గురించి ప్రచారం చేస్తున్నాను.

■ పర్యావరణ సంక్షోభంపై దుబాయ్‌లో ఇటీవల ముగిసిన శిఖరాగ్రసభ 'కాప్28'లో వ్యవసాయ ఆహార వ్యవస్థల ఉద్గారాల గురించి ప్రధానంగా చర్చ జరిగింది కదా..

డా॥ పాలేకర్: అవును. చైనా, అమెరికా తర్వాత మన దేశమే ఎక్కువ ఉద్గారాలను వెలువరిస్తున్నది. కానీ, భారత ప్రభుత్వం సంతకం చేయకపోవటం ఆశ్చర్యంగా ఉంది.

■ మన దేశపు తలసరి ఉద్గారాలు తక్కువ. గతం నుంచీ ఎక్కువగా కాలుష్యానికి కారకులైన అభివృద్ధి చెందిన దేశాలు విపత్తులకు నష్టపోతున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు పరిహారం ఇవ్వాలని, ఆధునిక టెక్నాలజీ ఇవ్వాలని మన దేశం అడుగుతోంది కదా..!

డా॥ పాలేకర్: సంపన్న దేశాలు ఏమీ విదల్చటం లేదు కదా. పైగా, కుట్రపూరితంగా కాలుష్య కారక ఫ్యాక్టరీలు మనలాంటి దేశాల్లో పెట్టిస్తూ, వస్తువుల్ని ఆ దేశాలు కొనుక్కుంటున్నాయి. దీర్ఘకాలిక పంటైన బాస్మతి బియ్యం కిలో పండించడానికి 5,600 లీటర్ల నీరు ఖర్చవుతోంది. స్వల్పకాలిక వరి రకాలతో కిలో బియ్యం పండించడానికి 2,500 లీటర్ల నీరు ఖర్చవుతోంది. పైగా వరి పొలాల్లో నీటిని నిల్వగట్టటం వల్ల, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపుమందులు, శిలీంద్రనాశన రసాయనాల వల్ల పెద్ద ఎత్తున మిథేన్ వంటి అత్యంత ప్రమాదకర ఉద్గారాలు వెలువడుతున్నాయి. సంపన్న దేశాలు డబ్బులు ఇచ్చే వరకు మనం ఈ ఉద్గారాలు వెలువరించటం మానుకోకూడదా? రసాయనిక వ్యవసాయం ఒక్కటే కాదు.. సేంద్రియ ఎరువుల వల్ల కూడా పెద్ద మొత్తంలో కర్బన ఉద్గారాలు వెలువడుతూ భూగోళాన్ని వేడెక్కిస్తున్నాయి. గాలిలో ఉద్గారాలు 280 నుంచి 480 పీపీఎంకి పెరిగాయి. ఫలితం ఇప్పటికే చూశారుగా ప్రకృతి విపత్తులు ఎలా పెరిగిపోయాయో. గత ఏడాది గోధుమల దిగుబడి 30% తగ్గిపోయింది. గడచిన ఏడాది అంతా యూరప్‌లో, మన దేశంలోనే కాదు ప్రపంచం అంతా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. మనం వ్యవసాయ ఉద్గారాలు తగ్గించకుండా మీనమేషాలు లెక్కిస్తూ ఉంటే.. ముున్ముందు చాలా ప్రమాదకర పరిస్థితులు దాపురిస్తాయి. వాటి కోసం ఎదురుచూద్దామా? ఎఫ్.ఎ.ఓ. చెప్తున్నట్లు అన్ని రకాల ఉద్గారాలలో వ్యవసాయ ఆహార వ్యవస్థ వెలువరిస్తున్న ఉద్గారాలు 31% కాదు, 60%కి పైగా ఉంటాయి. నేనంటాను.. విపత్తుల నుంచి రక్షించుకోవాలంటే వెంటనే మనం ఉద్గారాలు తగ్గించేందుకు పనిని ప్రారంభించాలి. దేశంలో రసాయనిక వ్యవసాయాన్ని, సేంద్రియ వ్యవసాయాన్ని కూడా వెంటనే నిషేధించాలి. ఈ వాస్తవాన్ని ప్రభుత్వాలు, రైతులు, ముఖ్యంగా రసాయనిక అవశేషాలతో కూడిన ఆహారం తిని డయాబెటిస్, కేన్సర్, కరోనా వంటి జబ్బుల పాలవుతున్న వినియోగదారులైన ప్రజలు ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది.

■ రసాయనిక ఎరువుల తయారీలో శిలాజ ఇంధనాలు వాడుతారు కాబట్టి ప్రమాదమే. సేంద్రియ ఎరువులతో ప్రమాదం ఎలా?

డా॥ పాలేకర్: ఎకరానికి ప్రతి ఏటా 20 బండ్ల లేదా 10 టన్నుల మాగిన పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు లేదా కంపోస్టు వేస్తూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక వ్యవసాయం కన్నా కూడా ఇది అనేక రెట్లు ఎక్కువ ఖర్చుతో కూడినది. అందుకే రైతులు పట్టించుకోవటం లేదు. అంతేకాదు, రసాయనిక వ్యవసాయంలో మాదిరిగానే పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టు, కంపోస్టు, నూనెగింజల తెలగ పిండిని పొలాల్లో వెదజల్లిన తర్వాత.. అందులో నుంచి కర్బనం విడుదలై ఆక్సీకరణం చెంది కార్బన్ డయాక్సయిడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్ వంటి హరిత గృహ విష వాయువులు వెలువడి వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. మన నేలల్లో సేంద్రియ కర్బనం 0.03% మాత్రమే మిగిలి ఉండటం వల్ల ఈ సేంద్రియ ఎరువులు వాడినా నేలల్లో హ్యూమస్ (జీవన ద్రవ్యం) ఏర్పడటం లేదు. ఈ విధంగా రసాయనిక ఎరువుల వల్లనే కాకుండా టన్నుల కొద్దీ వేసే పశువుల ఎరువు వల్ల కూడా పెద్ద మొత్తంలో ఉద్గారాలు వెలువడుతున్నాయి. అందువల్లనే, వ్యవసాయ ఆహార ఉద్గారాలు ఇతరత్రా మొత్తం ఉద్గారాల్లో 60%కి పైగా ఉంటాయని నా అంచనా.

■ మీరు కూడా ఆవు పేడతో తయారు చేసిన ఘనజీవామృతం, జీవామృతం వాడమంటున్నారు కదా..?

డా॥ పాలేకర్: ఈ రెండూ సేంద్రియ ఎరువులు కాదు. నేలలో రసాయనాల వల్ల అంతరించిపోయిన సూక్ష్మజీవరాశిని పెంపొందించే మైక్రోబియల్ కల్చర్లు మాత్రమే. ఎకరానికి ఏటా మహా అయితే 400 కిలోల ఘన జీవామృతం చాలు. 'సుభాష్ పాలేకర్ కృషి పద్ధతి' ద్వారా ఒక్క గ్రాము కర్బన ఉద్గారాలు వెలువడవు. నేను చెప్పినట్లు చేస్తే మారిన మొదటి ఏడాది కూడా దిగుబడి తగ్గదు. పది శాతం నీటితోనే ఆరుతడి పద్ధతిలో మిథేన్ వెలువడకుండా వెద వరి సాగు చేయొచ్చు.

■ 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం' అనే మాటకు బదులు 'సుభాష్ పాలేకర్ కృషి' అని అంటున్నారెందుకని?

డా॥ పాలేకర్: పెట్టుబడి లేకుండా పనులు జరగవు. మనం పొలంలో పనిగట్టుకొని చేసే వ్యవసాయ పనులేవీ ప్రకృతిలో ఉండవు. అలాంటప్పుడు ప్రకృతి వ్యవసాయం అనటం సరికాదు అనిపించి పేరు మార్చాను. 'సుభాష్ పాలేకర్ కృషి' పద్ధతి అని పిలవమని చెబుతున్నాను. ఇదే విషయాన్ని నీతి ఆయోగ్, మేనేజ్ తదితర సంస్థలన్నిటికీ చెప్పాను.

■ పర్యావరణ అనుకూల సాగు పద్ధతుల వ్యాప్తి నెమ్మదిగా ఉండటానికి కారణం?

డా॥ పాలేకర్: ప్రభుత్వాలతో పాటు ప్రజలు చైతన్యవంతులై పోషకాల సాంద్రతతో, ఔషధ గుణాలతో కూడిన ఆరోగ్యదాయకమైన పంట దిగుబడులు పండించడానికి రైతులను ప్రోత్సహించాలి. డయాబెటిస్, కేన్సర్ వంటి జబ్బుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఇది అవసరమని వాళ్లు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. యూరప్, అమెరికాలో ప్రజలు ఈ విషయం గుర్తించి జాగ్రత్తపడుతున్నారు. మన ప్రజలూ గుర్తెరగాలి.

■ రైతులకు శిక్షణా శిబిరాలేమైనా పెడుతున్నారా?

డా॥ పాలేకర్: రంగారెడ్డి జిల్లాలోని రామచంద్రమిషన్ ఆవరణలో 6 వేల మంది రైతులకు 2024 ఏప్రిల్‌లో పది రోజుల శిక్షణా శిబిరం నిర్వహించబోతున్నాం. దీనికి సహకరించమని టీటీడీని కోరుతున్నాం.

(డా॥ సుభాష్ పాలేకర్: వాట్సప్– 98503 52745
palekarsubhash@yahoo.com / spk.org.in)

ఇంటర్వ్యూ: పంతంగి రాంబాబు

పనస రైతు వైభవం!



కేరళలోని కొట్టాయంకు చెందిన రైతు వి.ఎ. థామస్ 8 ఏళ్ల క్రితం రబ్బర్ సాగుకు స్వస్తి చెప్పారు. 70 ఏళ్ల వయసులో రసాయనిక వ్యవసాయం వదిలి సేంద్రియ వ్యవసాయం చేపట్టారు. ఇంత వరకే అయితే పెద్ద విశేషం లేదు. కొట్టాయం దగ్గర్లోని చక్కంపురు గ్రామంలోని తమ 5 ఎకరాల కుటుంబ క్షేత్రాన్ని 400 రకాల పనస చెట్లతో జీవవైవిధ్యానికి చెరగని చిరునామాగా మార్చారు థామస్. బడ్ గ్రాఫ్టింగ్ లేదా బడ్డింగ్ మెథడ్‌లో గ్రాఫ్టింగ్ చేస్తూ కొత్త రకాలను సృష్టిస్తున్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ పనస తొనలను రుచి చూస్తారు. నచ్చిన రకాల మొక్కల్ని వెంట తెచ్చి నాటుకుంటారు. రెండేళ్లు, ఏడాదిన్నరలోనే కాపుకొచ్చే వియత్నాం, కంబోడియాల నుంచి కూడా కొన్ని పనస రకాలను సేకరించారు. మొక్కలతో పాటు ఎండబెట్టిన పనస తొనలను అమ్ముతూ ఎకరానికి ఏటా రూ.4 లక్షల ఆదాయం పొందుతున్నారు. ఎండబెట్టిన పచ్చి పనస కాయలను కిలో రూ. వెయ్యి. ఎండబెట్టిన పనస పండ్లను కిలో రూ. 2 వేలకు అమ్ముతుండటం విశేషం!



మెయిన్ 'డ్రా'కు శ్రావ్య శివాని

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్లు శ్రావ్య శివాని, హుమేరా బహార్మస్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. షోలాపూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో శ్రావ్య శివాని 6-4, 4-6, 11-9తో సుహిత మారూరి (భారత్)పై, రెండో రౌండ్‌లో 6-0, 2-6, 11-9తో పూజా ఇంగాలె (భారత్)పై గెలిచింది. హుమేరా తొలి రౌండ్‌లో 6-0, 7-5తో బేలా తమాంకర్ (భారత్)పై, రెండో రౌండ్‌లో 6-1, 6-3తో రాచపూడి ప్రత్యూష (భారత్)పై నెగ్గింది.

పాండ్యాకు పగ్గాలు సరైన నిర్ణయమే: గావస్కర్



ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యాను నియమించడం సరైందేనని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అన్నారు. యువ నాయకత్వానికి, కొత్త ఆలోచనలకు ఇది ప్రోత్సాహకరమని అభిప్రాయపడ్డారు. 'ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించడాన్ని తప్పా ఒప్పా అనే కోణంలో చూడొద్దు. టీమ్‌కు లబ్ధి చేకూరుతుందనే ఫ్రాంచైజీ నిర్ణయం తీసుకుంది. ఆటలోనే కాదు... జట్టును నడిపించడంలోనూ రోహిత్ శర్మలో ఉత్సాహం తగ్గింది' అని గావస్కర్ వివరించారు.

సిరీస్ విజయమే లక్ష్యంగా...



- నేడు దక్షిణాఫ్రికాతో భారత్ రెండో వన్డే
- పరువు కోసం సఫారీల ప్రయత్నం
- సాయంత్రం గం.4:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో అదరగొట్టిన భారత జట్టు ఇప్పుడు అదే తరహాలో మరో గెలుపుపై కన్నేసింది. ఒక మ్యాచ్ ముందే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని పట్టుదలగా ఉంది. గత మ్యాచ్ ఘన విజయం ఇచ్చిన ఉత్సాహం టీమిండియాలో కనిపిస్తుండగా... సొంతగడ్డపై అనూహ్యంగా 116 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా తమ టీమ్ ప్రదర్శనపై కొత్త సందేహాలు రేపింది. మూడో టి20లో ఓటమి తర్వాత తొలి వన్డేలో ఆ జట్టు ఆటతీరు మరీ పేలవంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు రెండో వన్డే మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్ సిరీస్ అందుకుంటుందా లేక సఫారీ టీమ్ కోలుకొని తగిన రీతిలో బదులిస్తుందా అనేది చూడాలి.

రజత్ పటిదార్‌కు అవకాశం!

గత మ్యాచ్‌లో భారత బౌలర్లు అర్ష్‌దీప్, అవేశ్ ఖాన్ ప్రత్యర్థిని పడగొట్టగా... ఐదో బౌలర్ అవసరం కూడా రాకుండానే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. అరంగేట్ర మ్యాచ్‌లోనే సాయి సుదర్శన్ ఆకట్టుకున్నాడు. ఈ స్థితిలో తుది జట్టులో ఎలాంటి మార్పు అవసరం లేకుండానే జట్టు బరిలోకి దిగేది. అయితే టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం శ్రేయస్ అయ్యర్ ఈ మ్యాచ్‌తో పాటు తర్వాతి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. దాంతో బ్యాటింగ్ విభాగంలో ఒక ఖాళీ ఏర్పడింది. చాలా కాలంగా తొలి అవకాశం కోసం ఎదురు చూస్తున్న మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పటిదార్‌కు నేరుగా చోటు దక్కనుంది. ఈ స్థానం కోసం రింకూ సింగ్ నుంచి కూడా పోటీ ఉన్నా... టి20 సిరీస్‌లో అవకాశం దక్కించుకున్న రింకూకంటే రజత్‌కే మొదటి ప్రాధాన్యత దక్కనుంది. తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయని రాహుల్, సంజు సామ్సన్‌లు కూడా రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో మరోసారి కుల్దీప్ పదునైన బంతులను సఫారీలు ఎలా ఎదుర్కొంటారో చూడాలి.



హెన్‌డ్రిక్స్‌పై దృష్టి...

దక్షిణాఫ్రికా కూడా గత ఓటమిని మరచి కోలుకునే ప్రయత్నంలో ఉంది. అయితే ఆ జట్టు బ్యాటింగ్‌లో ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. ఎన్నో అంచనాలతో వన్డేల్లో వరుసగా అవకాశం దక్కించుకుంటున్న ఓపెనర్ హెన్‌డ్రిక్స్ పేలవంగా ఆడుతుండగా... డసెన్, మార్క్‌రమ్, మిల్లర్ కూడా ప్రభావం చూపలేకపోతున్నారు. భారత గడ్డపై వరల్డ్ కప్‌లో చెలరేగిన క్లాసెన్ సొంత మైదానంలో మాత్రం ఇంకా తన స్థాయిని ప్రదర్శించలేదు. అనుభవం లేని బర్గర్, ముల్డర్‌ల బౌలింగ్ భారత్‌కు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు. పిచ్ కారణంగా ఈ సారి కూడా ఇద్దరు స్పిన్నర్లు కేశవ్, షమ్సీ తుది జట్టులో ఉంటారు.

పిచ్, వాతావరణం

దక్షిణాఫ్రికా అత్యంత నెమ్మదైన మైదానాల్లో ఇదొకటి. సాధారణ పిచ్. భారీ స్కోర్లకు అవకాశం లేదు. గత 12 ఏళ్లలో ఇక్కడ 8 వన్డేలు జరగ్గా... ఒక్కసారి కూడా స్కోరు 300 దాటలేదు. మ్యాచ్‌కు అనుకూల వాతావరణం ఉంది. వర్షసూచన లేదు.

ఎవరికి అందలం!

నేడు దుబాయ్‌లో ఐపీఎల్ మినీ వేలం • ఖాళీలు 77, బరిలో 333 మంది • అందరి కళ్లు రచిన్‌పైనే

విశ్వవ్యాప్త క్రికెట్ అభిమానాన్ని యేటికేడు పెంచుకుంటున్న ఐపీఎల్‌లో ఆటకు ముందు వేలం పాట జరగబోతోంది. దుబాయ్‌లో నేడు నిర్వహించే మినీ వేలానికి 333 మంది ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. 10 ఫ్రాంచైజీలకు కావాల్సింది 77 మంది కాగా... ఇటీవల ప్రపంచకప్‌తో పాటు పరిమిత ఓవర్ల ఆటలో మెరిపిస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్రపై కోట్లు కురిపించేందుకు ఫ్రాంచైజీలన్నీ సై అంటున్నాయి.

దుబాయ్: వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌కు నేడు దుబాయ్‌లో ఆటగాళ్ల మినీ వేలం పాట నిర్వహిస్తున్నారు. ఈ లీగ్ చరిత్రలో తొలిసారి వేలం ప్రక్రియ విదేశీ గడ్డపై జరగనుంది. ఒక రోజు ముందు సోమవారం ఫ్రాంచైజీ యాజమాన్యాలతో మాక్ వేలం కూడా నిర్వహించారు. ఇక కోట్ల పందేరం, ఆటగాళ్లకు అందలం పలికేందుకు ఒకటోసారి, రెండోసారి అని సుత్తి బద్దలు కొట్టే ప్రక్రియే తరువాయి.

1,166 మంది నమోదు చేసుకుంటే...

ఈ మినీ వేలం కోసం ఐసీసీ సభ్య, అనుబంధ దేశాలు, దేశవాళీ ఆటగాళ్లు ఆసక్తి చూపారు. ఏకంగా 1,166 మంది ఐపీఎల్ వేలం కోసం నమోదు చేసుకుంటే... ఫ్రాంచైజీ జట్లతో సంప్రదింపుల అనంతరం లీగ్ పాలకమండలి 333 మంది ఆటగాళ్లతో తుది జాబితాను సిద్ధం చేసింది. ఇందులోనే ఇద్దరు అసోసియేట్ ప్లేయర్లు సహా 119 విదేశీ ఆటగాళ్లున్నారు. అయితే 10 ఫ్రాంచైజీలకు కావాల్సింది మాత్రం 77 మంది ఆటగాళ్లు. ఇందులో 30 ఖాళీలను విదేశీ ఆటగాళ్లతోనే భర్తీ చేసుకోవాల్సి ఉంది. అత్యధికంగా 12 ఖాళీలు కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో ఉన్నాయి. నలుగురు విదేశీ ఆటగాళ్లు సహా 12 మందిని కొనేందుకు కోల్‌కతా వద్ద రూ. 32.70 కోట్లు అందుబాటులో ఉన్నాయి.

హాట్ కేక్... రచిన్?

భారత్‌లో ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో డాషింగ్ బ్యాటర్‌గా రచిన్ రవీంద్ర అందరికంటా పడ్డాడు. ఆరంభంలో ఎదురుదాడికి దిగి న్యూజిలాండ్ విజయాలకు గట్టి పునాది వేసిన రచిన్ ఈ మినీ వేలంలో హాట్‌కేక్ కానున్నాడు. రూ.50 లక్షల కనీస ధరతో ఫ్రాంచైజీల్ని ఆకర్షిస్తున్నాడు. ఆసీస్ స్పీడ్‌స్టర్స్ స్టార్క్, కమిన్స్, బ్యాటర్ ట్రావి హెడ్, దక్షిణాఫ్రికా సంచలనం కొయెట్జీ, హసరంగ (శ్రీలంక) తదితర స్టార్ క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీ యాజమాన్యాలు ఎగబడే అవకాశాలు న్నాయి. భారత్ నుంచి శార్దుల్ ఠాకూర్, హర్షల్ పటేల్, అన్‌క్యాప్డ్ ఆల్‌రౌండర్ల సెట్ నుంచి షారుఖ్ ఖాన్‌లపై రూ.కోట్లు కురిసే అవకాశముంది. వేలం కోసం ప్లేయర్ల ప్రత్యేకతను బట్టి 19 సెట్‌లుగా విభజించారు. అంటే బ్యాటర్, ఆల్‌రౌండర్, పేసర్, స్పిన్నర్, వికెట్ కీపర్, క్యాప్డ్, అన్‌క్యాప్డ్ ఇలా సెట్‌ల వారీగా వేలం ప్రక్రియ జరుగుతుంది.

మధ్యాహ్నం గం. 1 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



హరికృష్ణ గేమ్ 'డ్రా'



చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ పెంటేల హరికృష్ణ వరుసగా మూడో 'డ్రా' నమోదు చేశాడు. లెవాన్ అరోనియన్ (అమెరికా)తో సోమవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను హరికృష్ణ 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పావెల్ ఎల్జానోవ్ (ఉక్రెయిన్)తో జరిగిన గేమ్‌ను తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 54 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. తమిళనాడు ప్లేయర్ గుకేశ్ 44 ఎత్తుల్లో అలెగ్జాండర్ ప్రెడ్కె (సెర్బియా)ను ఓడించాడు. నాలుగో రౌండ్ తర్వాత హరికృష్ణ, గుకేశ్ 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

పుణేరి పల్టన్‌కు మూడో గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ జట్టు ఖాతాలో మూడో విజయం చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 30–23 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీ జట్టుపై గెలిచింది. పుణేరి జట్టు తరఫున కెప్టెన్ అస్లామ్ ముస్తఫా 8 పాయింట్లు, మోహిత్ గోయత్ 7 పాయింట్లు స్కోరు చేశారు. ఢిల్లీ తరఫున కెప్టెన్ అషు మలిక్ 9 పాయింట్లు సాధించాడు. బెంగాల్ వారియర్స్, యూపీ యోధాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 37–37తో 'డ్రా'గా ముగిసింది. ఈ సీజన్‌లో ఇది రెండో 'డ్రా'కాగా రెండింటిలోనూ వారియర్స్ ప్రత్యర్థి జట్టుగా ఉంది. వారియర్స్‌తో మ్యాచ్‌లో చివరి ఐదు నిమిషాల వరకు యోధాస్ జట్టు 35–30తో ఆధిక్యంలో ఉంది. అయితే వారియర్స్ కీలక ఆటగాడు నితిన్ కీలకదశలో పాయింట్లు రాబట్టి స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత చివర్లో ఇరు జట్లు రెండు పాయింట్ల చొప్పున స్కోరు చేయడంతో మ్యాచ్ 'టై' అయింది. నేడు జరిగే మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది.



ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
బెంగాల్ వారియర్స్	6	3	1	2	21
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
పుణేరి పల్టన్	4	3	1	0	16
యు ముంబా	5	3	2	0	16
యూపీ యోధాస్	5	2	2	1	15
జైపూర్ పింక్ పాంథర్స్	5	2	2	1	15
హరియాణా స్టీలర్స్	4	3	1	0	15
బెంగళూరు బుల్స్	6	2	4	0	14
పట్నా పైరేట్స్	5	2	3	0	12
దబంగ్ ఢిల్లీ	4	2	2	0	11
తమిళ్ తలైవాస్	4	2	2	0	10
తెలుగు టైటాన్స్	5	0	5	0	2

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా

హైదరాబాద్‌లో ఆటా పాట


• మహేశ్ బాబు, శ్రీలీల

'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 21 నుంచి హైదరాబాద్‌లో జరగనుంది. ''గుంటూరు కారం' సినిమాలో నాలుగు పాటలు, ఓ బిట్ సాంగ్ ఉన్నాయి. వాటిలో మూడు పాటలు, బిట్ సాంగ్ పూర్తయ్యాయి. మిగిలిన ఓ పాటను ఈ నెల 21 నుంచి చిత్రీకరించేలా ప్లాన్ చేశాం'' అని సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు.

గుర్తుచేయాల్సిన సమయం వచ్చింది


• వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్

వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్ జంటగా నటించిన దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అర్జున్‌దేవ్ పాత్రలో వరుణ్ తేజ్ కనిపిస్తారు. రాడార్ ఆఫీసర్‌గా మానుషి చిల్లర్ నటించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదల కానుంది. సోమవారం 'ఫస్ట్ స్ట్రైక్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేశారు. 'శత్రువులకు ఓ విషయం గుర్తుచేయాల్సిన సమయం వచ్చింది. మన దేశం గాంధీజీతో పాటు సుభాష్ చంద్రబోస్‌ది కూడా..', 'ఏం జరిగినా సరే చూసుకుందాం' (వరుణ్ తేజ్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''దేశ వైమానిక దళ హీరోల ధైర్యసాహసాలు, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్ల నేపథ్యంలో ఈ మూవీ కథనం ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


• ప్రభాస్

ఖాన్సార్ ఎరుపెక్కాల..!

''చిన్నప్పుడు నీకో కథ చెప్పేవాడిని.. పర్షియన్ సామ్రాజ్యంలో సుల్తాన్ ఎంత పెద్ద సమస్య వచ్చినా తన బలమైన సైన్యానికి కూడా చెప్పకుండా ఒక్కడికే చెప్పేవాడు'' అనే వాయిస్ ఓవర్‌తో 'సలార్: సీజ్‌ఫైర్' సినిమా రిలీజ్ ట్రైలర్ విడుదలైంది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, టీనూ ఆనంద్, ఈశ్వరీరావు కీలక పాత్రలు పోషించారు. హోంబలే ఫిలింస్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన 'సలార్' మూవీ మొదటి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'సలార్: సీజ్‌ఫైర్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తే.. ఈ చిత్రంలో మెకానిక్ పాత్రలో ప్రభాస్ నటించినట్లు తెలుస్తోంది. 'ఖాన్సార్‌లో క్యాలిక్యులేటర్ పెట్టుకుని ఏం లెక్కపెట్టలేం', 'అందుకే లెక్కపెట్టలేని ఓ పిచ్చోడిని తీసుకువచ్చాను' (పృథ్వీరాజ్ సుకుమారన్), 'ఖాన్సార్ ఎరుపెక్కాల..', 'మండే నిప్పుతోనైనా.. వీళ్ల రక్తంతోనైనా' (ప్రభాస్), 'ఖాన్సార్ వల్ల చాలా కథలు మారాయి.. కానీ, ఖాన్సార్ కథ మార్చింది ఇద్దరు ప్రాణస్నేహితులు బద్ధ శత్రువులుగా మారడం'' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

అంతకుమించిన స్థాయి లేదు - నాని


• విజయేందర్ రెడ్డి, మోహన్ చెరుకూరి, నాని, కియారా ఖన్నా, శౌర్యువ్, హేషమ్ అబ్దుల్, ప్రియదర్శి, షాను


''చిత్ర పరిశ్రమలో బాక్సాఫీసు లెక్కలు, స్థానాలు, స్థాయి అని మాట్లాడుతుంటారు. నాకు సంబంధించి శుక్రవారం నా సినిమా విడుదలైతే.. 'నాని సినిమాకి వెళ్దాం రా' అని ప్రేక్షకులు అన్నారంటే అదే గొప్ప స్థాయి.. దానికి మించిన స్థాయి ప్రపంచంలో మరొకటి లేదని నమ్ముతాను. ఆ స్థాయి, స్థానాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను'' అని హీరో నాని అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజైంది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో నాని మాట్లాడుతూ–''మా సినిమాపై ప్రేక్షకులు ఎన్నో ప్రశంశలు కురిపిస్తున్నారు. నేను నమ్మింది నిజమైనందుకు ఆనందంగా ఉంది. 'హాయ్ నాన్న' కి ఇంత పెద్ద విజయం అందించిన తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. ఇలాంటి మంచి సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను'' అన్నారు. ''నానిగారు 'హాయ్ నాన్న' కథని నా కోసం, తెలుగు సినిమా కోసం ఎంపిక చేసుకున్నారని భావిస్తున్నాను'' అన్నారు శౌర్యువ్. ''హాయ్ నాన్న' చరిత్రలో నిలిచిపోయే చిత్రం'' అన్నారు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల. కెమెరామేన్ షాను మాట్లాడారు.

సరికొత్తగా...


• నిహారిక

నిహారిక కొణిదెల లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'వాట్ ది ఫిష్'. 'వెన్ ది క్రేజీ బికమ్స్ క్రేజియర్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంతో వరుణ్ కోరుకొండ దర్శకునిగా పరిచయమవుతున్నారు. 6 ఐఎక్స్ సినిమాస్‌పై విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఈ సినిమాలో అష్టలక్ష్మి పాత్రలో కనిపిస్తారు నిహారిక. ఆమె పాత్ర సరికొత్తగా, ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శక్తి కాంత్ కార్తీక్, సహ నిర్మాత: వరుణ్ కోరుకొండ. కాగా 2019లో వచ్చిన 'సూర్యకాంతం' చిత్రం తర్వాత మళ్లీ నిహారిక నటిస్తున్న సినిమా 'వాట్ ది ఫిష్' కావడం విశేషం.

మారుతినగర్‌లో నవ్వులు


• రావు రమేశ్

రావు రమేష్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహిస్తున్నారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ''ఈ చిత్రంలో మంచి వినోదాత్మక పాత్రలో నటించారు రావు రమేష్‌గారు. ఈ మూవీ ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు లక్ష్మణ్ కార్య. ''అజీజ్ నగర్, బీహెచ్ఈఎల్, కనకమామిడి, వనస్థలిపురం... ఇలా హైదరాబాద్ పరిసరాల్లో ఈ సినిమా షూటింగ్ చేశాం. రావు రమేష్‌గారు ఈ సినిమాలో చెప్పిన డైలాగ్స్ ప్రేక్షకులను నవ్వించడం పక్కా'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: కల్యాణ్ నాయక్.

రాజస్థాన్ ఫిలిం ఫెస్టివల్‌కి మధురపూడి..


• శివ

'మధురపూడి గ్రామం అనే నేను' సినిమా 'రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్' 2023కి ఎంపిక అయింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ వెల్లడించింది. శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా మల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. జి.రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్‌పై కేఎస్ శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 13న విడుదలైంది. ఈ మూవీ 10వ 'రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్'కి ఎంపిక అయింది. 2024 జనవరిలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ''మా మూవీ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు శివ కంఠమనేని. ''ఈ సినిమాపై మొదటి నుండి మా టీమ్ చాలా నమ్మకంగా ఉన్నాం. ఈ రోజు మా నమ్మకం నిజమైంది'' అన్నారు మల్లి.

నన్ను చూసినావే పిల్లా!


• సంపూర్ణేష్‌బాబు, ఆర్తి గుప్తా

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బంసాల్, ఆర్తి గుప్తా ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. క్యాన్స్ ఎంటర్‌టైన్మెంట్స్, మాంక్ ఫిల్మ్స్‌పై చంద్ర చగంలా నిర్మిస్తున్నారు. సునీల్ కశ్యప్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నన్ను చూసినావే పిల్లా.. నా కలలే నిజమయ్యేలా...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు మేకర్స్. ''సోదరా' నుంచి ఇప్పటికే రిలీజైన 'అన్నంటే దోస్తే సోదరా..' అనే తొలి పాటకి మంచి స్పందన వచ్చింది. 'నన్ను చూసినావే పిల్ల..' పాట ఫ్రెష్ ఫీల్‌తో మంచి లవ్ రొమాంటిక్‌గా ఉంటుంది'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జాన్.

రాచరికం ఆరంభం


• అప్సరా రాణి, విజయ్ శంకర్, రాజ్ కందుకూరి

విజయ్ శంకర్ హీరోగా, అప్సరా రాణి హీరోయిన్‌గా 'రాచరికం' సినిమా ఆరంభం అయింది. సురేష్ లంకలపల్లి దర్శకుడు. చిల్ బ్రోస్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై ఈశ్వర్ నిర్మిస్తున్న 'రాచరికం' మూవీ సోమవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాతలు డీఎస్ రావు కెమెరా స్విచ్చాన్ చేయగా, రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా, ఈశ్వర్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈశ్వర్ మాట్లాడుతూ– ''సురేష్‌తో ఆరు నెలలుగా ప్రయాణించాం. సినిమా బాగా వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''రాచరికం' చిత్రంలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది'' అన్నారు సురేష్ లంకలపల్లి. ''రాచరికం' లాంటి మంచి చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు విజయ్ శంకర్. ''రాచరికంతో అరాచకం సృష్టించబోతున్నాం'' అన్నారు అప్సరా రాణి. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చాణక్య, కెమెరా: ఆర్య సాయికృష్ణ, సంగీతం: వెంగి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 169	నిఫ్టీ ▽ 38
71,315	21,419

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,896	△ 82
డోజోన్స్	37,359	△ 54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,614	△ 38
డాక్స్	16,651	▽ 101
షాంఘై	2,931	▽ 12
నికాయ్	32,759	▽ 212

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	61,902
బంగారం (99.5 స్వచ్ఛత)	61,654
వెండి (కిలో)	73,588

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.58	83.88
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.23	106.79
€	యూరో	ఒకటి	89.59	92.09
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.23	56.10
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.12	57.23
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.45	63.44
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.72	23.51
¥	చైనా యువాన్	పదింటికి	10.52	12.59

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'మైన్ డైమండ్ ఫెస్టివల్'



హైదరాబాద్: ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'మైన్ డైమండ్ ఫెస్టివల్' ప్రకటించింది. ఉత్సవ ఆఫర్లలో భాగంగా వజ్రాల విలువపై 25% తగ్గింపు, పాత వజ్రాభరణాల మార్పిడిపై 100% విలువ పొందవచ్చు. మైన్ డైమండ్ ఫెస్టివల్ సందర్భంగా సోలిటైర్, పార్టీవేర్, క్యాజువల్, బ్రైడల్‌తో సహా భిన్న శ్రేణి వజ్రాభరణాలు అందుబాటులో ఉంచారు. స్టేట్‌మెంట్ నెక్లెస్‌లు, చెవిరింగులు, స్టడ్స్, రింగులు కూడా ఉన్నాయి. ఇప్పటికే ప్రారంభమైన ఫెస్టివల్ ఆఫర్లు దేశవ్యాప్తంగా అన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంల్లో జనవరి 14 వరకు అందుబాటులోకి ఉంది. అయితే ఎన్‌సీఆర్, పంజాబ్, హరియాణా, ఉత్తర ప్రదేశ్‌ల్లో జనవరి 5న మొదలై ఫిబ్రవరి 11 వరకు కొనసాగుతాయి.

విద్యుత్‌పై అంబుజా పెట్టుబడులు

పునరుత్పాదక ప్రాజెక్టులపై దృష్టి

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ దిగ్గజం అంబుజా సిమెంట్స్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. 2026కల్లా 1,000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు రూ. 6,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. పరివర్తన పెట్టుబడులకింద అంతర్గత వనరుల నుంచి నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. ప్రణాళికల్లో భాగంగా



సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియోకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. వీటిని వ్యూహాత్మకంగా గుజరాత్, రాజస్తాన్‌లలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. గుజరాత్‌లో 600 మెగావాట్ల సోలార్, 150 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు, రాజస్తాన్‌లో 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించింది. 2024 మార్చికల్లా 200 మెగావాట్లను అందుకోనున్నట్లు తెలియజేసింది. ప్రస్తుత 84 మెగావాట్ల సౌర, పవన విద్యుత్‌కు ఇవి అదనమని తెలియజేసింది.

ఓఎన్‌డీసీ @ 50 లక్షల లావాదేవీలు

యారీ యాప్ ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్‌లో కొనుగోలుదారులు, విక్రేతలను అనుసంధానించే ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్)లో లావాదేవీల సంఖ్య ఈ డిసెంబరు ఆఖరు కల్లా నెలకు 50 లక్షల స్థాయికి చేరనున్నాయి. వచ్చే ఏడాది మార్చి ఆఖరు నాటికి ఇవి 70 లక్షలకు చేరే అవకాశం ఉందని సంస్థ ఎండీ టి. కోషి తెలిపారు. ఈ ఏడాది తొలినాళ్లలో లావాదేవీలు కొద్ది వేల సంఖ్యలో మాత్రమే ఉండేవని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఓఎన్‌డీసీలో దాదాపు 40 యాప్‌లు ఉన్నట్లు వివరించారు. నిత్యావసరాలు, ఫ్యాషన్ మొదలైనవి ఉండగా, వాటితో పాటు కొత్తగా ఆర్థిక సేవలు, ఇతరత్రా సర్వీసులను కూడా ఓఎన్‌డీసీలో అందుబాటులోకి తెస్తున్నట్లు సోమవారమిక్కడ ఆటో, క్యాబ్ సేవల యాప్ యారీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో వాహన సేవల రంగాన్ని పునర్నిర్వచించేలా తమ యాప్ ఉంటుందని యారీ సీఈవో, సహ వ్యవస్థాపకుడు హరిప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న యాప్‌లకు భిన్నంగా సున్నా కమీషన్ ప్రాతిపదికన దీన్ని తీర్చిదిద్దినట్లు చెప్పారు. రోజుకు అయిదు ట్రిప్‌లు దాటితే డ్రైవర్లు నామమాత్రంగా రూ. 25 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఇందులో ప్రభుత్వ నిర్దేశిత రేట్ల ప్రకారం చార్జీలు ఉంటాయని, కస్టమర్లు చెల్లించే మొత్తం డబ్బు డ్రైవర్లకు వెడుతుందని హరిప్రసాద్ వివరించారు. హైదరాబాద్‌తో ప్రారంభించి వచ్చే 6 నెలల్లో 4 నగరాలకు విస్తరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 12,000 పైచిలుకు డ్రైవర్ల ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ పూర్తయిందని, 20,000 మంది డ్రైవర్లు ఇన్‌స్టాల్ చేసుకున్నారని పేర్కొన్నారు. హరిప్రసాద్, మదన్ బాలసుబ్రమణియన్, పరితోష్ వర్మ కలిసి యారీని ఏర్పాటు చేశారు.

భారత్‌కు సానుకూలంగా అంతర్జాతీయ పరిణామాలు

టాటా సన్స్ చీఫ్ ఎన్ చంద్రశేఖరన్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న మార్పులన్నీ భారత్‌కు సానుకూలంగా పరిణమిస్తున్నాయని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. తద్వారా నేడు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలో ప్రబల శక్తిగా ఎదిగేందుకు అవసరమైన సామర్థ్యాలను సంతరించుకునేందుకు భారత్‌కు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే, సమ్మిళిత వృద్ధి సాధన అనేది దేశానికి అతి పెద్ద సవాలుగా ఉంటోందని జేఆర్‌డీ టాటా స్మారకోపన్యాసంలో ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) నుంచి తప్పించుకోజాలమని, దాన్ని అందిపుచ్చుకుంటే భారత్ గణనీయంగా ప్రయోజనం పొందగలదని చంద్రశేఖరన్ వివరించారు.

1,000 వాహన తుక్కు కేంద్రాలు కావాలి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా 1,000 వాహన తుక్కు కేంద్రాలు, 400 ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్ట్ సెంటర్లు అవసరమని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 85 స్క్రాపింగ్ సెంటర్లకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు 'డిజిఈఎల్‌వీ'ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన వివరించారు. జాతీయ వాహన స్క్రాపేజీ పాలసీ అనేది అన్ని వర్గాలకు ప్రయోజనకరమని, దక్షిణాసియాలో భారత్ స్క్రాపింగ్ హబ్‌గా ఎదిగేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. వాహన స్క్రాపింగ్ కోసం వాహనదారుకు స్క్రాపింగ్ కేంద్రం (ఆర్‌వీఎస్‌ఎఫ్) జారీ చేసిన సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ (సీడీ)లను ట్రేడింగ్ చేసుకునేందుకు డిజిఈఎల్‌వీ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. గత మూడు నెలలుగా బీటా ఫేజ్‌లో ఉన్న డిజిఈఎల్‌వీ దాదాపు 800 సర్టిఫికెట్ల ట్రేడింగ్‌కు తోడ్పడింది. పాతబడిన, ఫిట్‌నెస్ కోల్పోయిన, కాలుష్యకారక వాహనాలను దశలవారీగా తప్పించేందుకు 2021 ఆగస్టులో ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ వాహన స్క్రాపేజీ పాలసీని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం పాత వాహనాలను స్క్రాపింగ్ చేసిన వారు కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే రోడ్ ట్యాక్స్‌లో పాతిక శాతం వరకు రిబేటు పొందవచ్చు. ఈ పాలసీ 2022 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

రికార్డు ర్యాలీకి బ్రేక్

లాభాల స్వీకరణ

- స్వల్ప నష్టాల ముగింపు
- బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్ల పతనంతో సెన్సెక్స్ 169 పాయింట్లు నష్టపోయి 71,315 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 38 పాయింట్లు పతనమై 21,419 వద్ద నిలిచింది. దీంతో సూచీల 3 రోజుల లాభాలకు ముగింపు పడినట్లైంది. ఎర్ర సముద్రంలో తలెత్తిన యుద్ధ అలజడితో చమురు సరఫరా అంతరాయాలు తలెత్తడం, అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో స్టాక్ మార్కెట్ ఉదయం స్తబ్దుగా ట్రేడైంది. ఆసియా మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య విధాన ప్రకటన, బ్రిటన్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి తదితర పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 342 పాయింట్లు క్షీణించి 71,142 వద్ద, నిఫ్టీ 92 పాయింట్లు పతనమై 21,365 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. మెటల్, ఆటో, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ, మీడియా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు అరశాతం వరకు పెరిగాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- రైల్వేలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా క్యాటరింగ్ సేవలను విస్తరించే యోచనలో ఉన్నట్లు ఐఆర్‌సీటీసీ తెలపడంతో సంస్థ షేరు 12.5% లాభపడి రూ.879 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 14% ర్యాలీ చేసి రూ.889 వద్ద 20 నెలల గరిష్టాన్ని తాకింది.
- ఇథనాల్ తయారీకి చెరకు రసం వాడకూడదంటూ కేంద్రం గతంలో జారీ చేసిన ఆదేశాలను తాజాగా ఎత్తివేయడంతో చక్కెర షేర్లు లాభపడ్డాయి. శ్రీ రేణుక 5%, ఈఐడీ ప్యారీ 1%, బల్‌రాంపూర్ చీనీ 4.50%, త్రివేణి ఇంజనీరింగ్-ఇండస్ట్రీస్ 2.50%, బజాజ్ హిందుస్థాన్ 6%, దాల్మియా షుగర్ 3.50% చొప్పున లాభపడ్డాయి.

వేదాంతా రూ. 11 మధ్యంతర డివిడెండ్

డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ వాటాదారులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2023-24) గాను రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. షేరుకి రూ. 11 చొప్పున చెల్లించనుంది. ఇందుకు డిసెంబర్ 27 రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. వెరసి తాజా డివిడెండుకు రూ. 4,089 కోట్లు వెచ్చించనున్నట్లు వేదాంతా తెలియజేసింది. ప్రయివేట్ రుణదాతల నుంచి 1.25 బిలియన్ డాలర్ల రుణ సమీకరణకు తెరతీస్తున్నట్లు గత వారం కంపెనీ మాతృ సంస్థ వేదాంతా రీసోర్సెస్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో 2024, 2025లలో గడువుతీరనున్న 3.2 బిలియన్ డాలర్ల రుణాలను రీఫైనాన్స్ చేయనున్నట్లు వివరించింది. డివిడెండ్ వార్తలతో వేదాంతా షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.5 శాతం బలపడి రూ. 261 వద్ద ముగిసింది.

విద్యార్థులకు బీవోబీ ప్రత్యేక సేవింగ్స్ ఖాతా



హైదరాబాద్: విద్యార్థుల కోసం సున్నా బ్యాలెన్స్ సదుపాయంతో ప్రత్యేక సేవింగ్స్ ఖాతాను బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ప్రారంభించింది. 16-25 ఏళ్ల వయసులోని విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'బీవోబీ బ్రో సేవింగ్స్ ఖాతా'ను రూపొందించినట్లు తెలిపింది. జీవిత కాలంపాటు కాంప్లిమెంటరీ డెబిట్ కార్డ్, ఇతర ప్రయోజనాలను ఈ ఖాతాకు అనుసంధానంగా ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రయోజనాలు..

16-25 ఏళ్ల వయసు వారికి ఈ ఖాతా సున్నా బ్యాలెన్స్‌తో వస్తుంది. ఆకర్షణీయమైన ఆఫర్లతో కూడిన ఉచిత రూపే ప్లాటినం డెబిట్ కార్డ్ సొంతం చేసుకోవచ్చు. ప్రతి త్రైమాసికానికీ విమానాశ్రయాల్లో రెండు సార్లు లాంజ్ ప్రవేశాలను పొందొచ్చు. రూ.2 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా ఉచితం. ఆటో స్వీప్ సదుపాయం కూడా ఉంది. నెఫ్ట్, ఆర్టీజీఎస్, ఐఎంపీఎస్, యూపీఐ లావాదేవీలు ఉచితం. చెక్‌లను కూడా ఉచితంగా పొందొచ్చు. ఉచిత ఎస్ఎంఎస్, ఈమెయిల్ అలర్ట్‌ల సదుపాయం కూడా ఉంది. డీమ్యాట్ ఖాతా ఏఎంసీపై నూరు శాతం రాయితీ ఉంది. విద్యా రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీ లేకపోగా, వడ్డీ రేటులో 0.15 శాతం తగ్గింపు లభిస్తుంది. ఈ ఖాతాను యువతకు చేరువ చేసేందుకు గాను ఐఐటీ బోంబేకి చెందిన మూడ్ ఇండిగోను ఎక్స్‌క్లూజివ్ బ్యాంకింగ్ పార్ట్‌నర్‌గా నియమించుకుంది.

ముత్తూట్ వివాహ సన్మానం.. దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్: ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ ముత్తూట్ వివాహ సన్మానం ప్రాజెక్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వితంతువులైన తల్లుల కుమార్తెల వివాహానికి ఆర్థిక సహాయం అందించడానికి సంస్థ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్పొరేట్ సేవా బాధ్యత(సీఎస్‌ఆర్) కార్యక్రమం ఇది. ఈ ప్రాజెక్టు కింద ప్రతి లబ్ధిదారు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని పొందవచ్చు. అర్హత కలిగిన లబ్ధిదారులు డిసెంబర్ 25 సాయంత్రం 5.30 గంటలలోగా లక్ష్మీ నారాయణ యమగాని, మేనేజర్ సీఆర్ఎస్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, హైదరాబాద్ చిరునామాకు సమర్పించాలని కంపెనీ ఒక ప్రకటనలో తెలియజేసింది. వితంతు తల్లులకు ఆర్థిక సాయం ద్వారా వారి ఆర్థిక ఒత్తిడిని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ హెడ్ బాబు జాన్ మలయల్ తెలిపారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 910 పోస్టులు

ఇండియన్ నేవీ-సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎన్‌సెట్-01/2023) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఛార్జ్‌మ్యాన్, సీనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్, ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 910
» **ట్రేడులు:** కార్పెంటర్, సీవోపీపీ, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫౌండ్రీమ్యాన్, ఎలక్ట్రోప్లేటర్, ఇండస్ట్రియల్ పెయింటర్, ప్లంబర్, సర్వేయర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి ఛార్జ్‌మ్యాన్/ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టులకు 25 ఏళ్లు, సీనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్ పోస్టులకు 27ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.18,000 నుంచి రూ.56,900.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ స్క్రీనింగ్, రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎఫ్‌డీడీఐలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **ఎఫ్‌డీడీఐ క్యాంపస్:** నోయిడా, ఫుర్సత్‌గంజ్, చెన్నై, కోల్‌కతా, రోహ్‌తక్, జోధ్‌పూర్, చింద్వారా, గుణ, అంకలేశ్వర్, పాట్నా, హైదరాబాద్, చండీగఢ్.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 2360
» **విభాగాలు:** ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ఫ్యాషన్ డిజైన్, లెదర్-లైఫ్‌స్టైల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్, రిటైల్ అండ్ ఫ్యాషన్‌మర్చండైజ్.
» **బ్యాచిలర్ డిగ్రీ(బీడిజైన్/బీబీఏ):** **అర్హత:** 10+2 ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.07.2024 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
» **మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్(ఎండిజైన్/ఎంబీఏ):** **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) 2024 ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024
» **ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 01.05.2024, 02.05.2024.
» **అడ్మిట్ కార్డుల విడుదలతేది:** 06.05.2024.
» **ప్రవేశ పరీక్ష తేది:** 12.05.2024.
» **ఫలితాల వెల్లడి తేది:** 31.05.2024.
» **కౌన్సిలింగ్ తేదీలు:** 2024 జూన్ 2 లేదా 3వ వారం.
» **వెబ్‌సైట్:** www.fddiindia.com

ఐఆర్‌ఎంఏలో పీజీడిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, ఆనంద్(ఐఆర్‌ఎంఏ).. 2024-26కు సంబంధించి పీజీడీఎం(రూరల్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(రూరల్ మేనేజ్‌మెంట్).
» **అర్హత:** ఏదైనా డిగ్రీ చేసినవారితో పాటు డిగ్రీ చివరి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **వెబ్‌సైట్:** ww.irma.ac.in

ఎన్‌ఆర్‌ఎస్‌సీ, హైదరాబాద్‌లో 54 టెక్నీషియన్ పోస్టులు

ఇస్రోకు చెందిన హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్..వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 54
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ బి(ఎలక్ట్రానిక్ మెకానిక్)-33, టెక్నీషియన్ బి(ఎలక్ట్రికల్)-08, టెక్నీషియన్ బి(ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్)-09, టెక్నీషియన్ బి(ఫొటోగ్రఫీ)-02, టెక్నీషియన్ బి(డెస్క్‌టాప్ పబ్లిషింగ్ ఆపరేటర్)-02
» **అర్హత:** ఎస్ఎస్‌సీ, సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100
» **వయసు:** 31.12.2023 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పోస్టింగ్ స్థలం:** ఎన్‌ఆర్‌ఎస్సీ-ఎర్త్ స్టేషన్ (షాద్‌నగర్/బాలానగర్), రీజినల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సెంట్రల్(నాగ్‌పూర్), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నార్త్(న్యూఢిల్లీ), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్-ఈస్ట్(కోల్‌కతా), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్-వెస్ట్(జోధ్‌పూర్), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్-సౌత్ (బెంగళూరు).
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** nrsc.gov.in

త్రివిధ దళాల్లో నర్సింగ్ ఆఫీసర్

నర్సింగ్‌లో.. బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన మహిళలకు శుభవార్త! త్రివిధ దళాల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇండియన్ మిలిటరీ నర్సింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైతే ప్రారంభంలోనే లెఫ్టినెంట్ హోదాతో కొలువు సొంతమవుతుంది. ఆకర్షణీయ వేతనం అందుకునే వీలుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టీఏ-మిలిటరీ నర్సింగ్ సర్వీస్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, రాత పరీక్ష, కెరీర్ అవకాశాలు తదితర వివరాలతో ప్రత్యేక కథనం..

» మిలటరీ నర్సింగ్ సర్వీసెస్ నోటిఫికేషన్ విడుదల
» ఎన్‌టీఏ ఆధ్వర్యంలో రాత పరీక్ష నిర్వహణ
» మలి దశలో ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్
» ఎంపికైతే లెఫ్టినెంట్ హోదాలో నర్సింగ్ ఆఫీసర్ కొలువు
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100-రూ.1,77,500



ఇండియన్ మిలటరీ నర్సింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్ ద్వారా ఆర్మీలో నర్సింగ్ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పోస్టులను భర్తీ చేస్తారు. తొలుత అయిదేళ్ల వ్యవధికి నియామకం ఖరారు చేస్తారు. ఆ తర్వాత మరో అయిదేళ్లకు పొడిగిస్తారు. అభ్యర్థుల ఆసక్తిని బట్టి చివరగా మరో నాలుగేళ్లకు సర్వీసు పొడిగిస్తారు. ఇలా మొత్తం 14 ఏళ్లపాటు మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో విధులు నిర్వర్తించే అవకాశం లభిస్తుంది.

అర్హతలు

- ఎమ్మెస్సీ నర్సింగ్/పోస్ట్ బ్యాక్యులరేట్ బీఎస్సీ(నర్సింగ్)/బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత ఉండాలి. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- వయసు: 2023, డిసెంబర్ 26 నాటికి 21- 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రతిభే ప్రామాణికం

మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తారు. అందులో వచ్చిన మార్కులు, అందుబాటులో ఉన్న పోస్టుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని.. ఒక్కో పోస్టుకు 10 మందిని చొప్పున మలి దశలో ఇంటర్వ్యూకు, మెడికల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. మలి దశ ప్రక్రియను ఇండియన్ ఆర్మీ అధికారులు చేపడతారు.

ఎన్‌టీఏ రాత పరీక్ష

మిలటరీ నర్సింగ్ సర్వీస్ ఎంపిక ప్రక్రియ తొలి దశలో రాత పరీక్షను.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించనుంది. ఈ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. బేసిక్ నర్సింగ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, క్లినికల్ స్పెషాలిటీస్ 100 ప్రశ్నలు-100 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ 10 ప్రశ్నలు-10 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 10 ప్రశ్నలు-10 మార్కులకు ఉంటాయి.

- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు.

మలి దశ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూ ప్రక్రియ మూడు నుంచి అయిదు రోజుల పాటు జరుగుతుంది. అభ్యర్థులకు జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లిష్, సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఆ తర్వాత మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు చెందిన ఉన్నతాధికారుల నేతృత్వంలో పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ ఇలా

పర్సనల్ ఇంటర్వ్యూలో భాగంగా..సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థులకున్న సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వ్యక్తిగత ఆసక్తి, అలవాట్లుతోపాటు నర్సింగ్ కెరీర్ పట్ల ఉన్న అంకిత భావాన్ని పరిశీలించేలా ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా సైకలాజికల్ అసెస్‌మెంట్‌లో భాగంగా.. అభ్యర్థుల వ్యవహార శైలి, వ్యక్తిగత వైఖరి, దృక్పథం వంటి వాటిని పరిశీలిస్తారు. ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన వారికి చివరగా మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

లెఫ్టినెంట్ హోదాతో కొలువు

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి తుది నియామకం ఖరారు చేసుకున్న వారికి లెఫ్టినెంట్ హోదాతో కొలువు ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో వేతన శ్రేణి రూ. రూ.56,100-రూ. 1,77,500గా ఉంటుంది. అంటే.. ప్రారంభంలో నెలకు రూ.లక్ష వరకు వేతనం పొందొచ్చు.

మేజర్ స్థాయికి చేరుకునే అవకాశం

నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికైన వారు.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో మేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. లెఫ్టినెంట్ హోదాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత కెప్టెన్‌గా పదోన్నతి లభిస్తుంది. కెప్టెన్ హోదాలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే మేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

విధులు ఇలా

మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు ఎంపికైన వారు.. దేశ వ్యాప్తంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు చెందిన సైనిక శిబిరాల్లో, ఆర్మీ మెడికల్ హాస్పిటల్స్‌లో, అదే విధంగా త్రివిధ దళాలకు సంబంధించి ఆయా సెక్టార్లలో ఉన్న బేస్ క్యాంప్‌లలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2023, డిసెంబర్ 26
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** డిసెంబర్ 27 – 28, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** 2024 జనవరి మొదటి వారం
- **పరీక్ష తేదీ:** 2024, జనవరి 14
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/SSCMNS

రాత పరీక్షలో రాణించేలా

మిలటరీ నర్సింగ్ సర్వీస్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షలో విజయానికి అభ్యర్థులు సిలబస్ అంశాలపై పట్టు సాధించాలి.

బేసిక్ నర్సింగ్

ఈ విభాగానికి సంబంధించి మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్ అండ్ ఎవాల్యుయేషన్, హ్యూమన్ హెల్త్, డిసీజెస్, ప్లాంట్ అండ్ హ్యూమన్ ఫిజియాలజీ, బయో టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్, బయో డైవర్సిటీ, ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

క్లినికల్ స్పెషాలిటీస్

ఇందులో పేషెంట్ కేర్, హెల్త్ కేర్ డెలివరీ సిస్టమ్స్, కేస్ స్టడీ బేస్డ్ రీసెర్చ్, ఆపరేషన్ థియేటర్ ప్రొసీజర్స్, మెడికల్ టెస్ట్స్ అండ్ ప్రొసీజర్స్, పేషెంట్ డేటా కలెక్షన్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా కమ్యూనిటీ హెల్త్‌కేర్, జనరల్ డిసీజెస్‌పైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా రీజనింగ్ అంశాలైన నంబర్ సిరీస్, స్పేస్ విజువలైజేషన్, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, విజువల్ మెమొరీ, రిలేషన్‌షిప్స్, నాన్-వెర్బల్ సిరీస్, ఫిగర్ క్లాసిఫికేషన్ వంటి అంశాలను అధ్యయనం చేయాలి.

జనరల్ ఇంగ్లిష్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ గ్రామర్ అంశాలు, సినానిమ్స్, యాంటానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సెంటెన్స్ ఫార్మేషన్, కాంప్రహెన్షన్‌లపై దృష్టి పెట్టాలి.

పాఠ్య పుస్తకాలు

రాత పరీక్షలో విజయం దిశగా అభ్యర్థులు బీఎస్సీ స్థాయిలోని నర్సింగ్ పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్స్‌ను ప్రాక్టీస్ చేయడం, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది. బీఎస్సీ నర్సింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి.. కాన్సెప్ట్‌లు, అప్లికేషన్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టాలి. అదే విధంగా క్లినికల్ స్పెషాలిటీస్‌కు సంబంధించి సమకాలీన అంశాలతో సమన్వయం చేసుకుంటూ అధ్యయనం సాగించాలి.

క్లుప్తంగా...

22న ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకలు

ముఖ్యఅతిథిగా హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం తరఫున ఈనెల 22న ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. కాగా, రాష్ట్రమంతా ఈ వేడుకలను నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కాంతి వెస్లీ వెల్లడించారు. ప్రభుత్వం ఏటా ఆనవాయితీగా క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తోందని ఆమె వివరించారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించి క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆహ్వానాలు కూడా పంపుతున్నట్లు వెల్లడించారు.

ఎఫ్‌సీఆర్ఐ అసిస్టెంట్ ప్రొఫెసర్ శాలినికి అవార్డు



సాక్షి, హైదరాబాద్: నగర శివార్లలోని ములుగు ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) అసిస్టెంట్ ప్రొఫెసర్ శాలినికి నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ (ఎన్ఈఎస్ఏ) సైంటిస్ట్ ఆఫ్ ద ఇయర్–2023 అవార్డును ప్రదానం చేసింది. సోమవారం లక్నోలో జరిగిన కార్యక్రమంలో శాలినికి యూపీ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అమృత్ అభిజిత్ సైంటిస్ట్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందజేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును సాధించడం పట్ల శాలినిని ఎఫ్‌సీఆర్ఐ అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కాగా, ఈ అవార్డుతో పాటు లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్ – ఎన్బీఆర్ఐలో మౌఖిక (ఓరల్) ప్రజెంటేషన్‌లో ఆమె ద్వితీయ బహుమతిని పొందారు.

హైదరాబాద్-మస్కట్‌కు కొత్త ఎయిర్‌లైన్స్

శంషాబాద్: హైదరాబాద్ నుంచి మస్కట్‌కు కొత్త ఎయిర్‌లైన్స్ సర్వీసు ప్రారంభమైంది. సలాం ఎయిర్‌లైన్స్ ఆదివారం ఈ కొత్త సర్వీసును ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు, జీఎంఆర్ ప్రతినిధులు రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ నాన్‌స్టాప్ విమాన సర్వీసు ప్రతి మంగళ, బుధ, శుక్ర, ఆదివారాల్లో ఉంటుందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సర్వీసులను పెంపొందించేందుకు జీఎంఆర్ సంస్థ నిరంతర చర్యలు తీసుకుందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్ తెలిపారు. ఒమన్ రాజధాని మస్కట్‌కు ప్రయాణ సౌకర్యాలు విస్తృతం చేస్తామని వెల్లడించారు.

డ్రగ్ పెడ్లర్‌గా మారిన భగ్న ప్రేమికుడు!

తొలుత డ్రగ్స్‌కు బానిసగా.. ఆ తర్వాత పెడ్లర్‌గా..

- గోవా, బెంగళూరు నుంచి కొనుగోళ్లు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయం
- స్నేహితుడితో కలిసి నెల్లూరుకు చెందిన ఓ యువకుడి నిర్వాకం
- గుట్టురట్టు చేసిన టీఎస్–నాబ్ అధికారులు
- 14 మంది అరెస్టు.. 42 ఎక్స్‌టసీ పిల్స్ స్వాధీనం



డ్రగ్ పెడ్లర్ రాజేశ్

సాక్షి, హైదరాబాద్: నగరంలో స్థిరపడిన నెల్లూరుకు చెందిన ఓ యువకుడు ప్రేమ విఫలమై డిప్రెషన్‌లో మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. స్నేహితుడి సలహా మేరకు డ్రగ్ పెడ్లర్‌గా మారి హైదరాబాద్‌తో పాటు నెల్లూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీర్లకు సరఫరా చేయడం మొదలెట్టాడు. ఈ వ్యవహారాన్ని గుట్టురట్టు చేసిన తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (టీఎస్–నాబ్) అతనితో సహా 14 మందిని అరెస్టు చేసింది. వీరి నుంచి 42 ఎక్స్‌టసీ పిల్స్ స్వాధీనం చేసుకుంది.

చేస్తున్న ఉద్యోగాలు మానేసి..

నెల్లూరులోని ఫతేఖాన్‌పేటకు చెందిన జె.ఆషిక్ యాదవ్ గతంలో బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఇతడు బీటెక్ చదువుతున్న రోజుల్లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఓ యువతి కూడా ఉన్నత చదువుల కోసం అక్కడికే రావడంతో ఇద్దరూ కొన్నాళ్లు సహజీవనం చేశారు. అయితే ఇద్దరి మధ్యా వివాదాలు ఏర్పడటంతో ఆమె ఆషిక్‌కు దూరమైంది. దీంతో తీవ్ర డిప్రెషన్‌కు గురైన ఆషిక్ మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. బెంగళూరు, గోవాలకు చెందిన డ్రగ్స్ సప్లయర్స్ నుంచి మాదకద్రవ్యాలు ఖరీదు చేసి వినియోగించే వాడు. గతేడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌కు వచ్చిన ఆషిక్ నానక్‌రామ్‌గూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. ఓ మల్టీనేషనల్ కంపెనీలో నెలకు రూ.22 వేల జీతం వస్తున్నా సరిపోకపోవడంతో గత జూన్‌లో ఆ ఉద్యోగం మానేసి మరో ఉద్యోగం కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు.

మనమే ఆ దందా చేద్దామంటూ..

ఈ క్రమంలో నెల్లూరుకే చెందిన ఇతని క్లాస్‌మేట్ రాజేశ్ వ్యాపార నిమిత్తం ఆగస్టులో హైదరాబాద్ వచ్చాడు. డ్రగ్స్ వినియోగించే అలవాటు ఉన్న ఇతడు ఆషిక్ నుంచి వాటిని తీసుకునే వాడు. నగరంలో మాదకద్రవ్యాలకు ఉన్న డిమాండ్ గుర్తించిన రాజేశ్ తామే ఆ దందా చేద్దామని, మార్కెట్‌లో ఎక్స్‌టసీ పిల్స్‌కు మంచి డిమాండ్ ఉందని, వాటినే తీసుకువచ్చి విక్రయిద్దామని చెప్పాడు. దీంతో గోవాకు చెందిన తన స్నేహితుడు బాబాతో పాటు బెంగళూరుకు చెందిన సాయి చరంద్ నుంచి డ్రగ్స్ ఖరీదు చేస్తున్న ఆషిక్ వాటిని నగరానికి తీసుకువచ్చి రాజేష్‌కు అప్పగిస్తున్నాడు. ఇతడు నగరంతో పాటు నెల్లూరులోని తన స్నేహితులు, రెగ్యులర్ కస్టమర్లకు వీటిని విక్రయిస్తున్నాడు. అక్కడ ఒక్కో ఎక్స్‌టసీ పిల్‌ను రూ.1000కి ఖరీదు చేసి... ఇక్కడ రూ.3 వేలకు అమ్ముతున్నారు. గత మంగళవారం గోవా వెళ్లిన ఆషిక్ అక్కడ బాబాకు రూ.60 వేలు చెల్లించి 60 ఎక్స్‌టసీ పిల్స్ ఖరీదు చేసుకువచ్చాడు. వీటిని తన వద్ద ఉంచుకున్న రాజేష్... శనివారం రెండు పిల్స్‌ను ఆషిక్‌కు ఇచ్చి తమ కస్టమర్లకు అందించమని చెప్పాడు. ఇతడి కదలికలపై టీఎస్–నాబ్‌కు సమాచారం అందింది. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం శనివారం ఉదయం అమీర్‌పేటలోని మైత్రీవనం వద్ద ఆషిక్‌ను పట్టుకుని రెండు పిల్స్ స్వాధీనం చేసుకుంది. అతడిచ్చిన సమాచారంతో సోమ వారం ఎస్ఆర్ నగర్‌లోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్ పై దాడి చేసింది. అక్కడ రాజేష్‌తో పాటు 12 మంది చిక్కారు. వీరికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ వచ్చింది. వీరి నుంచి మరో 40 పిల్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసింది. ఇద్దరినీ న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.

డ్రగ్స్‌తో అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్‌లో రేవ్ పార్టీలు

డ్రగ్స్ ఖరీదు చేసిన కొందరు గతంలో అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్‌ల్లోని సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌లో రేవ్ పార్టీలు చేసుకున్నట్లు ఆధారాలు లభించాయి. ఓ బర్త్‌డే పార్టీతో పాటు న్యూ ఇయర్ వేడుకల కోసం కొందరు వీరి నుంచి ఈ పిల్స్ ఖరీదు చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. టీఎస్–నాబ్ అధికారులు తదుపరి చర్యల నిమిత్తం కేసును ఎస్సార్ నగర్ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి.

నిందితుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు

ఆషిక్, రాజేష్ నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లను విశ్లేషించిన పోలీసులు రెగ్యులర్‌గా డ్రగ్స్ ఖరీదు చేసే 33 మందిని గుర్తించారు. వీరి వద్ద ఈ డ్రగ్ కొనుగోలు చేస్తున్న వారిలో నెల్లూరుకు చెందిన సంపత్, నిహార్, మోహిత్, అశోక్, అమిత్, జై, వసీమ్, ఫయాజ్, శ్రీరామ్, గౌతమ్, గిరిధర్, హనీష్, వేలాసరి, డాక్టర్ పునీత్, డాక్టర్ అరుణ్ మత్, డాక్టర్ ప్రశాంత్, నగరానికి చెందిన శ్రీరామ్, హృతిక్ ఉన్నారు. వీరిలో కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాగా మిగిలిన వాళ్లు ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు డాక్టర్లు.



పరశురాముడిగా భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాచలంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

23న యాదాద్రిలో ముక్కోటి ఏకాదశి

అదేరోజు నుంచి అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట: ఈ నెల 23వ తేదీన ముక్కోటి (వైకుంఠ) ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ముక్కోటి ఏకాదశికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ఆలయ ఉత్తర రాజగోపురం, తిరువీధులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అదేరోజు నుంచి ఆలయంలో ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ డీఈవో భాస్కర్‌శర్మ తదితరులు పరిశీలించారు.

సరోగసీ ద్వారా పుంగనూరు కోడెదూడ జననం

మేలు జాతి దేశీ ఆవుల పునరుత్పత్తికి ఏపీ ప్రభుత్వం కృషి

ఐవీఎఫ్ఈటీ విధానంలో పుంగనూరు కోడెదూడ జన్మించడం దేశంలోనే ఇదే తొలిసారి



పుంగనూరు కోడె దూడ

సాక్షి, అమరావతి/ రైల్వేకోడూరు : దేశంలోనే తొలిసారి ఓ నాటు ఆవుకు పుంగనూరు జాతి కోడెదూడ జన్మించింది. చింతలదీవి పశు క్షేత్రంలో అభివృద్ధి చేసిన ఏడు రోజుల వయస్సున్న ఘనీకృత పుంగనూరు జాతి పిండాన్ని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట గ్రామానికి చెందిన పమిడిగంటం హరిరావుకు చెందిన నాటు ఆవు గర్భంలో స్థానిక పశువైద్యుడు డాక్టర్ ప్రతాప్ మార్చి 4న ప్రవేశపెట్టగా, మే 25న ఈ నాటు ఆవు చూలు కట్టినట్లుగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అబ్దుల్ ఆరీఫ్ నిర్ధారించారు. చూలుకాలంలో పశువు ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.2,500 విలువైన దాణా, ఖనిజ లవణాలతో కూడిన మేతను ఆర్బీకే ద్వారా ఉచితంగా అందించారు. ఈ నాటు ఆవు ఈనెల 17వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో మేలుజాతి పుంగనూరు జాతి కోడెదూడకు జన్మనిచ్చింది. కోడెదూడ చాలా ఆరోగ్యంగా ఉందని పశువైద్యులు ధృవీకరించారు. దేశంలోనే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ అండ్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ విధానంలో పుంగనూరు కోడెదూడ జన్మించడం ఇది తొలిసారి.

తొలిసారిగా సాహివాల్ దూడకు..: గతేడాది ఇదే విధానంలో ఒంగోలు ఆవుకు సాహివాల్ దూడ జన్మించింది. తిరుపతి ఎస్వీ గో సంరక్షణ శాలలో మేలు జాతి ఆవుల అండాలు సేకరించి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఐవీఎఫ్ ల్యాబ్‌లో కృత్రిమంగా పిండాలను అభివృద్ధి చేసి టీటీడీ గోసాలలోని ఆవులలో ప్రవేశపెట్టి దేశంలోనే తొలిసారిగా సాహివాల్ దూడకు జన్మనిచ్చేలా చేశారు. ఈసారి ఓ రైతు ఇంట ఓ నాటు ఆవు గర్భంలో సరోగసి విధానంలో పిండమార్పిడి చేసి మేలుజాతి పుంగనూరు దూడకు జన్మనివ్వడం గమనార్హం. సమీప భవిష్యత్‌లో మేలుజాతి దేశీ ఆవుల సంతతిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వ సహకారంతో కృషిచేస్తామని చింతలదీవి పశు క్షేత్రానికి చెందిన శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

దేశానికి కీలక ఆస్తి మానవ వనరులే

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్



ఐఎస్‌బీలో మాట్లాడుతున్న ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాంరాజన్

రాయదుర్గం: మానవ వనరులపై సకాలంలో దృష్టి పెట్టడం భారతదేశ ఆర్థిక వృద్ధికి కీలకమని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ఆయన ఆర్థికవేత్త రోహిత్ లాంబాతో కలిసి రచించిన 'బ్రేకింగ్ ది మౌల్డ్' పుస్తకంపై ఐఎస్‌బీ ప్రొఫెసర్ భగవాన్ చౌదరితో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లోని ఖేమ్కా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ, రాబోయే దశాబ్దాలలో దేశాభివృద్ధికి ఊతమిచ్చే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం అత్యంత ముఖ్యమైన ఆస్తిగా మానవ వనరులని చెప్పవచ్చని, పెద్ద సంఖ్యలో వారికి సరైన శిక్షణ ఇవ్వగలిగితే దేశానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దేశంలో అభివృద్ధికి అనేక ప్రణాళికలు ఉన్నాయని, అయితే వాటిని అమలు చేయడంలోనే లోపం ఉందని తెలిపారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలుగా మారడానికి లక్ష్యాలను నిర్దేశించుకునే ముందు ఆరోగ్య సంరక్షణ, విద్యా సౌకర్యాల కొరతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు వీలవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఐఎస్‌బీ లాంటి విద్యాసంస్థలో చదివే విద్యార్థులు చాలా మంది ఉద్యోగాలు సృష్టించడం కంటే ఉద్యోగాలు చేయడం పైనే దృష్టి సారించారని రఘురాం రాజన్ పేర్కొన్నారు. విద్యార్థులంతా సంస్థలను స్థాపించి తాము ఉపాధి పొందుతూ, నలుగురికి ఉపాధి కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. దేశంలోని అగ్రశ్రేణి వ్యాపార పాఠశాలల్లో ఐఎస్‌బీ ఒకటని, ఈ విద్యాసంస్థ దేశంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టించే సత్తా కలిగిన విద్యార్థులను తయారు చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహ రచయిత రోహిత్ లాంబా, పలువురు ఐఎస్‌బీ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తరగతి గదిలో నాగుపాము



చిన్నశంకరంపేట(మెదక్): తరగతి గదిలో నాగుపాము ప్రవేశించడంతో కలకలం ఏర్పడింది. మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండలంలోని శేరిపల్లి గ్రామ జెడ్పీ పాఠశాల 6వ తరగతి గదిలో మధ్యాహ్నం బోధన జరుగుతోంది. ఈ సమయంలో ఎక్కడి నుంచో వచ్చిన నాగుపాము గదిలోకి ప్రవేశించింది. వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయుడు విద్యార్థులందరినీ గదిలో ఒక మూలకు చేర్చారు. అనంతరం గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని చాకచక్యంగా పామును బయటకు తరమడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

టుడేస్ గ్రాఫిక్



2023లో వికీపీడియా(ఇంగ్లిష్)లో ఏ ఆర్టికల్‌ను జనం ఎక్కువ చూశారు? (విజిట్స్ ఆధారంగా..)



మహాలక్ష్మీ.. ఆదుకోవమ్మా..

మహబూబాబాద్: 'మహాలక్ష్మి' పథకంతో ఉపాధి కోల్పోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కోర్టు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించి వివేకానంద సెంటర్‌లో బైఠాయించారు.

సరిహద్దులో రెడ్ అలర్ట్

అడవుల్లోకి చొచ్చుకెళ్తున్న భద్రతా దళాలు

- ఎదురుదాడి చేస్తున్న మావోయిస్టులు
- తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉద్రిక్తత



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 23వ వార్షికోత్సవాల నేపథ్యంలో గత నెల రోజులుగా మావోయిస్టులు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. భద్రతా దళాలపై ఎదురుదాడికి దిగుతున్నారు. దీనికి ప్రతిగా భద్రతాదళాలు సైతం కౌంటర్ అటాక్ చేపడుతున్నాయి. దీంతో ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దు పంచుకుంటున్న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు మావోయిస్టులకు గడ్డు రోజులుగా పేర్కొంటారు. ఆకురాలే కాలం కావడంతో అడవులు పలచబడటం, అడవుల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో మావోయిస్టులు ఎదురుదాడులకు దిగరు. దట్టమైన అడవుల్లోని సేఫ్ జోన్‌లోకి వెళ్లిపోతారు. ఈ సమయంలో భద్రతా దళాలు మావోయిస్టులే లక్ష్యంగా భారీగా అడవులను జల్లెడ పడుతుంటాయి. గతానికి భిన్నంగా ఈ సారి మావోయిస్టులు పంథా మార్చారనే అభిప్రాయం క్రమంగా బలపడుతోంది.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి రావడంతో మారిన మావోల పంథా

ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఛత్తీస్‌గఢ్‌లో తిరిగి అధికారం దక్కించుకుంది. మొదటి నుంచీ మావోయిస్టుల పట్ల బీజేపీ కఠిన వైఖరితోనే ఉంది. ఆ రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అణచివేస్తామని ఎన్నికల ప్రచారంలోనూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలుమార్లు చెప్పారు. తాజాగా అక్కడ బీజేపీ అధికారంలోకి రావడంతో మావోయిస్టులు తమ వ్యూహంలో మార్పులు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీలోకి భారీగా రిక్రూట్‌మెంట్లు జరిగాయంటూ ఇటీవల మావోయిస్టు అగ్రనేతలు వరుసగా ప్రకటనలు చేశారు. దీన్ని అనువుగా చేసుకుని రాబోయే రోజుల్లో భద్రతా దళాల దూకుడు నివారించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఈనెల 2 నుంచి 9 వరకు జరిగిన పీఎల్‌జీఏ వారోత్సవాల సమయంలోనే భద్రతా దళాలు లక్ష్యంగా దాడులు మొదలు పెట్టారు.

బలగాలు చొచ్చుకొస్తున్నాయనే..

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ భద్రతా దళాలు క్రమంగా అడవుల్లోకి చొచ్చుకుపోతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో సలాతోగు ప్రాంతంలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేశాయి. అక్కడి నుంచి మరో పది కిలోమీటర్లు అడవుల్లోకి చొచ్చుకుని వెళితే మావోయిస్టులకు కీలకమైన సప్లై చైన్‌పై భద్రతా దళాలకు పట్టు చిక్కే అవకాశం ఉంది. దీంతో పాటు మావోయిస్టులకు నిత్యావసర సరుకులు చేర వేసే వార సంతలపైనా నిఘా పెంచాయి. దీంతో భద్రతా దళాల వేగానికి క్లెం వేయకపోతే తమ ఉనికి ప్రమాదం తప్పదనే ఉద్దేశంతో మావోయిస్టులు దూకుడు పెంచి ఎదురుదాడికి దిగుతున్నారని తెలుస్తోంది.

వ్యాపారులకు బెదిరింపులు

తెలంగాణతో సరిహద్దు పంచుకుంటున్న బీజాపూర్, సుకుమా జిల్లాల్లో పలు సంతల్లో తెలంగాణ వ్యాపారులు క్రయవిక్రయాలు నిర్వహిస్తుంటారు. దీంతో అనివార్యంగా స్థానికులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. అయితే ఇటీవల తెలంగాణ వ్యాపారులకు బెదిరింపులు ఎక్కువయ్యాయి. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారంటూ మావోయిస్టులు కిడ్నాప్ చేసి, హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరోవైపు మావోయిస్టులకు వస్తువులు సరఫరా చేస్తున్నారంటూ పోలీసుల వైపు నుంచీ నిఘా పెరగడం, ఆరా తీయడం వ్యాపారులకు ఇబ్బందిగా మారింది.

నెల వ్యవధిలో తొమ్మిది హింసాత్మక ఘటనలు

ఛత్తీస్‌గఢ్‌లో గత నెల 17తో పోలింగ్ ముగిసింది. అప్పటి నుంచి ఈనెల 17 వరకు మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య తొమ్మిది సార్లు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. అందులో నలుగురు భద్రతా సిబ్బంది, ఒక బీజేపీ నేత ప్రాణాలు కోల్పోయారు. బాంబులు పేలడం, నిర్వీర్యం చేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో పోలింగ్ జరిగిన నవంబర్ 30న చర్లలో మందుపాతరను గుర్తించిన పోలీసులు.. పోలింగ్ ముగిసిన తర్వాత దాన్ని పేల్చివేశారు.

ఇటీవలి ముఖ్యమైన ఘటనలు ఇలా..

- ఈనెల 17న సుకుమా జిల్లాలో జరిగిన కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ 165వ బెటాలియన్‌కు చెందిన ఎస్ఐ సుధాకర్‌రెడ్డి మరణించగా, కానిస్టేబుల్ రాము గాయపడ్డారు.
- 14న కాంకేర్ జిల్లాలో బాంబు పేలుడులో జవాను మరణం
- 13న నారాయణపూర్ జిల్లాలో బాంబు పేలి జవాన్ మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
- 9న నారాయణపూర్ జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిని మావోయిస్టులు కాల్చి చంపారు.

హద్దులు దాటిన అభిమానం

బిగ్‌బాస్ బీభత్సం

- కంటెస్టెంట్ల అభిమానుల వీరంగం
- పరస్పర దాడులు
- పలువురికి గాయాలు




ధ్వంసమైన ఆర్టీసీ బస్సు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్

బంజారాహిల్స్: అభిమానం హద్దులు దాటడంతో జూబ్లీహిల్స్‌లో బీభత్సం నెలకొంది. ఆరు ఆర్టీసీ బస్సులపై బిగ్‌బాస్ సీజన్–7 కంటెస్టెంట్ల అభిమానులు రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. పోలీసుల వాహనాల పైనా దాడి చేయడంలో ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. పలువురు కంటెస్టెంట్ల వాహనాలు ధ్వంసమయ్యాయి. అర్ధరాత్రి అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల వద్ద భయానక వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే..ఆదివారం రాత్రి అన్నపూర్ణ స్టూడియోలో బిగ్‌బాస్ సీజన్–7 ఫైనల్స్ జరిగాయి. అప్పటికే పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న ఫైనల్స్ విజేత పల్లవి ప్రశాంత్, రన్నరప్ అమర్‌దీప్ అభిమానులు నినాదాలు చేస్తూ ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. స్టూడియో నుంచి బయటికి వస్తున్న కార్లపై దాడులకు తెగపడ్డారు. రన్నరప్ అమర్‌దీప్ కారు అద్దాలను ధ్వంసం చేయడంతో ఆయన కారులో నుంచి బయటికి పరుగులు తీసి ఓ చెట్టు చాటున దాక్కోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కొద్ది సేపటికే మరో కంటెస్టెంట్ అశ్విని శ్రీతో పాటు గత సీజన్ కంటెస్టెంట్ గీతూ రాయల్ వాహనాలపైనా దాడి చేశారు. అంతటితో ఆగక అటుగా వెళ్తున్న హెచ్‌సీయూ, రాణిగంజ్ డిపోలకు చెందిన ఆరు బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. ఓ డ్రైవర్‌కు రాయి తగిలి గాయమైంది. రాణిగంజ్ డిపోకు చెందిన డ్రైవర్ ఖాసిం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు వాహనాలపైనా దాడికి దిగడంతో సీపీ రిజర్వ్ పోలీసు వాహనాలు ధ్వంసం అయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా దాడులకు పాల్పడిన వారి కోసం గాలింపు చేపట్టారు. పోలీసులు లాఠీ చార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో స్టూడియో యజమానుల నిర్లక్ష్యం ఉందని భావించిన పోలీసులు వారిపై కేసు నమోదు చేసే యోచనలో ఉన్నారు. సరైన భద్రతా ఏర్పాట్లు చేసుకోకుండా స్టూడియో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా దర్యాప్తులో తేలింది. కంటెస్టెంట్లపై అదుపు లేనందునే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బిగ్‌బాస్ సీజన్-7 విజేత పల్లవి ప్రశాంత్

బిగ్‌బాస్ సీజన్-7 విజేతపై క్రిమినల్ కేసు నమోదు

బిగ్‌బాస్ సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో హీరో నాగార్జున బిగ్‌బాస్–7 విజేతగా పల్లవి ప్రశాంత్‌ను ప్రకటించారు. అప్పటికే రన్నరప్ అమర్‌దీప్ అభిమానులు పెద్ద సంఖ్యలో స్టూడియో బయట వేచి ఉన్నారు. వారికి తోడుగా పలువురు కంటెస్టెంట్ల అభిమానులు అక్కడికి చేరుకుని నినాదాలు చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పల్లవి ప్రశాంత్‌ను రెండో గేటు నుంచి జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేష్, సిబ్బంది బయటికి పంపించారు. తాను ఇంటికి వెళ్తున్నానని చెప్పిన ప్రశాంత్ కొద్ది సేపటికే తన అనుచరులతో కలిసి ఓపెన్‌టాప్ జీప్‌పై మళ్లీ స్టూడియో వద్దకు వచ్చాడు. అప్పటికే ఆగ్రహంగా ఉన్న అమర్‌దీప్ అభిమానులు, ఇతర కంటెస్టెంట్ల అభిమానులు రాళ్లతో పరస్పర దాడులకు దిగారు. ఈ ఘటనలో రెండు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు లాఠీ చార్జ్ చేసి ప్రశాంత్‌ను అక్కడి నుంచి పంపారు. అప్పటికే పరిస్థితి అదుపుతప్పడంతో పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, సాయుధ బలగాలతో అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. ఎస్ఐ రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రశాంత్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రశాంత్‌ను అరెస్ట్ చేసేందుకు సన్నాహాలు చేపట్టారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.